అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 16-4-2024

సంపుటి : 10 సంచిక : 56

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు వెల : 6.50

కుప్పకూలింది



- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి
- దలాల్ స్ట్రీట్‌లో సెన్సెక్స్ 845 పాయింట్ల పతనం
- ఇరాన్- ఇజ్రాయిల్ యుద్ధం ఎఫెక్ట్
- అదానీ షేర్లపైనా ఒత్తిడి

ముంబయి : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఆందోళనలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ యుద్ధానికి తెగబడొచ్చనే అంచనాలు సోమవారం దలాల్ స్ట్రీట్‌ను కుప్పకూలేలా చేశాయి. అమ్మకాల ఒత్తిడితో ...11లో



సమన్వయంతో పని చేద్దాం

- చెక్ పోస్టుల వద్ద మరింత అప్రమత్తత అవసరం : తెలంగాణ, ఏపీ సీఎస్‌ల భేటీలో నిర్ణయం

ఎన్నికల నిర్వహణలో పకడ్బందీగా వ్యవహరిద్దాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు నిర్ణయించాయి. అంతర్రాష్ట్ర ఎన్నికలు, సంబంధిత అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణా రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ రవి గుప్తా, అడిషనల్ డీజీలు శివధర్ రెడ్డి, మహేష్ భగవత్, ఏపీ అడిషనల్ డీజీ డాక్టర్ శంకబ్రత బాగ్చి, ఏపీ వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ, తెలంగాణా పీసీసీఎఫ్ ఆర్.ఎం.డొబ్రియెల్, ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ, మే 13న జరిగే పోలింగ్‌ను సక్రమంగా ...11లో

మళ్లీ తీహార్ జైలుకు కవిత

- 9 రోజుల జ్యుడీషియల్ కస్టడీ
- ఇది బీజేపీ కస్టడీ : కవిత
- కోర్టు ప్రాంగణంలో మాట్లాడడంపై స్పెషల్ జడ్జి సీరియస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మళ్లీ తీహార్ జైలుకి తరలించారు. ఇప్పటికే ఈడీ కేసులో తీహార్ జైల్లో ఉన్న ఆమెను సీబీఐ కస్టడీకి అనుమతివ్వగా సీబీఐ విచారించింది. కస్టడీ ముగియడంతో సోమవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో కవితను ప్రవేశపెట్టారు. కోర్టు మళ్లీ జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈసారి సీబీఐ దాఖలు చేసిన కేసులో ఆమెకు తొమ్మిది రోజులు కస్టడీ విధిస్తున్నట్టు ఉత్తర్వుల్లో ...11లో



ఆగస్టు 15 నాటికి

రెండు లక్షల రుణమాఫీ

వచ్చే పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో ప్రతి గింజా కొంటాం

'ఇందిరమ్మ కమిటీల ద్వారానే సంక్షేమ పథకాలందజేస్తాం. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం. ముదిరాజులను బీసీ-డీ నుంచి 'ఏ'లోకి మార్చుతాం. 15 ఎంపీ స్థానాలు గెలిపిస్తే మంత్రివర్గంలో ముదిరాజ్ బిడ్డను తీసుకుంటాం. ఎస్సీల వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ఇస్తాం. బీసీలకు న్యాయం చేసేందుకు కులగణనకు తీర్మానం చేశాం. రెండునెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం. కుట్రలతో కూడిన బంగ్లా రాజకీయాలు చెల్లవు. రాష్ట్రంలో ఐదు స్థానాల్లో బీజేపీ గెలుపునకు బీఆర్ఎస్ ఒప్పందం కుదిరింది. కవిత బెయిల్ కోసం కేసీఆర్ కుమ్మక్కయ్యారు. మోడీ కాళ్ల వద్ద బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు పెట్టారు. నన్ను దించాలంటున్న వారు మోడీని ఎందుకనడం లేదు..'

- నారాయణపేట జనజాతరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ- నారాయణపేట నుంచి మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"ఎన్ని కష్టాలు వచ్చినా ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. సంక్షేమ పథకాల అమలుకు ఇందిరమ్మ కమిటీలు వేస్తాం.. వాటి ద్వారానే ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలందేలా చర్యలు తీసుకుంటాం. రెండు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి. తన బిడ్డ కవిత కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్ల కింద పెట్టారు. మాదిగల ఏబీసీడీ వర్గీకరణ కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది.. భవిష్యత్‌లో మాదిగలకు మరిన్ని పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో జనజాతర బహిరంగ సభలో పార్లమెంటు ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ పాలమూరు -రంగారెడ్డి, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల పథకాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలోని ముదిరాజ్‌లంతా ఏకతాటిపైకి వచ్చి 15 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముదిరాజ్‌లను మంత్రి మండలిలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పదిశాతంగా ఉన్న ముదిరాజ్‌లకు కేసీఆర్ ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదని, ఈ ...2లో

43 రోజులు.. రూ.4 వేలకోట్లకు పైనే

లోక్‌సభ ఎన్నికల చరిత్రలోనే భారీగా నగదు పట్టివేత

- తొలి విడతలోనే రికార్డు స్థాయిలో స్వాధీనం
- బీజేపీ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్‌లలో అత్యధికం..



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ఎన్నికల సమయంలో కట్టల కొద్దీ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు పట్టుబడుతున్నాయి. రికార్డు స్థాయిలో రికవరీ జరిగింది. గత 75 ఏండ్ల లోక్‌సభ ఎన్నికల చరిత్రలోనే తొలిసారిగా భారీ నగదు ఈ ఎన్నికల సమయంలో పట్టుబడినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. సోమవారం ఈసీ వెల్లడించిన వివరాల ప్రకారం మార్చి 1 నుంచి ఏప్రిల్ 13 వరకు తొలి విడతలో డబ్బు, మద్యం, బంగారం, ఇతర వస్తువుల రూపంలో మొత్తం రూ. 4,658.16 కోట్లు రికవరీ అయ్యింది. అంటే సగటున రోజుకు రూ.100 కోట్ల మేర రికవరీ జరిగింది. ఇందులో నగదు రూ.395.39 కోట్లు కాగా, బంగారం, వెండి వంటి విలువైన లోహాల రూపంలో రూ.562.10 కోట్లు రికవరీ ...11లో



కేజ్రీవాల్ కేసులో ఈడీకి సుప్రీం నోటీసులు

- 24లోగా సమాధానమివ్వాలని ఆదేశం
- కేజ్రీకి సత్వర ఉపశమనానికి నిరాకరణ
- 23 వరకు కస్టడీ పొడిగింపు
- కరుడుగట్టిన నేరస్తుడిలా కేజ్రీవాల్‌ను ట్రీట్ చేస్తున్నారు : పంజాబ్ సీఎం 2లో..



మోడీ ప్రభుత్వ అప్రకటిత ఎమర్జెన్సీ

- ఆర్థిక, సామాజిక రాజకీయ విశ్లేషకులు పాపారావు
- "అలుపెరగని పోరాటం" పుస్తకావిష్కరణ వివరాలు 3లో



- రాబోయే రుతుపవనాలపై ఐఎండీ అంచనా 11లో..

ముఖాముఖి



నిరంకుశత్వాన్ని ప్రజలు సహించరు

తిరుగులేదనుకుంటే మోడీని చిత్తుగా ఓడిస్తారు

- 400పైగా సీట్లంటూ భ్రమలు కల్పిస్తున్న బీజేపీ
- తెలంగాణలో ఒక్క సీటూ గెలవకుండా తీర్పునివ్వాలి
- రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతి అమలుకు కుట్ర
- ప్రజాస్వామ్యం, లౌకికత్వం ధ్వంసం
- వామపక్ష, లౌకిక శక్తుల గెలుపే దేశానికి, రాజ్యాంగానికి రక్షణ
- నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రశ్నించే వారిని బెదిరించడానికే ఈడీ, సీబీఐ

'సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు అధికారం ఇస్తే ప్రధాని మోడీ మాత్రం రాముడిని అడగాలని అంటున్నారు. సమస్యలను పరిష్కరించని ప్రధాని మోడీ అధికారంలో ఎందుకుండాలి. తక్షణమే గద్దెదిగిపోవాలి. ప్రజలు నిరంకుశత్వాన్ని సహించరు. ఎమర్జెన్సీని చూసిన ప్రజలు ఆ తర్వాత ఇందిరాగాంధీని చిత్తుగా ఓడించారు. ఇప్పుడు మోడీకీ అదే గతి పడుతుంది. తెలంగాణలో ఒక్క ఎంపీ స్థానం బీజేపీ గెలవకుండా ప్రజలు తీర్పునివ్వాలి. ఓటమి భయంతోనే ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారు. బ్యాంక్ ఖాతాలు సీజ్ చేస్తున్నారు. ప్రశ్నించే వారిని బెదిరించడానికి, ప్రతిపక్ష నాయకులను లొంగదీసుకోవడానికే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి. బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది. ప్రజాస్వామ్యం, లౌకికత్వం ధ్వంసమవుతున్నాయి. వామపక్ష, లౌకిక అభ్యర్థులను గెలిపిస్తే దేశానికి, ప్రజలకు, రాజ్యాంగానికి రక్షణ ఉంటుంది. ప్రజలు ఆ దిశగా తీర్పునివ్వాలి.'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయన నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

వివరాలు 3లో



తెలంగాణకు బీజేపీ ఏం చేసింది?

- క్యాలెండర్లు, చిత్రపటాలేనా..
- 'పాలమూరు- రంగారెడ్డి'కి జాతీయ హోదా హామీ ఏమైంది?
- రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ -కోస్గి

"తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని గత ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ హామీ ఇచ్చి విస్మరించారు.. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో క్యాలెండర్లు, చిత్ర పటాలు, చీరలు పంచుతున్నారని" అని ...11లో

ఎన్నికల చౌరస్తాలో రైతు

పోటాపోటీగా కాంగ్రెస్, బీజేపీ దీక్షలు

- కరువు, భూగర్భజలాలు పడిపోవటంపై బీఆర్ఎస్ విమర్శనాస్త్రాలు
- నల్లచట్టాలు, ఎమ్ఎస్‌పీ గ్యారంటీ, రైతుల మరణాలే కాంగ్రెస్ అస్త్రాలు
- రైతుబంధు, రుణమాఫీపై ఫోకస్ పెట్టిన బీజేపీ
- కిషన్‌రెడ్డి రైతు దీక్షలో కార్యకర్తలదే హడావిడి

ఎన్నికలొస్తే చాలు రాజకీయ పార్టీలకు, నేతలకు అన్నదాత గుర్తుకువస్తారు.అదిగో ఇదిగో అంటూ ఎన్నో హామీలు గుమ్మరిస్తారు.ఓట్ల పండుగ అయ్యాక..ఇచ్చిన హామీలు..చెప్పిన మాటలు కనుచూపుమేరలో వినిపించవు. ఇపుడు సార్వత్రిక సమరంలో మరోసారి రైతన్నను ఎన్నికల చౌరస్తాలో నిలబెట్టారు. పోటాపోటీగా రైతులకోసం కాంగ్రెస్,బీజేపీ దీక్షలు చేస్తుంటే..తాను మాత్రం ప్రేక్షకుడిలా మారిపోయానని అన్నదాత లోలోన ఆవేదన చెందుతున్నాడు.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


పంటలేయడం.. రక్షించుకోవడం కోసం అప్పులు తేవడం.. కోతకోయడం.. ఆపైన మార్కెట్‌లో తిప్పలు పడటం..'మద్దతు' దక్కక అడ్డికి పావుసేరుకు అమ్ముకోవడం.. తినీ తినక మిగిలిన దాంట్లో ఎంతో కొంత అప్పు తీర్చడం...మళ్లీ కొంత పంట వేయటం కోసం సన్నద్ధం కావడం.. అన్నదాతల కాలచక్రం ఇదే. ప్రతి ఏటా జరిగే తంతూ ఇదే. పార్టీ ఏదైనా ఎన్నికల ముందు వాగ్దానాలే తప్ప ఏలుబడిలో వారికి చేసిందేమీలేదు. ఈ తంతు మారిందీ లేదు. కాగా, తాజా సార్వత్రికంలో రాజకీయ నేతలు తమ లబ్ది కోసం మరోసారి ఎన్నికల చౌరస్తాలో అన్నదాతలను నిలబెట్టారు. రైతుల కష్టాలను తీర్చిందేమీ లేకపోగా, వాటిని తమకు అనుకూలంగా మలుచుకుని ఓట్లుగా మార్చుకునే పనిలో పార్టీలు పడ్డాయి. అన్నదాతకు అసలు కారణాలేంటో అర్థం కాకుండా ఈ పరిస్థితులకు మీరంటే మీరే కారణమంటూ విమర్శనాస్త్రాలను ఎక్కుపెట్టి లబ్దిపొందే వేటలో పడ్డాయి. బీఆర్ఎస్ నేతలు ఎండిన పంటలను హైలెట్ చేస్తూ 'కాంగ్రెస్ వచ్చింది.. కరువొచ్చింది' అంటూ ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో చేసిన తప్పిదాలను కాంగ్రెస్ నేతలు ఎత్తిచూపుతున్నారు. తామొచ్చి నాలుగు నెలలే అవుతున్నదనీ, భూగర్భజలాలు అంతకంటే ముందే పడిపోయాయని ...2లో

నిరంకుశత్వం, అణచివేతల పర్వంలో సార్వత్రిక సమరం

ఇది రిగ్గింగ్‌తో సమానం

- ప్రతిపక్షాలపై వేధింపులు : ఆర్థికవేత్త జీన్ డ్రీజ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: నిరంకుశత్వం, ప్రతిపక్షాల గొంతుకల అణచివేతల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త జీన్ డ్రీజ్ విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న ఈ వైఖరి రిగ్గింగ్‌తో సమానమని చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రముఖ రచయిత అరుంధతీ రాయ్ చేసిన వ్యాఖ్యను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీజేపీ, ప్రతిపక్షాల మధ్య జరిగిన పోటీని ఇటలీ స్పోర్ట్స్ కారు ఫెర్రారీ, కొన్ని సైకిళ్ల మధ్య జరిగిన పోరుగా అరుంధతీ రాయ్ వర్ణించారని తెలిపారు. అది ఇప్పటికీ వర్తిస్తుందని పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జీన్ చెప్పారు.



'సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. ఆ ఫెర్రారీ (బీజేపీ)కి కార్పొరేట్ రంగం ఇంధనాన్ని అందిస్తోందన్న విషయం మనకు తెలుసు. అదే సమయంలో జార్ఖండ్ ముక్తిమోర్చా, జనతాదళ్, కాంగ్రెస్ వంటి సైకిళ్లను (ప్రతిపక్షాలు) ఓ పద్ధతి ప్రకారం లక్ష్యంగా ఎంచుకున్నారు' అని జీన్ వ్యంగ్యోక్తులు విసిరారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన స్వాగతించారు. బీజేపీ పాలనలో ప్రతిపక్ష నేతలు సంవత్సరాల తరబడి కేంద్ర దర్యాప్తు సంస్థల వేధింపులను భరించాల్సి వచ్చిందని తెలిపారు.

'జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ కటకటాల వెనుక ఉన్నారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ అనేక సందర్భాలలో నిర్బంధాలు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అలాంటి చర్యలను తృటిలో తప్పించుకున్నారు. కానీ ...11లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఎన్నికల చౌరస్తాలో రైతు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో దీక్షపెట్టి రైతులకు కేంద్ర ప్రభుత్వం ఏవిధంగా నష్టం చేకూరుస్తున్నదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు మూడు నల్లచట్టాలను కేంద్రం తెస్తున్నదనీ, ఎమ్మెస్పీ ధర అడిగితే ఇవ్వట్లేదనీ, చట్టాల రద్దు, ఎమ్మెస్పీ కోసం ఢిల్లీ పురవీధుల్లో పోరుబాట పట్టిన అన్నదాతలపై కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. 700మందికిపైగా అన్నదాతలను పొట్టనబెట్టుకున్న తీరును ఎండగడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా రైతు కేంద్రంగా చేస్తున్న ఆందోళనతో ఉలిక్కి పడ్డ బీజేపీ నేతలు తామేమీ తక్కువ కాదన్నట్టుగా అన్నదాతల పల్లవి ఎత్తుకున్నారు. డిసెంబర్ 9న చేస్తానన్న రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు, కౌలు రైతులకు పంట సహాయం కింద ఇస్తామన్న రూ.15 వేలు ఏమయ్యాయంటూ ప్రశ్నించడం మొదలుపెట్టారు. బీఆర్ఎస్ నేతల వలే క్షేత్రస్థాయిలోకి మాత్రం వెళ్లడం లేదు. ఎన్నికల వేళ రైతుల ఆగ్రహం తమ పుట్టి ముంచుతుందని గ్రహించారో ఏమోగానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే సోమవారం రైతుదీక్ష నిర్వహించారు. ఆ దీక్ష ఎన్నికల షోను తలపించింది. ఆ దీక్షలో పట్టుమనీ పది మంది రైతులు కూడా కనిపించలేదు. హడావిడి అంతా ఆ పార్టీ కార్యకర్తలదే. కంకులు పోసి, కోతకొచ్చిన మూడు వరిపైర్ల కట్టలు తెచ్చి అక్కడ షో చేయడంపై విమర్శలొచ్చాయి. కిసాన్ సెల్ నాయకులు, అడ్వకేట్లే ఎక్కువగా కనిపించారు. మొక్కుబడిగా యాదాద్రి జిల్లా బొమ్మల రామారం మండలం హాజీపూర్ నుంచి కొందరు మహిళలను, వృద్ధులను తీసుకొచ్చి దీక్షలో కూర్చోబెట్టారు. ఇలా పోటీపడి దీక్షలు, విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టుకుంటున్నారే తప్ప దేశంలోని రైతాంగం ఈ స్థితిలో ఉండటానికి కారకులెవ్వరు? పర్యావరణ సమతుల్యత దెబ్బతినడానికి, భూగర్భజలాలు వేగంగా పడిపోవడానికి పాలకులు అనుసరిస్తున్న విధానాలు ఏవిధంగా కారణమవుతున్నాయి? ఎమ్ఎస్.స్వామినాథన్ సిఫారస్సులను ఎందుకు అమలు చేయడం లేదు? సబ్సిడీల్లో కోతలతో రైతులపై ఏవిధంగా భారాలు పెరిగిపోతున్నాయి? ఇలాంటి అంశాలను ఎక్కడా చర్చకు రానివ్వడంలేదు. సమస్యకు మీరంటే మీరే కారణమంటూ అన్నదాతల పట్ల తమ కపట ప్రేమను ఒలకబోస్తున్నారు. సమస్య మూలాల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు.

రైతులను నిండా ముంచిన వ్యక్తి కేసీఆర్

- కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చినా రైతుల బతుకులు మారలే : రైతుదీక్షలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతే రాజు అంటూ అన్నదాతలను నిండా ముంచిన వ్యక్తి కేసీఆర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. క్రాఫ్ ఇన్స్యూరెన్స్ లేకపోవడం వల్ల అనేక మంది రైతులు ఆత్మహత్యల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా రైతుల బతులకు మారలేదని చెప్పారు. గ్యారెంటీలతో రైతులను దగా చేస్తున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రైతుదీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నన్ని రోజులు రాహుల్ ప్రధాని కాలేరని నొక్కి చెప్పారు. రైతులు నమ్మి ఓట్లు వేస్తే నయాపైసా రుణం ఇవ్వడం లేదని విమర్శించారు. ఇక్కడ వసూళ్లు చేసి ఢిల్లీకి పంపడంపై ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ నేతలకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. మోడీ ఇచ్చిన గ్యారెంటీ ప్రతి రైతు అకౌంట్లలో డబ్బులు పడుతున్నాయన్నారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వమే అన్ని సహాయ సహకారాలు అందిస్తోందని మరోమారు చెప్పారు. మోడీ ప్రధాని అయ్యాక దేశంలో యూరియా కొరత లేకుండా చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చిన రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న సాయం ఏదని ప్రశ్నించారు. డిసెంబర్ 9 దాటి నాలుగు నెలలు అవుతున్నా రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన పాపానికి రైతులు పుట్టెడు దు:ఖంలో ఉన్నారన్నారు. రైతులకు వెన్ను పోటు పొడిచే ప్రభుత్వాలే రాష్ట్రాన్ని శాసిస్తున్నాయని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. రైతులకు ఏ సమస్యలొచ్చినా బీజేపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలనీ, 9904119119 నెంబర్ ఇవాళ్టి నుంచి తెలంగాణ రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. కిసాన్ సమ్మీదికి అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర లోకసభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి.. తరువాత మాట తప్పడం కాంగ్రెస్ కు అలవాటు అయిపోయిందని విమర్శించారు. రైతులకు డబ్బులు ఇవ్వడానికి రేవంత్‌రెడ్డి సర్కారు వద్ద పైసలు లేవుగానీ ఢిల్లీ కాంగ్రెస్‌కు ఇవ్వడానికి ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఏపూరి సోమన్న

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న సోమవారం కాంగ్రెస్‌లో చేశారు. మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో సోమవారం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏపూరి సోమన్న షర్మిల స్థాపించిన వైఎస్ఆర్‌టీపీలో చేరి.. తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగి తెలంగాణ శాసనసభ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏపూరి సోమన్నకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆగస్టు 15 నాటికి రెండు లక్షల రుణమాఫీ

(మొదటిపేజీ తరువాయి)



సామాజిక తరగతికి చెందిన ప్రజలను బీసీ -డీ నుంచి బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చేందుకు సుప్రీంకోర్టులో పోరాడుతామన్నారు. మాదిగల రిజర్వేషన్ పట్ల దోబూచులాడుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని గెలిపిస్తే ఏబీసీడీ వర్గీకరణ కోసం న్యాయపరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాదిగల రిజర్వేషన్ విషయంలో గతంలో ఉద్యమం చేస్తే ఎత్తుకెళ్లి బయటపడేసిన విషయం మందకృష్ణ మాదిగకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. పదేండ్ల పాటు అధికారంలో ఉన్నా మోడీ, బీజేపీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే కృష్ణ, వికారాబాద్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. శాసనసభ ఎన్నికలలో గుత్త పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు, జమీందారులకు తాము టికెట్లు ఇవ్వలేదని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికి టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకున్నామని చెప్పారు. పార్టీ పదవులకే కాదు సంక్షేమ పథకాల విషయంలోనూ సామాజిక న్యాయం పాటిస్తామన్నారు. గద్వాల కోట సాక్షిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బంగ్లా రాజకీయాలు చేసి డీకే అరుణ ఆధ్వర్యంలో మామా అల్లుళ్ల కలిసి బీసీ అభ్యర్థి సరితను ఓడించడానికి కుట్ర చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే గృహజ్యోతి రూ.500కే గ్యాస్ అమలు చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సూచనమేరకు నారాయణపేట అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

రేవంత్‌రెడ్డిని ఎందుకు పడగొట్టాలని అనుకుంటున్నారు..?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిసారీ రేవంత్‌రెడ్డిని పడగొట్టాలని పిలుపునివ్వడం ఎటువంటి సంకేతాన్నిస్తుందని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మూడు నెలల కాలంలోనే ఆరు హామీలను పూర్తి చేసినందుకా.. నియంత పాలన అంతం చేసి సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నందుకా.. ప్రతి పేద కుటుంబానికీ రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని చెప్పినందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చాలనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డిని ఊడగొట్టాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అంటున్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హెూదా కావాలని ఆమె ఎప్పుడైనా మోడీని అడిగారా?, మక్తల్, వికారాబాద్ రైల్వేలైన్ కావాలని డిమాండ్ చేశారా? అని రేవంత్ ప్రశ్నించారు. పదేండ్లుగా అధికారంలో ఉన్న మోడీని దించాలని ఎందుకు అనడం లేదని కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రానికి పాలమూరు లాంటి పేద జిల్లా పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితే మీకు కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. అనతి కాలంలోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగ యువతలో భరోసా కల్పించామని గుర్తు చేశారు. ఉచిత విద్యుత్, బీమా, బీసీ గణన వంటివి అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకుంటామన్నారు. రాష్ట్రంలో ఐదు స్థానాలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకున్నదని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తేనే కవిత జైలు నుంచి బయటకు వస్తుందన్న భరోసాతో కేసీఆర్ ముందుకెళ్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులారా మీ నాయకుడు కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీని ఓడించి తెలంగాణలో 15 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, పార్లమెంటు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, శ్రీహరి, ఎన్నం శ్రీనివాసరెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వనజ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

500 టన్నులు పట్టివేత

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- రైస్ మిల్లులో అక్రమ పీడీఎస్ రైస్ గుర్తింపు
- రైస్‌మిల్లు నడుపుతున్న వ్యక్తి అరెస్టు.. పరారీలో ప్రధాన నిందితుడు
- 3 లారీలు, 4 డీసీఎంలు సీజ్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రూపేష్

నవతెలంగాణ-పటాన్‌చెరు



ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ పీడీఎస్ రైస్(రేషన్ బియ్యం)ను పక్కదారి పట్టిస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాశమైలారంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ సోమవారం వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ రకాల అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లాలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అక్రమ మద్యం, కల్తీ పాలు, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన టాస్క్‌ఫోర్స్, పోలీసు బృందాలు.. తనిఖీల్లో భాగంగా సోమవారం సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో పాశమైలారం గ్రామంలో అక్రమంగా నడుపుతున్న ఓ రైస్ మిల్లును పరిశీలించారు. ఈ దాడిలో సుమారు 500 టన్నుల పీడీఎస్ రైస్‌ను గుర్తించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌టౌన్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి.. కొంతకాలంగా స్థానికంగా రైస్ మిల్లును నడుపుతున్నాడు. ప్రభుత్వం నుంచి వడ్లు కొనుగోలు చేసి, తన రైస్ మిల్లులో ఆడించి.. ప్రభుత్వ పంపిణీ పీడీఎస్ రైస్‌గా మార్చి ఎఫ్‌సీఐ గోదాంకు తరలిస్తారు. ఇదే అదనుగా భావించిన ప్రభాకర్ రెడ్డి.. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పీడీఎస్ రైస్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని క్లీన్ చేసి తిరిగి బ్యాగ్‌ల్లో నింపి ఎఫ్‌సీఐ మార్క్ ముద్రించి.. యథావిధిగా ఎఫ్‌సీఐ గోదాంకు పంపాల్సిన రైస్‌తో కలిపి పంపిస్తూ అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. అయితే తన అక్రమ వ్యాపారానికి తరుచూ పోలీసుల చెకింగ్‌ల నుంచి తప్పించుకోవడానికి.. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న పాశమైలారంలో ఒక ప్లాట్‌ను లీజుకు తీసుకున్నాడు. అందులో రైస్ మిల్లును అక్రమంగా ఏర్పాటు చేసి, బోధన్‌లో రైస్ మిల్లును నడిపిన అనుభవమున్న రవి అనే వ్యక్తిని నియమించాడు. సమాచారం బయటకు పొక్కకుండా 15 మంది బీహార్ కార్మికులను పెట్టుకొని ఈ వ్యాపారాన్ని ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన ఈ పీడీఎస్ రైస్‌ను క్లీన్ చేసి మళ్లీ బ్యాగుల్లో నింపి ఎఫ్‌సీఐ మార్క్ ముద్రించి, లారీల్లో లోడ్ చేసేవారు. అనంతరం బోధన్‌లోని రైస్ మిల్లుకు ఫోన్ చేసి ఆ లారీ నెంబర్‌తో పాటు వినాయక ట్రేడర్స్ రాంపూర్, ఆదిలాబాద్ పేరు మీద ఎఫ్‌సీఐ వై బిల్లు తీసుకునేవారు. దాన్ని ద్వారా ఆదిలాబాద్ ఇచ్చోడా వంటి పలు ప్రాంతాలకు బియ్యాన్ని తరలించేవారు. కాగా సోమవారం టాస్క్‌ఫోర్స్, పోలీసు బృందాలు చేసిన దాడిలో ఈ మిల్లులో సుమారు 500 టన్నుల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు 3 లారీలు, 4 డీసీఎంలను సీజ్ చేసినట్టు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రెడ్డి పరారీలో ఉండగా.. పాశమైలారం రైస్ మిల్లును నడుపుతున్న రవిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, ఇన్‌స్పెక్టర్ శేఖర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో విజిలెన్స్ ఎస్పీ శశిధర్ రాజు, అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, బీడీఎల్ భానూర్, పటాన్‌చెరు సీఐలు రవీందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం



- అభివృద్ధి చేయకుండా.. మత రాజకీయాలు చేస్తున్న మోడీ : సీపీఐ, సీపీఐ(ఎం)జిల్లా సదస్సులో ఆయా పార్టీల జిల్లా కార్యదర్శులు

నవతెలంగాణ-సంగారెడ్డి

కార్పొరేట్ శక్తులతో జతకట్టిన మోడీ ప్రభుత్వాన్ని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలుగుతామని సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు గొల్లపల్లి జయరాజు, జలాలుద్దీన్ అన్నారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యాలయం కేకే భవన్‌లో సోమవారం నిర్వహించిన సీపీఐ, సీపీఐ(ఎం) జిల్లా సదస్సులో వారు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏం లేకనే మతరాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. మతోన్మాద కార్పొరేట్ విధానాల వల్ల బీజేపీ పట్ల దేశ వ్యాప్తంగా వ్యతిరేకత పెరిగిందన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థలకు పెనుప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేండ్లలో ప్రభుత్వ అండతో దేశ, విదేశీ బడా కార్పొరేట్లు లక్షల కోట్ల రూపాయలను కొల్లగొట్టాయని, అంతకు పదిరెట్ల వరకు బీజేపీ ఎన్నికల బాండ్లు తదితర రూపాల్లో కుంభకోణాలకు పాల్పడిందని అన్నారు. ఈ విషయాలను ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తోందని ఆరోపించారు. చివరికి మీడియాను సైతం బెదిరించి తన గుప్పిట్లో పెట్టుకున్నదని, ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఎన్నికల బాండ్లను మొదటి నుంచీ కమ్యూనిస్టు పార్టీలు వ్యతిరేకిస్తూనే ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు కలుగచేసుకొని.. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యానికి ఎన్నికల బాండ్లు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ధరలు, నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. గతంలో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. పదేండ్ల మోడీ పాలన అప్రకటిత ఎమర్జెన్సీని, నయా ఫాసిజాన్ని తలపిస్తోందన్నారు. ప్రజాస్వామ్యం కలిగిన మన దేశంలో పీకల్లోతు అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన నియంతృత్వ బీజేపీ పాలనకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు మల్లేశం, రాజయ్య, మాణిక్, నర్సింలు, యాదగిరి, అశోక్, కృష్ణ, రమేష్, మహేష్, సంతోష్, సురేష్, సీపీఐ నాయకులు రహమాన్, ఆనంద్, తాజుద్దీన్ మహబూబ్ ఖాన్, లక్ష్మీ, రుబిన, శంకరప్ప, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మతం పేరుతో అసమానతలకు ఆజ్యం

మళ్లీ అధికారం కోసం బీజేపీ అడ్డదారులు

- ఆ పార్టీ ఓటమే లక్ష్యం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-గోవిందరావుపేట



పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం, మళ్లీ అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ మతం పేరుతో ప్రజల్లో అసమానతలను సృష్టిస్తోన్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో సీపీఐ(ఎం) జిల్లా స్థాయి విస్తృత సమావేశం సోమవారం పొదిళ్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. పదేండ్లుగా దేశంలో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించి పాలనను గాలికొదిలేసిందని విమర్శించారు. అధికారమే పరమావధిగా ప్రతిపక్ష పార్టీలను, నాయకులను అణగదొక్కుతూ.. ఈడీ దాడులతో భయభ్రాంతుల కు గురిచేస్తోందన్నారు. రైతుల సంక్షేమం, గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు, రైతులను కూలీలుగా మార్చేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. బీజేపీ పాపాల పుట్టను కదిలించేందుకే ఇండియా కూటమి ఏర్పడిందని తెలిపారు. మత ఛాందసవాదాన్ని తుద ముట్టించేందుకే అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వస్తున్నాయని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడా బీజేపీ ప్రాబల్యం లేదన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ఆ పార్టీ పట్ల ప్రజలు విరక్తితో ఉన్నారని చెప్పారు. వీటన్నింటి నుంచి గట్టెక్కేందుకే రాముడు, రామ మందిరం, మతం రంగుతో ప్రజలను ఆకట్టుకునేందుకు యత్నిస్తోందని విమర్శించారు. 400 సీట్లు వస్తాయంటూ.. రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నారని, మనువాదాన్ని అమలు చేసేందుకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాలకు బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ అంబానీ, అదానీలకు వంతపాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించాలని బీజేపీయేతర పార్టీలన్నీ ఏకతాటిపైకొచ్చి కూటమిగా ఏర్పడుతుంటే.. రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ సోయి లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో మాజీ కేసీఆర్ కుమార్తె కవితను జైల్లో పెట్టిన బీజేపీని ఓడించేందుకు సన్నద్ధం కావాలే తప్ప ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొడతామని అనడం సరికాదన్నారు. కాంగ్రెస్ కలిసొచ్చినా.. రాకున్నా బీజేపీ ఓటమే లక్ష్యంగా సీపీఐ(ఎం) ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి, నాయకులు బీరెడ్డి సాంబశివ, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం రాజేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ దావూద్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ కేసులో ఈడీకి సుప్రీం నోటీసులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం స్కాం కేసులో ఈడీకి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈనెల 24లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. 29న విచారణ జరుపనుంది. అయితే మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌కు సత్వర ఉపశమనం కల్పించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈడీ అరెస్టును సవాల్ చేస్తూ అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అరవింద్ కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. కేసు తదుపరి విచారణను వేగవంతం చేయాలని కోరారు. అయితే ఈ నెల 29లోపు విచారణ జరపలేమని కోర్టు తెలిపింది.

ఏప్రిల్ 23 వరకు కస్టడీ పొడిగింపు

ప్రస్తుతం ఉన్న కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 23 వరకు పొడిగిస్తున్నట్టు రౌస్ అవెన్యూ కోర్టు తెలిపింది. ఈ కేసులో స్పెషల్ జడ్జి కావేరి బవేజా సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 23న కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరచాలని కోర్టు తెలిపింది. ఈ కేసులో ఆయనను మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది.

జైల్లో కరుడుగట్టిన నేరస్తుడిలా ట్రీట్ చేస్తున్నారు : పంజాబ్ సీఎం

అరవింద్ కేజ్రీవాల్‌ను నేరస్తుడిలా ట్రీట్ చేస్తున్నారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. సోమవారం తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను ఆయన కలిశారు. ఒక గ్లాస్‌వాల్ గుండా ఫోన్‌లో కేజ్రీతో మాట్లాడారు. దాదాపు 30 నిమిషాల పాటు వీరు మాట్లాడుకున్నారు. అనంతరం భగవంత్ మాన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను కేజ్రీవాల్‌ని అలా చూసి ఉద్వేగానికి లోనయ్యాను. ఆయనని అక్కడ ఓ కరుడుగట్టిన నేరస్థుడిలా ట్రీట్ చేస్తున్నారు. క్రిమినల్స్‌కు దక్కే సౌకర్యాలు కూడా ఆయనకు ఇవ్వడం లేదు. ఆయన చేసిన నేరం ఏంటి..? దేశంలోని అతిపెద్ద టెర్రరిస్టుల్లో ఒకరిని పట్టుకున్నట్టుగా వారు వ్యవహరిస్తున్నారు' అని విమర్శించారు. జైల్లో ఎలా ఉన్నారని తాను అడిగినప్పుడు.. కేజ్రీవాల్ తన గురించి చెప్పలేదని, పంజాబ్ రాష్ట్ర ప్రజల గురించి అడిగారని భగవంత్ మాన్ తెలిపారు. పంజాబ్‌లో పరిస్థితులు, అభివృద్ధి, ప్రజలకందుతున్న సౌకర్యాల గురించే అడిగారని చెప్పారు. ఆప్ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, తామంతా కేజ్రీవాల్‌తో కలిసే ఉంటామని పేర్కొన్నారు.

డోంట్ వర్రీ..

- అదుపులో వున్న 17మంది భారత సిబ్బందిని త్వరలో కలుసుకోవచ్చు !
- భారత అధికారులకు ఇరాన్ హామీ
- ఇరాన్, ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రులకు జై శంకర్ ఫోన్

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్‌తో సంబంధాలున్న నౌక ఎంఎస్‌సి ఆరిస్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత, తమ అదుపులోకి తీసుకున్న నౌకలోని 17మంది భారతీయ సిబ్బందిని కలుసుకునేందుకు త్వరలోనే భారత అధికారులను అనుమతిస్తామని ఇరాన్ హామీ ఇచ్చింది. విదేశాంగ మంత్రి జై శంకర్ ఆదివారం రాత్రి ఇరాన్, ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రులతో మాట్లాడిన నేపథ్యంలో ఈ హామీ వెలువడింది.

జై శంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అమిర్ అబ్దుల్లాల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలను సోమవారం విడుదల చేశారు. ఇజ్రాయిల్‌లో ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడి గురించి వారు చర్చించారని, అలాగే గాజాలో, ఎర్ర సముద్రంలో పరిస్థితులపై కూడా వారు చర్చించారని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. ఈ దాడిలో ఏడుగురు ఇరాన్ దౌత్యవేత్తలు, కమాండర్లు చనిపోయారు. జై శంకర్ కూడా ఈ సమాచారంపై ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఈ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితులపై చర్చించాం. ఉద్రిక్తతలు మరింత పెచ్చరిల్లకుండా నివారించేందుకు గల ప్రాధాన్యతను నొక్కి చెప్పాం. సంయమనం పాటిస్తూ, దౌత్య మార్గాలను చేపట్టాల్సిన ఆవశ్యకతపై మాట్లాడాం. అవసరమైతే పరస్పరం చర్చించుకుని, మాట్లాడేందుకు కూడా అంగీకారం కుదిరింది." అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

స్వాధీనం చేసుకున్న నౌక వివరాలు, అందులోని భారతీయ సిబ్బంది వివరాలు తెలియచేశామని, త్వరలోనే వారిని భారత ప్రభుత్వ ప్రతినిధులు కలుసుకునేందుకు గల అవకాశాలను తెలియచేస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి తెలియచేసినట్లు విదేశాంగ శాఖ ప్రకటన పేర్కొంది. భారత ప్రభుత్వ ఆందోళన గురించి కూడా వారికి తెలియచేశామని జై శంకర్ చెప్పారు.

ఇరు దేశాలతో భారత్‌కు పటిష్టమైన వ్యూహాత్మక సంబంధాలున్న నేపథ్యంలో భారత్ తటస్థ వైఖరి అవలంబిస్తోంది. దీనిపై ఇజ్రాయిల్ మాజీ దౌత్యవేత్త డేనియల్ కార్మన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన అధికారులు

- పలు జిల్లాల్లో ఘటనలు


ఎల్కతుర్తి లో


ఆసిఫాబాద్ లో


నల్లగొండ లో

నవతెలంగాణ-ఎల్కతుర్తి/ఆసిఫాబాద్/నల్లగొండటౌన్

అవినీతికి పాల్పడిన అధికారులను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన ఘటనలు హన్మకొండ, ఆసిఫాబాద్, నల్లగొండ జిల్లాల్లో సోమవారం చోటుచేసుకున్నాయి. బాధితులు, ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రవీందర్.. హుజూరాబాద్ డిపోలో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఫిబ్రవరి 12న రవీందర్ మేనబావ కుమారుడు హేమంత్ ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌లో చనిపోగా ఆరోజు రవీందర్ డ్యూటీకి వెళ్లలేదు. దాంతో డిపో మేనేజర్ శ్రీకాంత్ చార్జీ మెమో ఇచ్చారు. దీన్ని ఎత్తివేయడానికి రూ.30వేలు లంచం అడగగా రవీందర్ రూ.10 వేలు ఇచ్చాడు. మిగతా డబ్బుల కోసం డిపో మేనేజర్ డిమాండ్ చేయగా.. విసుగు చెందిన రవీందర్ ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం ప్రయివేటు హెూటల్‌లో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టుకు శ్రీకాంత్‌ను తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట సీఐలు శ్యాంసుందర్, రాజు, సిబ్బంది ఉన్నారు.

కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్ర పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్ఐ రాజ్యలక్ష్మి.. రోడ్డు ప్రమాద కేసులో కారు యజమాని నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 31న మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ వస్తున్న క్రమంలో బూరుగుడ ప్రధాన రహదారిపై మద్యం తాగి ఉన్న ఇరువురూ ద్విచక్ర వాహనంపై వస్తూ ఓ కారును ఢీకొట్టారు. కారులో ఉన్న బాధితుడు యహీయా ఖాన్ వెంటనే 108, 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. అదే రోజు బాధితుడు జిల్లా కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో పిటిషన్ ఇవ్వడానికి ప్రయత్నించగా తీసుకోలేదు. తెల్లవారి మళ్లీ వచ్చి ఎస్ఐ రాజ్యలక్ష్మిని సంప్రదించగా లోక్ అదాలత్‌లో కేసు కొట్టి వేసేలా సెక్షన్లు వేస్తామని, రూ.40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుడు ఏప్రిల్ 4న ఒకసారి, తిరిగి ఆదివారం స్టేషన్‌కు మరోసారి రాగా రూ.25వేలు ఇవ్వమని ఎస్ఐ అడిగారు. బాధితుడు వెంటనే ఏసీబీ అధికారులకు సమాచారం అందించగా.. డబ్బులిచ్చే క్రమంలో ఎస్ఐని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఏసీబీ కోర్టుకు అప్పగించినట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని నూకల వెంకట చారిటబుల్ ఆస్పత్రిలో మెడికల్ షాప్ అనుమతి కోసం గత నెల చిట్టెపు సైదిరెడ్డి దరఖాస్తు చేసుకున్నాడు. మెడికల్ షాప్‌నకు అనుమతివ్వాలంటే రూ.20వేలు చెల్లించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ డిమాండ్ చేయగా, బేరమాడి రూ.18 వేలిచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సోమవారం షాపు యజమాని సైదిరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచన మేరకు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్‌కు రూ.18 వేలు ఇస్తుండగా తన కార్యాలయంలోనే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

నిరంకుశత్వాన్ని ప్రజలు సహించరు

తిరుగులేదనుకుంటే మోడీని చిత్తుగా ఓడిస్తారు

- 400పైగా సీట్లంటూ భ్రమలు కల్పిస్తున్న బీజేపీ
- తెలంగాణలో ఒక్క సీటూ గెలవకుండా తీర్పునివ్వాలి
- ప్రశ్నించే వారిని బెదిరించడానికే ఈడీ, సీబీఐ
- రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతి అమలుకు కుట్ర
- ప్రజాస్వామ్యం, లౌకికత్వం ధ్వంసం
- వామపక్ష, లౌకిక శక్తుల గెలుపే దేశానికి, రాజ్యాంగానికి రక్షణ

నవతెలంగాణతో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య



'సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు అధికారం ఇస్తే ప్రధాని మోడీ మాత్రం రాముడిని అడగాలని అంటున్నారు. సమస్యలను పరిష్కరించని ప్రధాని మోడీ అధికారంలో ఎందుకుండాలి. తక్షణమే గద్దెదిగిపోవాలి. ప్రజలు నిరంకుశత్వాన్ని సహించరు. ఎమర్జెన్సీని చూసిన ప్రజలు ఆ తర్వాత ఇందిరాగాంధీని చిత్తుగా ఓడించారు. ఇప్పుడు మోడీకీ అదే గతి పడుతుంది. తెలంగాణలో ఒక్క ఎంపీ స్థానం బీజేపీ గెలవకుండా ప్రజలు తీర్పునివ్వాలి. ఓటమి భయంతోనే ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారు. బ్యాంక్ ఖాతాలు సీజ్ చేస్తున్నారు. ప్రశ్నించే వారిని బెదిరించడానికి, ప్రతిపక్ష నాయకులను లొంగదీసుకోవడానికే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి. బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది. ప్రజాస్వామ్యం, లౌకికత్వం ధ్వంసమవు తున్నాయి. వామపక్ష, లౌకిక అభ్యర్థులను గెలిపిస్తే దేశానికి, ప్రజలకు, రాజ్యాంగానికి రక్షణ ఉంటుంది. ప్రజలు ఆ దిశగా తీర్పునివ్వాలి.'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు **ఎస్ వీరయ్య** అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయన నవతెలంగాణ ప్రతినిధి **బొల్లె జగదీశ్వర్**కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

'ఓడిపోతామనే భయంతోనే మోడీ ప్రజలకు అబద్ధాలు చెప్పి భ్రమల్లో ముంచుతున్నారు. సొంతంగా 370, మిత్రపక్షాలతో కలిపి 400 సీట్లకుపైగా వస్తాయంటున్నారు. ఉత్తర భారత్‌లో యూపీ, బీహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌లలో ఎక్కువ ఎంపీ సీట్లు గతంలోనే గెలిచారు. అక్కడ కోల్పోవడం తప్ప కొత్తగా గెలిచే అవకాశం లేదు. కేంద్రంలో, ఆయా రాష్ట్రాల్లో బీజేపీ పాలన వల్ల ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఉత్తర బారత్‌లో సీట్లు తగ్గుతాయి. దక్షిణ భారత్‌లో పాగా వేయాలన్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. కర్నాటక, తెలంగాణలో అధికారంలోకి రావాలన్న ఆశలు గల్లంతయ్యాయి. తమిళనాడు, కేరళలో బీజేపీ అడుగుపెట్టే పరిస్థితి లేదు. తెలంగాణలో ఉన్న నాలుగు సీట్లూ కోల్పోయే అవకాశమే ఉంది. అయినా బీజేపీ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నది.'అని వీరయ్య అన్నారు.

'ఇండియా కూటమి నాయకులను అరెస్టు చేయడం బీజేపీలో నెలకొన్న భయాన్ని సూచిస్తున్నది. ఈ కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీ. మోడీ గద్దెదిగిపోతే కాంగ్రెస్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది. దాన్ని అడ్డుకోవడానికి దొడ్డిదారిన తప్పుడు పద్ధతులను బీజేపీ అనుసరిస్తున్నది. కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్లను సీజ్ చేసింది. ఆ పార్టీ వద్ద డబ్బుల్లేకుండా చేసింది. బీజేపీ వద్ద మాత్రం లెక్కలేనంత డబ్బుంది. దాంతో ఓట్లు కొనొచ్చు. కనీవినీ ఎరుగనిరీతిలో ప్రచారానికి డబ్బు ఖర్చు చేయొచ్చు. కాంగ్రెస్‌కు మాత్రం ఆ అవకాశం లేకుండా చేయాలన్నదే వారి ఎత్తుగడ. దీన్ని బట్టి మోడీ, బీజేపీ ఎంత భయపడుతున్నారో అర్థమవుతున్నది. కేజ్రీవాల్, సోరేన్, కవితను జైల్లో పెట్టారు. బీఆర్ఎస్‌ను లొంగదీసుకోవడానికి బ్లాక్‌మెయిల్ చేస్తున్నది. ఆప్ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ఇండియా కూటమిలో ఆప్ ముఖ్యపాత్ర పోషిస్తున్నది. ముఖ్యమంత్రులనే అరెస్టు చేశామంటే ఇతర నాయకులు భయపడి లొంగిపోతారన్నది బీజేపీ ఎత్తుగడగా ఉన్నది.'అని వీరయ్య చెప్పారు.

'ఎమర్జెన్సీని చూసిన ప్రజలు కన్నెర్ర జేస్తే బీజేపీ కొట్టుకుపోతుంది. తిరుగులేదనుకున్న ఇందిరాగాంధీ చిత్తుగా ఓడిపోయారు. నియంతలకు అదే గతి పడుతుంది. మోడీ అంతకంటే దుర్భర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్రజాస్వామిక పద్ధతులను, నిరంకుశ పద్ధతులను అనుసరించిన నాయకులు చరిత్రలో అవమానకర పద్ధతిలో దెబ్బతిన్నారు. అధికారం మోజులో పడే నాయకులకు ఈ వాస్తవాలు అర్థం కావు. చుట్టూ ఉన్న వారు భజన చేస్తారు తప్ప వాస్తవాలను చెప్పరు. అందుకే ప్రజల్లో వస్తున్న మార్పులను గమనించలేకపోతున్నారు. కచ్చితంగా ప్రజలు ఆగ్రహిస్తారు. బీజేపీ వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోక తప్పదు.'అని వీరయ్య హెచ్చరించారు.



'కాంగ్రెస్‌తో మా పార్టీకి వైరుధ్యం ఇప్పుడు కూడా ఉన్నది. దేశంలో జాతీయ పార్టీలుగా ఉండి పారిశ్రామికవేత్తలు, భూస్వాములకు అండగా ఉన్నది కాంగ్రెస్, బీజేపీలు. ఆ పార్టీలతో సాధారణ ప్రజలకు ఉన్న వైరుధ్యమే సీపీఐ(ఎం)కు ఉంది. అయితే సమస్యల పరిష్కారం కోసం కొట్లాడే ప్రజలను బీజేపీ మతం పేరుతో చీల్చుతున్నది. దేశంలో కార్మికులు, రైతులు, కూలీలు, మహిళలు, బడుగు బలహీనవర్గాలు ఎవరి సమస్యలనూ బీజేపీ పరిష్కరించలేదు. సామాజిక అణచివేత పెరిగింది. విద్యావైద్యం సామాన్యులకు అందడం లేదు. మధ్యతరగతి ప్రజలకు భారంగా మారింది. అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలమైంది. అన్నింటికీ మించి ప్రజాస్వామ్యానికే చేటు తెస్తోంది. అందువల్ల మారిన పరిస్థితుల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా చూడ్డం కీలకమైన కర్తవ్యం.'అని వీరయ్య చెప్పారు.



'ఎన్నికల బాండ్ల పేరుతో అవినీతిని చట్టబద్ధం చేశారు. సుప్రీంకోర్టు చెంపదెబ్బతో బీజేపీ గుట్టు రట్టయ్యింది. మోడీ ప్రధానిగా ఉండి అవినీతిని ప్రోత్సహించారు. ఆయన మంత్రివర్గంలో అవినీతిపరులున్నారు. దీనిపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నది. దాన్ని అణచివేసేందుకు అప్రజాస్వామిక చర్యలకు పూనుకున్నారు. ప్రశ్నిస్తే దేశద్రోహి అని ముద్రవేస్తున్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ సంస్థలను ప్రధాని చేతుల్లో పెట్టుకున్నారు. ప్రశ్నించే వారిని బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ సాధనాలుగా వాడుతున్నారు. ఎంతటి అవినీతిపరులైనా బీజేపీ కండువా కప్పుకుంటే పునీతులవుతున్నారు. లొంగకుంటే అరెస్టు చేసి జైల్లో పెడుతున్నారు. నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారు.'అని వీరయ్య అన్నారు.

'మతాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం వాడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి ఉన్నపుడు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించింది. కానీ మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడలేదు. మతరాజ్యం స్థాపించాలనే లక్ష్యంతో బీజేపీ పనిచేస్తున్నది. మతాన్ని, దేవున్ని రాజ్యంతో, రాజకీయాలతో కలపడం ప్రమాదకరమైనది. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు మతాన్ని వినియోగిస్తున్నారు. 80 శాతం హిందువులను ఓటుబ్యాంకుగా చేసుకునే ఎత్తుగడ చేస్తున్నారు. మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నారు. రాజ్యాంగం మౌలిక పునాదులను ధ్వంసం చేస్తున్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని ధ్వంసం చేస్తున్నారు. పౌరసత్వానికి కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేదు. కానీ సీఏఏ పేరుతో పౌరసత్వానికి మతం రంగు పులుముతున్నారు.'అని వీరయ్య చెప్పారు

'భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేయాలని చూస్తున్నారు. కులవ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. మహిళలకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు. ఇది దేశ ప్రజలకు, ప్రజాస్వామ్యానికి, సాంస్కృతిక వైభవానికి ముప్పు. మత రాజ్యం ఏర్పడితే, రాజ్యాంగం రద్దయితే ప్రశ్నించే హక్కుండదు. రాచరికం వస్తుంది. బడాబాబులు స్వేచ్ఛగా దోచుకోవచ్చు. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో మోడీ మళ్లీ ప్రధాని కావొద్దు. బీజేపీ మళ్లీ అధికారంలోకి రావొద్దు. అందుకే బీజేపీని ఏ పార్టీ ఓడిస్తే దానికి మా మద్దతు ఉంటుంది. కాంగ్రెస్ ఓడిస్తుందనుకుంటే ఆ పార్టీకి మద్దతివ్వడానికి మాకు అభ్యంతరం లేదు. బీజేపీ ముప్పు నుంచి దేశాన్ని, ప్రజలను కాపాడాలి. ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నికలు, ఒకే సంస్కృతి వంటి ఈ విధానాలన్నీ ఏక వ్యక్తి పాలన, ఏక పార్టీ పాలన వైపు దేశాన్ని నడిపించే ప్రయత్నాలు. బీజేపీని ఓడించడమే ప్రజల తక్షణ కర్తవ్యం. తెలంగాణలో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవొద్దు.'అని వీరయ్య చెప్పారు.



'కేరళలో కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికలు గనుక కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని ఆ పార్టీ ప్రచారం చేసింది. కేరళ ప్రజలు అదే నమ్మారు. అందుకే ఎక్కువ స్థానాలను కాంగ్రెస్‌కే కట్టబెట్టారు. దేశంలో లౌకిక విలువల కోసం నికరంగా నిలబడ్డది వామపక్షాలు. కేరళ ప్రజలు అది గుర్తించారు. కనుక ఈసారి కాంగ్రెస్ ప్రచారాస్త్రం పనిచేసే అవకాశం లేదు. కేంద్రంలో బీజేపీ ఓడిపోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ స్థిరంగా ప్రభుత్వం నిలబడాలంటే ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే సీపీఐ(ఎం), సీపీఐ గెలవడం అవసరమని కేరళ ప్రజలు భావిస్తున్నారు. అక్కడ వామపక్షాలు మెజార్టీ సీట్లు గెలవబోతున్నాయి.'అని వీరయ్య అన్నారు.

'ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీ. బీజేపీ ఓడిపోతే కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుంది. ఇతర పార్టీలను కలుపుకుపోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉన్నది. ఆ బాధ్యతను సరిగ్గా నెరవేర్చకపోవడం వల్ల మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లో నష్టపోయారు. దేశ ప్రజలకు కూడా నష్టం కలిగించారు. ఆ అనుభవం తర్వాత కూడా బీజేపీ వ్యతిరేక శక్తులను కలుపుకునిపోయే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించాలి.'అని వీరయ్య సూచించారు.

సీపీఐ(ఎం)కు బలమున్న పార్లమెంటు స్థానాలు ఖమ్మం, మహబూబాబాద్, భువనగిరి, నల్లగొండ. వీటిలో ఏదైనా ఒక్క సీటులో పోటీ చేయాలనుకున్నాం. భువనగిరి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఐ లేదా సీపీఐ(ఎం) గతంలో గెలిచాయి. గ్రామగ్రామాన ఎర్రజెండా గురించి తెలుసు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న భువనగిరిలో పోటీ చేయాలని నిర్ణయించాం. ఇతర పార్టీల అభ్యర్థులతో పోల్చుకుంటే సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ కడిగిన ముత్యం. అట్టడుగు స్థాయి నుంచి, పేదరికం నుంచి వచ్చిన నాయకుడు. ప్రజలతో మమేకమవుతారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతారు. ఇతరులెవరు ప్రజల కోసం పోరాడిన వారు లేరు. ప్రజలకు అంకితమై పనిచేసే వారు లేరు. డబ్బు మీద ఆధారపడి పోటీ చేస్తున్నారు. ఇతరుల కంటే గొప్ప లక్షణాలున్న వ్యక్తి జహంగీర్. ప్రజలను ఓట్లడిగే నైతిక హక్కు సీపీఐ(ఎం)కు, మా అభ్యర్థికే ఉంది.'అని వీరయ్య అన్నారు.

'ప్రధాని మోడీ రాముడిని చూపించి ఓట్లడుతున్నారు. ప్రజాసామ్యంలో ప్రధానిని ప్రజలు ఎన్నుకున్నది సమస్యలను పరిష్కరించడం కోసం. ఆయన విఫలమై రాముడిని చూపించి ఓట్లడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం రాముడిని అడగమంటున్నారు. సమస్యలను పరిష్కరించకుండా దేవుడిని అడగమంటే ప్రధాని కుర్చీలో మోడీ ఎందుకు. గద్దెదిగిపోవాలి. ఈ రాష్ట్రంలో బీజేపీకి ఒక్క సీటు రాకుండా చూడాలి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిపిన గడ్డ. ఆ చైతన్యం ప్రదర్శించాలి. మతాన్ని రాజకీయాల కోసం వాడుకునే అవకాశం ఇవ్వొద్దు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదనే తీర్పునివ్వాలి.'అని వీరయ్య కోరారు.

'దేశంలో వామపక్షాలు, లౌకిక శక్తులు, సీపీఐ(ఎం) ఎన్ని స్థానాలు గెలిస్తే ప్రజలకు, దేశానికి, రాజ్యాంగానికి అంత రక్షణ ఉంటుంది. అందుకే సీపీఐ(ఎం)ను గెలిపించాలి.'అని వీరయ్య పిలుపునిచ్చారు.



మోడీ ప్రభుత్వ అప్రకటిత ఎమర్జెన్సీ

- ఆర్థిక, సామాజిక రాజకీయ విశ్లేషకులు పాపారావు
- "అలుపెరగని పోరాటం" పుస్తకావిష్కరణ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నాటి ఎమర్జెన్సీ నుంచి నేటి మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రకటిత ఎమర్జెన్సీ వరకు వివిధ అంశాలను 'అలుపెరగని పోరాటం' పుస్తకంలో ప్రముఖ పాత్రికేయుడు, న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ పొందుపరిచారని ఆర్థిక, సామాజిక రాజకీయ విశ్లేషకులు పాపారావు అన్నారు. పుర్కాయస్థ రచించిన 'అలుపెరగని పోరాటం' పుస్తకాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. నవతెలంగాణ బుక్ హౌస్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ, నవతెలంగాణ బుక్ హౌజ్ మేనేజర్ వాసు, టి.సాయి శేషగిరిరావు, ప్రబీర్ పురకాయస్థ సహచరులు అంబేద్కర్, సృజన ఆధ్వర్యంలో కామ్రేడ్ జితిన్ అధ్యక్షతన హైదరాబాద్ మధురానగర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని పాపారావు ఆవిష్కరించి నాయకులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యూస్ క్లిక్ యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజా సమస్యలు, కార్మిక సమస్యలు ప్రజలందరికీ తెలియజేసిన గొప్ప వ్యక్తి ప్రబీర్ పుర్కాయస్థ అన్నారు. ఈ పుస్తకంలో ప్రజా సమస్యలను పేర్కొన్నారని.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నిస్తే ఈడీ, సీబీఐలతో దాడులు చేయించి జైలుకు పంపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులను ఎన్నికల సమయంలో జైల్లో పెట్టడం అంటే వారిని పోటీలో లేకుండా చేసి తాను లబ్దిపొందడానికి యత్నిస్తోందని విమర్శించారు. ఇది ఎమర్జెన్సీ కిందికే వస్తుందని తెలిపారు. న్యూస్ క్లిక్ యూట్యూబ్ ఛానల్‌పై అనేక రకాల దాడులు చేసి జర్నలిస్టుల ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు తీసుకెళ్లారని గుర్తు చేశారు. దేశంలో ప్రస్తుతం మీడియా మొత్తం ఆర్ఎస్ఎస్, బీజేపీ చేతిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపర్తి అశోక్, సీహెచ్.చంద్రశేఖరరావు, జె.స్వామి, జి.బిక్షపతి, జి.హనుమంతురావు, నీలి పాపారావు, సి.శ్రీనివాస్, బాలు, రమణ, ప్రసాద్, కుమార్, పుల్లయ్య పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో ఉండాలంటే రాహుల్‌ను ప్రధాని చేయండి : జగ్గారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకు కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. బీజేపీ దేశాన్ని అప్పుల పాలు చేసి, శ్రీరాముని పేరుతో రాజకీయం చేస్తున్నదని తెలిపారు. శ్రీరాముడు బీజేపీ వారికే దేవుడైనట్టు చెప్పుకుంటూ మిగిలిన భక్తులను అవమానిస్తూ ప్రజలు ప్రశాంతంగా ఉండనివ్వడం లేదని విమర్శించారు. ధరలను అదుపు చేయక సామాన్యులను ఇబ్బంది పెడుతున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని కొనియాడారు.

ప్రజా సమస్యలపై పోరాడుతున్న జహంగీర్‌ను గెలిపించండి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి



నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రజా సమస్యలపై అవగాహన ఉండి.. నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి కోరారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె ఎండీ.జహంగీర్‌తో కలిసి మాట్లాడారు. విద్యార్థి సంఘం నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై పోరాడుతున్న జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. నియోజకవర్గ ప్రజలంతా ఆదరించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నో హామీలను ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి పేద ప్రజలపై అధిక భారాలు మోపుతోందన్నారు. ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోన్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో నీతి నిజాయితీ నిబద్ధతతో పనిచేసే జహంగీర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

అభ్యర్థి ఎండీ.జహంగీర్ మాట్లాడుతూ.. తుంగతుర్తి గడ్డ తెలంగాణ సాయుధ పోరాటాలకు కేంద్ర బిందువు అని, రజాకార్లను గడగడలాడించిన ప్రాంతమని అన్నారు. కమ్యూనిస్టులకు పదవులు అంటే పోరాట ఆయుధమని తెలిపారు.

భువనగిరి నియోజకవర్గ పరిధిలో ఇరిగేషన్ సమస్య కీలకంగా ఉందని, సాగు, తాగు నీరు, వైద్యంపై పాలకుల నిర్లక్ష్యం వల్ల వెనుకబడిందని చెప్పారు. గతంలో మల్లు స్వరాజ్యం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని.. ఇప్పటి వరకు డిగ్రీ కళాశాల ఏర్పాటు కాలేదని చెప్పారు. ప్రధాన పార్టీల నాయకులు డబ్బు సంచులతో ఎన్నికల బరిలో నిలిచారే తప్ప కనీసం పార్లమెంటు సరిహద్దులు కూడా తెలియదన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న తనను గెలిపిస్తే పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తనకు ఓటేసి పార్లమెంట్‌కు పంపించాలని ప్రజలను కోరారు. వందరోజుల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, మట్టిపెల్లి సైదులు, చేరుకు ఏకలక్ష్మి ఉన్నారు.

వాగాడంబరత... అవాస్తవాలు

- చిత్తశుద్ధి లోపించింది
- బీజేపీ మ్యానిఫెస్టోపై కాంగ్రెస్
- ఇచ్చిన హామీలకే దిక్కులేదని ఎద్దేవా
- ప్రజా సమస్యల ప్రస్తావనేదని నిలదీత

న్యూఢిల్లీ : బీజేపీ ఎన్నికల ప్రణాళికపై ప్రతిపక్ష కాంగ్రెస్ వ్యంగ్యోక్తులు విసిరింది. అందులో వాగాడంబరత ఎక్కువగా ఉన్నదని, అవాస్తవాలతో నిండిపోయిందని, చిత్తశుద్ధి లోపించిందని విమర్శించింది. దానిలో లెక్కించదగిన హామీలు తక్కువగానే ఉన్నాయని తెలిపింది. బీజేపీ మ్యానిఫెస్టోను 'మోడీకీ గ్యారంటీ...జుమ్లా కీ గ్యారంటీ' (మోడీ గ్యారంటీ వాగాడంబరతకు వారంటీ) అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. గతంలో ఇచ్చిన హామీలనే మోడీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో గుర్తు చేశారు. అందుకు డజనుకు పైగా ఉదాహరణలు చూపారు.



'రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? స్వామినాథన్ కమిషన్ ఫార్ములాకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు కల్పిస్తామని చెప్పారు. ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామన్నారు. అవన్నీ ఏమయ్యాయి?' అని ఖర్గే నిలదీశారు. కాగా ప్రజలను వేధిస్తున్న నిరుద్యోగం, ధరల పెరుగుదలపై బీజేపీ ప్రణాళిక మౌనం వహించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ప్రజల బాగోగులకు కీలకమైన అంశాలను చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని ఆయన అన్నారు.

బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో 76 పేజీలు ఉన్నాయని, అయితే వాటిలో 'ఉద్యోగాలు' అనే ప్రస్తావన కేవలం రెండు చోట్ల మాత్రమే కన్పించిందని కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా ప్రినాటే గుర్తు చేశారు. 'ఏడాదికి 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, అప్రెంటీస్‌షిప్ కోసం స్టైఫండ్‌గా ఏటా లక్ష రూపాయల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే బీజేపీ ప్రణాళిక మాత్రం ప్రస్తుత ఖాళీల భర్తీని మాత్రమే ప్రస్తావించింది. ఖాళీలను భర్తీ చేయకుండా అలాగే ఉంచేస్తూ గత దశాబ్ద కాలంగా ఉద్యోగాల కల్పనపై ఎందుకు ఊదరకొడుతున్నారు?' అని ఆమె ప్రశ్నించారు.

వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరల అమలుపై చట్టాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వగా ఈ విషయంపై బీజేపీ మౌనం వహించింది. 2022 నాటికి అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2019లో ఇచ్చిన హామీపై కూడా మౌనాన్నే ఆశ్రయించింది. గత పది సంవత్సరాల కాలంలో కనీస మద్దతు ధరలు అసాధారణ రీతిలో పెరిగాయని మాత్రం చెప్పుకుంది. వాటిని ఎప్పటికప్పుడు పెంచుతామని హామీ ఇచ్చింది. ఉగ్రవాదంపై బీజేపీ ప్రణాళికలో చేసిన వాదనను కాంగ్రెస్ కొట్టిపారేసింది. 2014 తర్వాత ఏ ప్రధాన నగరంలోనూ చెప్పుకోదగిన ఉగ్రవాద దాడి జరగలేదని బీజేపీ చెబుతోంది. అయితే పుల్వామా సహా పలు ఉగ్రవాద దాడులను ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది.

పది సంవత్సరాల మోడీ పాలనలో ఒక్క జమ్మూకాశ్మీర్‌లోనే 3,950 మంది ఉగ్ర దాడులకు బలయ్యారని సుప్రియ తెలిపారు. వీరిలో భద్రతా సిబ్బంది, పౌరులు ఉన్నారని అంటూ దేశంలో ఉగ్రవాదాన్ని అంతం చేశామంటూ బీజేపీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో మణిపూర్‌ను ప్రస్తావించకపోవడాన్ని కూడా కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈశాన్య రాష్ట్రాల గురించి ప్రస్తావించిన బీజేపీ, మణిపూర్ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు.

ముగిసిన టీయూఐ మహాసభలు

- ప్రపంచ శాంతి, నిరాయుధీకరణకు పిలుపు
- టీయూఐ సెక్రెటేరియట్‌కు విజ్జూ కృష్ణన్ ఎన్నిక

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని, నిరాయుధీకరణ అమలు జరగాలని వ్యవసాయం, ఆహారం, వాణిజ్యం, అనుబంధ పరిశ్రమల ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ (టీయూఐ) 5వ అంతర్జాతీయ మహాసభలు పిలుపిచ్చాయి. ఈ మహాసభలు ఈ నెల 9 నుంచి 14 వరకు డాకర్ (సెనెగల్)లో జరిగాయి. దాదాపు 10కోట్ల మందికి పైగా సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 86 దేశాల నుంచి 141 వ్యవసాయ, ఆహార, వాణిజ్య, గ్రామీణ, ఆదివాసీ జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారు. టీయూఐ ఈ తరహా యూనియన్లలోనే అతి పెద్దది.

టీయూఐ ప్రధాన కార్యదర్శి జూలియన్ హక్ మహాసభల్లో కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ప్రారంభ సమావేశంలో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ పాల్గొని ప్రసంగించారు. నయా ఉదారవాద పెట్టుబడిదారీవాదం, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా వర్గ పోరాట చర్యలు చేపట్టాల్సిన, అంతర్జాతీయ సంఘీభావం ప్రదర్శించాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ ప్రసంగించారు. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా భారత్‌లో సమస్యల ప్రాతిపదికన సమైక్య పోరాటాలు సాగించిన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రసంగానికి ప్రతినిధుల నుండి మంచి స్పందన లభించింది.



భారత ప్రతినిధి వర్గంలో విజ్జూ కృష్ణన్, పి.కృష్ణప్రసాద్ (ఏఐకేఎస్ ఫైనాన్స్ కార్యదర్శి), బి.వెంకట్ (అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం-ఏఐఏడబ్ల్యుయు, ప్రధాన కార్యదర్శి), విక్రమ్ సింగ్ (ఏఐఏడబ్ల్యుయు జాయింట్ కార్యదర్శి), రావుల వెంకయ్య (ఏఐకేఎస్-అజయ్ భవన్ అధ్యక్షులు), గుల్జార్ సింగ్ గోరియా (భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్-బికెఎంయు, ప్రధాన కార్యదర్శి), విజేంద్ర సింగ్ నిర్మల్ (బికెఎంయు అధ్యక్షులు) వున్నారు.

టీయూఐ కార్యదర్శివర్గానికి విజ్జూ కృష్ణన్ ఎన్నికయ్యారు. ఏఐఏడబ్ల్యుయు అధ్యక్షులు ఎ.విజయరాఘవన్, గుల్జార్ సింగ్ గోరియా, రావుల వెంకయ్యలు టీయూఐ ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికయ్యారు.

ప్రపంచవ్యాప్తంగా శాంతి, నిరాయుధీకరణ అమలు జరగాలని మహాసభలు పిలుపిచ్చాయి. ముఖ్యంగా గాజాపై, పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం నేపథ్యంలో శాంతి స్థాపన అత్యంత కీలకమని మహాసభ పేర్కొంది. ఆహార సార్వభౌమాధికారం, క్షామంపై, పోషకాహార లోపంపై పోరు కోసం ఉద్యమాలు నిర్మించాలని పిలుపిచ్చాయి. యూనియన్లను మరింత బలోపేతం చేయడం ద్వారా వర్గ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరాయి.

గల్ఫ్ కార్మికుల సమస్యలపై కార్యాచరణ

మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గల్ఫ్‌లో పని చేస్తున్న తెలంగాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. దుబాయ్‌లో తెలంగాణ ప్రవాసులు, గల్ఫ్ కార్మికుల సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రవాసులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడి అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కోసం వారి నుంచి సలహాలు తీసుకున్నారు. ఆయన గెలుపు కోసం సహకరించాలని వారిని కోరారు.

సంపాదకీయం

ఇంకో జుమ్లా

ప్రజల బాధలు, గాధలు, దు:ఖాలు, నిట్టూర్పులు, కండ్లనీళ్లు తుడవటం, ఇంటిల్లి పాదినీ కలవటం, ఓటు కోసం బతిమిలాడటం, దేబురించడం, అడుక్కోవటం అంతా ఓ దండుగ మారిపనిగా, ఔడ్డేటెడ్ వ్యవహారంగా భావించినట్టు ఉంది భారతీయ జనతా పార్టీ. పదేండ్ల అధికార అహంతో తెగించిందన్న విషయాన్ని ఆదివారం వారు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో చెప్పకనే చెబుతోంది. వికసిత భారత్, అచ్ఛేదిన్, అమృత్‌కాల్ ఇత్యాది అద్భుతపదజాలంతో ఎన్నికల్లో ఘన విజయాలు సాధించాలని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో దిశానిర్దేశం చేస్తుంటే, దేశంలో పరిస్థితులు అంత పచ్చగా ఏమీ లేవని, పైగా దిగజారిపోతున్నాయని ఇటీవల వెలువడిన నివేదికలు ఎండగడుతున్నాయి.

రైతులు, యువకులు, మహిళలు, పేదలే తమకు ముఖ్యమని చెప్పిన బీజేపీ... చివరకు తమ మేనిఫెస్టోలో వారినే విస్మరించింది. మరి వీరు లేని 'వికసిత భారత్'నా బీజేపీ కోరుకోంటుంది? అసలు ఏ వర్గానికీ మేలు చేయని ఎన్నికల ప్రణాళికను కమలదళం అందమైన అబద్ధాలతో వండివార్చింది. బ్రిటీషు ఏలుబడిలో కంటే మోడీ పాలన లోనే భారతదేశంలో అసమానతలు అధికంగా ఉన్నాయని వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అధ్యయనపత్రం హెచ్చరికలను పట్టించుకోని కమలనాధులు బీజేపీ సంకల్ప పత్రం పేరుతో 'సంవిధాన్ బద్ లో పత్ర' ను విడుదల చేశారు.

హిందూత్వ ఎజెండాతో మరోసారి అధికారంలోకి రావాలన్న కాంక్షతో హామీలను గుప్పిస్తున్నది. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తెస్తామని ఆ పార్టీ చెబుతున్నది. ఆర్థికంగా దేశాన్ని ప్రపంచంలోనే మూడో స్థానంలోకి తీసుకొస్తామని ఇంతకు మించిన ప్రగతి ఏ దేశంలోనైనా సాధ్యమవుతుందా అని ఆ పార్టీ ప్రశ్నిస్తున్నది. కీలకమైన నిరుద్యోగం, పేదరికం, ధరల మంట గురించి ఆ పార్టీ ప్రస్తావించడం లేదు. అయితే అయోధ్యలో రామ మందిరం లాంటి భావోద్వేగ ఎజెండాతో మూడోసారి ఓట్లు కొల్లగొట్టాలని ఆలోచిస్తున్నది.

> వివిధ రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, వాటిని తప్పుపట్టిన మోడీ తన మ్యానిఫెస్టోలో మాత్రం మొత్తం ఉచిత పథకాల హామీనే ఇచ్చారు. ఆయన ప్రభుత్వం గడిచిన పదేండ్లలో అమలు చేసిన పథకాలన్నీ అవసరమైన కొందరికే పరిమితం చేశారట..! రేషన్ బియ్యమైనా, రైతులకు ఆర్థిక సహాయమైనా, ఉచిత వైద్యమైనా, ఉచిత ఇండ్లయినా అదే జరిగింది. సుస్థిరత, సమర్థత, భద్రత, సంకల్ప్ లాంటి గంభీరమైన మాటలు జోడించి పేజీలు నింపారే తప్ప, నిజంగా భారతీయ సమాజం ఇవ్వాల ఏమి కోరుకుంటు న్నదో గుర్తించి, దానిపై పార్టీ విధానం ప్రకటించలేదు.



గత పదేండ్లలో తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నయా భారత్‌ను అడ్డుకోవడం అసాధ్యమని సాక్షాత్తు ప్రధాన మంత్రే సెలవిస్తున్నారు. కానీ, ఆకలి నుంచి ఆనందం వరకూ ప్రతీ విషయంలోనూ పరిస్థితులు దిగజారాయని, ఇరుగుపొరుగు చిన్నాచితకా దేశాలకంటే మన పరిస్థితి అత్యంత దయనీయమని అనేక సర్వేలు ప్రకటించాయి. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ అందుకు విరుద్ధంగా రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపుతున్నారు. ఎంఎస్‌పీ అమలు ప్రస్తావన లేని ఎన్నికల ప్రణాళికలో వివాదాస్పద సిఏఏ అమలుకు మాత్రం హామీ ఇచ్చింది. అంతే కాదు, ప్రతి పదేండ్లకోకసారి జరిగే జన గణనను చేపట్టని అధికార పార్టీ...లౌకిక భారతాన్ని విచ్ఛిన్నం చేసే వినాశకర పౌరసత్వ చట్ట సవరణ- 2019ని ఎన్నికలనంతరం అమలు చేస్తామని చెప్పింది.

'మోడీ గ్యారంటీ అంటే 24 క్యారెట్ల బంగారం వంటిది. అందుకే మాది ప్రపంచ పార్టీల మేనిఫెస్టోల్లోనే గోల్డ్ స్టాండర్డ్ మేనిఫెస్టో' అని బీజేపీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మరి 'జన్‌ధన్' ఖాతాలో రూ.15 లక్షల నగదు వేస్తమన్న హామీ సంగతేంటి? 2014 మ్యానిఫెస్టోలో ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. పదేండ్లలో ఆ హామీ అమలు కాలేదు. ఈసారి అసలు ఉద్యోగాల ముచ్చటే మ్యానిఫెస్టోలో పెట్టలేదు. కానీ, గిగ్ వర్కర్లకు ముద్రా లోన్‌ల కింద రూ.20లక్షల లోన్ ఇస్తామని చెబుతోంది. ఉపాధికి మౌలిక సదుపాయాలు కల్పించగుండా రూ.20లక్షల లోన్ ఇచ్చినా... రూ.60 లక్షల లోన్ ఇచ్చినా ఉపయోగం ఏంటి? ప్రభుత్వ పరంగా నిర్వహించిన జీ20 దేశాల సదస్సును కూడా వీరి ఖాతాలో వేసుకుంటున్నారు. అంతే కాదు భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించి సత్తా చాటుతాం అని కూడా వీరి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించిన ఎన్నికల ప్రణాళికలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరల అదుపు గురించి లేకపోవడం వైచిత్రి.

"ఉచితాల పేరుతో అధికారంలోకి రావాలన్న యావే తప్ప, వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ నాశనమవు తుందన్న ధ్యాసే ప్రతిపక్షాలకు లేద"న్న ప్రధానమంత్రి, పదేండ్లలో చేసిందేమీ లేకపోవడంతో ఈ సారి ఎన్నికల్లో గెలిపిస్తే ఉచిత రేషన్, ఉచిత విద్యుత్, ఉచిత వైద్యం, ఉచిత ఇండ్లు పేరుతో "ఉచిత పథకాల" జపం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, వాటిని తప్పు పట్టిన మోడీ తన మ్యానిఫెస్టోలో మాత్రం మొత్తం ఉచిత పథకాల హామీనే ఇచ్చారు. ఆయన ప్రభుత్వం గడిచిన పదేండ్లలో అమలు చేసిన పథకాలన్నీ అవసరమైన కొందరికే పరిమితం చేశారట..! రేషన్ బియ్యమైనా, రైతులకు ఆర్థిక సహాయమైనా, ఉచిత వైద్యమైనా, ఉచిత ఇండ్లయినా అదే జరిగింది. సుస్థిరత, సమర్థత, భద్రత, సంకల్ప్ లాంటి గంభీరమైన మాటలు జోడించి పేజీలు నింపారే తప్ప, నిజంగా భారతీయ సమాజం ఇవ్వాల ఏమి కోరుకుం టున్నదో గుర్తించి, దానిపై పార్టీ విధానం ప్రకటించలేదు. బహుశా, ఇదే బీజేపీ విధానమేమో..!

అబ్బా.. ఎంత మార్పో...

అధికారం... ఈ పదానికున్న పవర్ అంతా ఇంతా కాదు, అది ఉంటే ఒక లెక్క, లేకపోతే మరో లెక్క. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పరిస్థితి గీలెక్కనే ఉన్నది. గులాబీ పార్టీ గద్దెదిగిన తర్వాత, పోలోమంటూ హస్తం పార్టీలోకి క్యూ కడుతున్నారు నేతలు. అలా క్యూ కట్టినవారు పోగా పోగా మిగిలిన వారు ఎక్కడ ఫోన్ ట్యాపింగుల్లో దొరుకుతామో, ఎక్కడ స్కాముల్లో బయటపడతామో అనే రీతిలో కుక్కినపేనుల్లా, తేలుకుట్టిన దొంగల్లా అలా నక్కి నక్కి ఉంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చిన్నంతరం, పెద్దంతరం అనే తేడా లేకుండా నోటికొచ్చినట్టు, ఏదిపడితే అది మాట్లాడిన నేతలు... ఇప్పుడు కొంచెం ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడుతున్నారు. ఆ పార్టీకి చెందిన అందరిలో కాకపోయినా కొందరిలోనైనా ఈ మార్పు స్పష్టంగా కనబడుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ విలేకర్ల సమావేశంలో ఓ మాజీ మంత్రి మాట్లాడుతూ...సీఎం రేవంత్ గారు, ముఖ్యమంత్రి గారు, ప్రభుత్వ పెద్దలు, వారు పెద్ద మనసు చేసుకోవాలి, మా విన్నపాల్ని స్వీకరించాలి...' లాంటి పదాల్ని పదేపదే వాడారు. ఇందులో ప్రత్యేకతేముందని అనుకుంటున్నారా? ఉంది, కచ్చితంగా ఉంది. ఎందుకంటే ఇదే ఎక్స్ మినిష్టర్... ఓ ఆర్నెల్ల కింద నిర్వహించిన ఓ ప్రెస్‌మీట్ సందర్భంగా... ప్రతిపక్షాల విమర్శల గురించి పాత్రికేయులు ప్రస్తావించగా... 'అయితే ఏందంట, మమ్మల్ని వాళ్లేమైనా పీ..రా, అసలు ప్రతిపక్షమంటే ఎవరు? ఈ రాష్ట్రంలో అపోజీషన్ ఉందా? అంతా మేమే కదా...,సో వాట్, అఫ్‌కోర్స్...' లాంటి పదాలు వాడుతూ విపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఎంతమాత్రమూ విలువనివ్వకుండా నిర్లక్ష్యంగా మాట్లాడారు. అప్పుడు నెత్తిమీదున్న కండ్లు, ఇప్పుడు కాస్త కిందికి దిగినట్టుంది. అందుకే సీఎం గారు, ప్రజల విజ్ఞప్తులు, జనం సమస్యలు...' అంటూ ఆయన మొదలుపెట్టారు. ఇదే విషయంపై అదే మాజీ మంత్రివర్యుణ్ని అడిగితే...'ఏ ఊరుకో అన్నా...నువ్వు పాతయ్యన్నీ తవ్వుతవ్...' అంటూ మెల్లగా జారుకున్నారు. అబ్బా... ఆయనలో ఎంత మార్పో...

-బి.వి.యన్.పద్మరాజు

జర పైలం

'ఓ రాజన్న తాత తిన్నవా' అని మందలిచ్చుడు పాపమైంది. 'మా ఇంట్ల బువ్వెక్కడిదిరా? పతాకం మంది కొంపలమీదవడి తినుడేనాయే' అని వదురవట్టే... 'పొద్దుగాల పొద్దుగాల గీ ముసలోని నోట్లె నోరు వెట్టుడు తప్పైందనుకుంటూ' గా రచ్చబండతాన పోయేసరికి ఒకటే లొల్లి. 'ఏంది... ఊరంతా గిట్ల జమైంది. బోద్రాయి వెట్టి ఏడాది గూడ గాలేదు మల్ల వెద్తరా ఏంది' అనుకుంటూ దగ్గరికి వోయేసరికి.. మీ వాడోళ్లు జెయ్యు వట్టే ఊర్ల నీళ్లగ్గోసచ్చిందని ఒకల్నొకలు తిట్టుకున్నంత పని చేస్తుంద్రు. గప్పుడు గా సర్పంచ్ బయటకచ్చి.. ఇగో గిట్ల లొల్లి వెట్టుకుంటే నేనే గాదు ఊర్ల పెద్ద మనుషులం ఎవ్వరం ఏం జెయ్యలేం. మేం జెప్పినట్టు ఇనుండ్రీ జెర. గీ ఏడాది నీళ్లకు గోసచ్చింది. ఊర్లున్న చెర్ల, కుంటల నీళ్లు దగ్గరవడ్డయి. గొడ్లకు, గోదలకు తాగడానికి కూడా సరిపోయేతట్టు లేవు. ఊర్ల బాయిలు, బోర్లన్ని ఎండి పోయినయి. ఊరు మొత్తంల రెండు వందల గడపుంటే ఎనిమిది బాయిళ్లల్లనే నీళ్లున్నై. గా నీళ్లే ఎండ కాలమంత గావాలే. గందుకు గ్రామపంచాయతి తీర్మానం జేసింది. గీ మూన్నెళ్లు మనూళ్లే నీళ్లు పక్కూరోల్లకు ఇయ్యద్దు. రోజుకు మనిషికి రెండు బిందెల నీళ్లు తీసుకోవాలే. ఇంట్ల ఎంతమందుంటె అంత మందికి పొద్దుగాల బిందెడు, మాపటి జామున బిందెడు నీళ్లత్తె. ఒక్కో బాయికాడ ఒక్క మనిషినివెట్టి పంచుతం. గీ నీళ్లను పైలంగా వాడుకోండ్రీ అని జెప్పవట్టే. 'ఓ మనిషి.. కాళ్లకట్టకు ఎండచ్చింది. ఇంకా ఎంతశేబ్బంటవు' అంటూ మా పొల్ల లేపేసరికి తెలివైంది. అయ్యో గిదంతా కలేనా అనుకుంటూ జరిగిదంతా శెబితే నవ్వుద్దనుకున్నా. 'అ... ఇంకో నెలాగరాదు. అదేఅయితది. నువ్వుగూడ బిందె వట్టుకోని లైన్ల నిలబడుడే' అని కోపంగా అనేసరికి నోరెళ్ల వెట్టుడు నావంతైంది.

- ఊరగొండ మల్లేశం

ఒక్కో ఓటే బూస్ట్

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలను కులాలు, మతాలు, డబ్బుల చుట్టూ తిప్పే ప్రయత్నాల్లో పార్టీల నేతలు మునిగి పోయారు. సేవా గీవా జాన్తానై..పైసామే పరమాత్మ.. కులపోళ్ల ఓట్లే రక్ష అన్నట్టుగా నేతలతీరు సాగుతున్నది. వ్యాపారాల్లో వందల కోట్ల రూపాయలు సంపాదించు కోవడం, దాన్ని రక్షించుకోవడం కోసం, వారసులకు రాజకీయ భిక్ష పెట్టడంలో భాగంగా పదవుల కోసం పాకులాడుతున్న పరిస్థితి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కష్టాల్లో ఉన్నారని తెలిసి కూడా కనికరం లేకుండా లక్షల సొమ్మును తిన్నోళ్లు...కోట్లాది రూపాయల సంపదను కాపాడుకోవాలను కునేటోళ్లు..పుత్ర రత్నాలను పదవుల్లో చూసుకుని మురిసే టోళ్లు అభ్యర్థులైతే దోచుకోవడం తప్ప ఇక ప్రజాసేవ ఎక్కడుంటుంది? మహనీయుడు శ్రీశ్రీ రాసిన కవితను అటూ ఇటూ మార్చుకుని ఏ పార్టీ అభ్యర్థుల చూసినా ఏమున్నది గర్వకా రణం.. కులమత విభజనలతో ప్రజల మధ్య చిచ్చుపెట్టడం, సామదానభేద దండోపాయాలతో ఓట్లను కొల్లగొట్టడం.. ప్రజాసేవ ముసుగులో సంపదను పోగేసుకోవడం.. 500, 1000 రూపాయలు విదిల్చి ఓట్లను దండుకోవడం..ఆ తర్వాత హాహా అనుకోవడం తప్ప ఏమున్నది. పొద్దునలేస్తే ప్రజలు, కార్మికులు, రైతుల సమస్యలపై రోడ్లెక్కి కొట్లాడేటోళ్లు కమ్యూనిస్టులని అంగీకరిస్తూనే ఈ డబ్బుల రాజకీయాల్లో మేం ఒక్కరం ఓటేస్తే వాళ్లు గెలుస్తారా? అందరూ అంటున్నారు. అలా అనుకునేటోళ్లంతా ఒక్కోఓటేసి ప్రజా సేవలో పరితపించేటోళ్ల వైపు నిలవాల్సిన అవసర ముంది. ఎంత పెద్ద విజయమైనా ఒక్కడితోనే ప్రారంభమవుతుం దన్నట్టుగానే ఒక్కోఓటే పోరాటయోధులకు బూస్ట్‌గా పని చేస్తుంది. ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని కోరుకుందాం.

- ప్రశాంత్ అచ్చిన

తలకిందుల వాదనలు


ప్రభాత్ పట్నాయక్

ఉదారవాద బూర్జువా ప్రజాస్వామ్యం నుంచి ఫాసిస్టు నియంతృత్వ పాలనగా జర్మనీలో ప్రభుత్వ స్వభావం మారడంలో 1933లో జర్మన్ పార్లమెంట్ (రీచ్‌స్టాగ్) భవనానికి జరిగిన అగ్ని ప్రమాదం ఒక కీలక ఘట్టం. నాజీలే ఆ అగ్ని ప్రమాదానికి కారకులు అని అనుమానించడానికి బల మైన ఆధారాలున్నాయి. కాని ఆ ప్రమాదానికి కమ్యూనిస్టులే కారకులంటూ తప్పుడు అభియో గాలు మోపి ఆ సాకుతో పెద్దఎత్తున భయోత్పా తాన్ని సృష్టించారు. అనేకుల్ని నిర్బంధించారు. వారిలో 81 మంది కమ్యూనిస్టు పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు కూడా ఉన్నారు. దాంతో అంతవరకూ పార్లమెంటులో పూర్తి మెజారిటీ లేని నాజీలకు మంచి అవకాశం లభించింది.వాళ్లు జర్మనీని ఒక ఫాసిస్టు రాజ్యంగా మార్చివేశారు. రీచ్‌స్టాగ్ అగ్నిప్రమాదంలో నేరారోపణను ఎదుర్కొన్నవారిలో జార్జి డిమిట్రోవ్ కూడా ఉన్నారు. ఆయన బల్గేరియాకు చెందిన విప్లవకారుడు. ఆ సమయంలో జర్మనీలో ఉన్నారు.

విచారణ జరిగే సమయంలో డిమిట్రోవ్ తన కేసును తానే వాదించుకున్నారు. హిట్లర్ కుడి భుజంగా వ్యవహరిస్తున్న హెర్మన్ గోరింగ్ అప్పటి జర్మన్ విమానయాన శాఖ మంత్రిగా ఉన్నాడు. అతడిని విచారించడానికి డిమిట్రోవ్ కోర్టును అనుమతి కోరాడు. ఆ కేసును విచారిస్తున్న న్యాయ మూర్తి హిట్లర్ ప్రభుత్వం ఎంపిక చేసినవాడే. అయినప్పటికీ కోర్టు గోరింగ్‌ను విచారించడానికి డిమిట్రోవ్‌కు అనుమతినిచ్చింది. ఆ విచారణలో డిమిట్రోవ్ హెర్మన్ గోరింగ్‌తో తలపడిన తీరు ఇప్పుడు జగత్ప్రసిద్ధం. తీవ్రంగా తనపై ఎదురుదాడి చేస్తూ పరుష పదజాలంతో, బెదిరింపులతో గోరింగ్ వ్యవహరించిన దానికి పూర్తి భిన్నంగా డిమిట్రోవ్ ఆ దాడిని చాలా ప్రశాంతంగా, సంయ మనంతో ఎదుర్కొన్నారు. చివరికి నాజీల కనుసన్నలలో నడిచే ఆ కోర్టు సైతం డిమిట్రోవ్‌ను ఆ కేసులో నిర్దోషిగా పరిగణిస్తూ విడుదల చేయవలసి వచ్చింది. ఆ తర్వాత డిమిట్రోవ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. 1935లో కొమింటర్న్ ఏడవ అంతర్జాతీయ మహాసభలో ఫాసిజాన్ని ఎదిరించడానికి ఐక్యవేదికను నిర్మించే వ్యూహాన్ని ప్రతిపాదించాడు.

> "ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ పొందడం అనేది ఒక హక్కు కాదు" అంటూ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్నప్పుడు ఎన్ఐఎ (జాతీయ నేర పరిశోధనా సంస్థ) వాదించింది. ఈ వాదనను సుప్రీంకోర్టు తన తీర్పులో తిరస్కరించింది. ఇది రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని భంగపరుస్తుందని తీర్పు చెప్పింది. ఐనప్పటికీ ఎన్ఐఎ ఆ దారుణమైన వాదనకే కట్టుబడి కొనసాగించింది. ఉగ్రవాద కార్యకలాపాలతోగాని, ఉగ్రవాద సంస్థలతోగాని సంబంధాలు న్నట్టు ఎటువంటి ప్రాథమిక ఆధారాలూ లేకపోయినప్పటికీ, బెయిల్ పొందే హక్కులేదని వాదిం చడం అంటే ఏమిటి? కేంద్ర ప్రభుత్వం కోరుకుంటే ఎవరినైనా, ఎంతకాలమైనా జైలులో నిర్బం ధించవచ్చుననేగా?


ఈ ఏడాది ఏప్రిల్ 5న సుప్రీంకోర్టు ప్రొఫెసర్ షోమా సేన్‌కు బెయిల్ మంజూరు చేసింది. అప్పటికే ఆమె భీమా-కొరెగావ్ కేసులో అరెస్టయి నిర్బంధంలో ఆరేండ్లుగా కొనసాగుతున్నారు. ఆమెకు ఎటువంటి ఉగ్రవాద చర్యలతోగాని, ఏ ఉగ్రవాద సంస్థలతోగాని సంబంధాలు ఉన్నట్టు ఏ ప్రాథమిక ఆధారాలూ కనిపించడం లేదని బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తి స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ ఆమె ఆరేండ్లపాటు జైలులో మగ్గవలసి వచ్చింది.

ఇక్కడ రెండు మౌలికమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొదటిది: ఎటువంటి విచారణా లేకుండా ఇంత దీర్ఘకాలం పాటు ఆమెను జైలుపాలుచేసి బాధించినందుకు ఈ ప్రభుత్వం బాధ్యత వహించవలసిన పని లేదా? అందుకు శిక్ష ఏమిటి? ఎటువంటి ఆధారాలూ లేవని సుప్రీంకోర్టే స్వయంగా పేర్కొన్నప్పుడు ప్రొఫెసర్ షోమా సేన్ నిష్కారణంగా అనుభవించిన నిర్బంధానికి బాధ్యు లెవరు? రెండవది: రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత ఉన్న వివిధ దొంతరలలోని న్యాయస్థానాలు ఈ ఆరేండ్లపాటూ ఆమె జైల్లో మగ్గుతూంటే ఏం చేస్తున్నట్టు?

"ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తికి బెయిల్ పొందడం అనేది ఒక హక్కు కాదు" అంటూ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్నప్పుడు ఎన్ఐఎ (జాతీయ నేర పరిశోధనా సంస్థ) వాదించింది. ఈ వాదనను సుప్రీంకోర్టు తన తీర్పులో తిరస్కరించింది. ఇది రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని భంగపరుస్తుందని తీర్పు చెప్పింది. ఐనప్పటికీ ఎన్ఐఎ ఆ దారుణమైన వాదనకే కట్టుబడి కొనసాగించింది. ఉగ్రవాద కార్యకలాపాలతోగాని, ఉగ్రవాద సంస్థలతోగాని సంబంధాలు న్నట్టు ఎటువంటి ప్రాథమిక ఆధారాలూ లేకపోయినప్పటికీ, బెయిల్ పొందే హక్కులేదని వాదిం చడం అంటే ఏమిటి? కేంద్ర ప్రభుత్వం కోరుకుంటే ఎవరినైనా, ఎంతకాలమైనా జైలులో నిర్బం ధించవచ్చుననేగా? ఎన్ఐఎ కేంద్ర ప్రభుత్వ అధీనంలో నడుస్తుంది. ఆ సంస్థను అడ్డం పెట్టుకుని "బెయిల్ పొందే హక్కు లేదని" వాదిస్తూ, నిందితులుగా నిర్ధారించే ఏ ఆధారాలూ లేకుండానే ఎంతకాలమైనా నిర్బంధానికి గురి చేయవచ్చా?

సాధారణ న్యాయ సూత్రాలు "ఒక వ్యక్తి నేరస్తుడిగా రుజువు కానంతవరకూ ఆ వ్యక్తిని నిర్దోషిగానే పరిగణించాలి" అని నిర్దేశిస్తున్నాయి. కాని ఇప్పుడు మోడీ ప్రభుత్వం అమలు చేయ బూనుకున్న న్యాయ సూత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. "ఒక వ్యక్తి నిర్దోషి అని నిర్ధారణకు వచ్చే వరకూ, విచారణ కాలమంతా, అసలు ఏ విచారణా చేపట్టకపోయినా కూడా, ఆ వ్యక్తిని దోషిగానే పరిగణించాలి" అన్న తలకిందుల న్యాయాన్ని అమలు చేయబూనుకుంటున్నారు.

షోమాసేన్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం చాలా ముదావహం. బెయిల్ రావడమే కాదు, సుప్రీంకోర్టు ప్రభుత్వం ముందుకు తెచ్చిన వికృత న్యాయసూత్రాన్ని కూడా తిరస్కరించింది. ఐతే, ఇదే చివరిమాటగా పరిగణించవచ్చా? ఇలా సందేహించడానికి వెనుక రెండు కారణాలున్నాయి: మొదటిది: ఈ తీర్పు దేశంలోని అత్యున్నత స్థాయి న్యాయస్థానంలో మాత్రమే లభించింది. దిగువ స్థాయి కోర్టుల్లో స్పందన ఇదే తీరుగా ఇంతవరకూ కానరావడం లేదు. ప్రభుత్వ అధికారం దుర్వినియోగం ఫలితంగా దెబ్బ తింటున్న వ్యక్తుల హక్కులను పరిరక్షించాలనే స్పృహ అన్ని స్థాయిలలోని న్యాయస్థానాలలోనూ నెలకొనాల్సి వుంది. రెండవది: ఈ కేసులో విచారణ ముగిసే సమయంలో బెయిల్ మంజూరు చేయడానికి తమకెలాంటి అభ్యంతరమూ లేదంటూ ఎన్ఐఎ తన వాదనను ఉపసంహరించుకుంది. షోమాసేన్‌ను ప్రశ్నించడానికి ఇంకేమీ లేదని కోర్టుకు తెలిపింది. ఇది ఎంత అర్థం, పర్థం లేని వాదన! గత ఆరేండ్లుగా ఆమెను ఎన్ఐఎ విచారి స్తూనే వున్నట్టు, విచారణకు ఆరేండ్ల సుదీర్ఘ సమయం అవసరమైనట్టు, ఇప్పుడు ఇక ఆ అవసరం లేనట్టు ఎన్ఐఎ వాదనలు ఉన్నాయి. మరి ఎందుకు ఎన్ఐఎ ఆ విధంగా వ్యవహరించింది? బెయిల్ మంజూరు చేయడానికి తమ అభ్యంతరాన్ని కొనసాగించినా సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినట్టయితే, ఇక ముందు రాబోయే కేసుల్లో కూడా ఇదేమాదిరిగా తీర్పులు వెలువడే



ఆస్కారం ఉంటుంది. అందుచేత తమకు అభ్యంతరం లేదు కనుకనే బెయిల్ మంజూరైందని తక్కిన కేసుల్లో వాదించడానికి వీలుగా ఈ కేసులో అభ్యంతరాన్ని ఎన్ఐఎ ఉపసంహరిం చుకుంది. అప్పుడు తక్కిన కేసుల్లో తన తలకిందుల న్యాయాన్ని అమలు చేస్తూ పోవచ్చు.

ఈ మాదిరి వికృత న్యాయాన్ని ఆచరిస్తున్న వైనానికి మరో ఉదాహరణ ప్రబీర్ పురకాయస్థ కేసు. కేంద్ర నిఘా సంస్థలు చాలా కాలంగా ప్రబీర్ ఇంటి వద్ద, ఆఫీసులోను ఆధారాల కోసం తమ వేటను కొనసాగించాయి. కాని వాళ్లకి ఏ ఆధారమూ దొరకలేదు. ఈ లోగా 2023 ఆగస్టు 5న న్యూయార్క్ టైమ్స్ పత్రిక పూర్తి అవాస్తవమైన, దుర్బుద్ధితో కూడిన ఒక కథనాన్ని ప్రచురించింది. చైనాలో నివసిస్తున్న ఒక అమెరికన్ శతకోటీశ్వరుడిమీద కథనం అది. అతగాడు అభ్యుదయవాది. ప్రపంచంలో ఉన్న పలు వామపక్ష సంస్థలకు, ముఖ్యంగా అమెరికా సాగిస్తున్న యుద్ధ ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్న సంస్థలకు అతడు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు ఆ కథనం ఆరోపించింది. అతడికి చైనా ప్రభుత్వంతో సంబంధాలున్నట్టు గాని, ఏదైనా సంస్థకు తోడ్పడినట్టు ఆధారాలను కాని, మరేదైనా చట్టవ్యతిరేక కార్యకలాపానికి అతడు పాల్పడినట్టు కాని ఆ కథనం నిర్దిష్టంగా ఎక్కడా ప్రస్తావించలేదు. కేవలం నిందలు మాత్రం మోపింది. అమెరికాలో యుద్ధ వ్యతిరేక వైఖరితో ఉన్న సంస్థలమీద విష ప్రచార దాడి చేయడమే ఆ కథనం వెనుక వ్యూహం. అదే సమయంలో తమను చట్టపరంగా సవాలు చేయడానికి వీలులేని విధంగా ఆ కథనం ఉంది. ఆ కథనంలో ఆ శత కోటీశ్వరుడి నుంచి న్యూస్ క్లిక్ సంస్థ లబ్ధి పొందినట్టు సూచనప్రాయంగా మాత్రమే ప్రస్తావించారు.

ఈ నిరాధార కథనానికి ఊతం ఇచ్చేలా మార్కో రూబియో అనే ఒక మితవాద సెనేటర్ (ఇతడు ఫ్లోరిడా నుండి ఎన్నికయ్యాడు) అమెరికన్ అటార్నీ జనరల్‌కు ఒక లేఖ రాశాడు. న్యూయార్క్ టైమ్స్ కథనం ఆధారంగా అమెరికాలో పని చేస్తున్న తొమ్మిది యుద్ధ వ్యతిరేక ప్రచార సంస్థల మీదా విచారణ చేపట్టాలని ఆ లేఖలో కోరాడు. కాని అటువంటి విచారణ చేపట్టడానికి కావలసిన ప్రాథ మికమైన ఆధారాలేవీ లేవు. ప్రపంచంలో ఎక్కడబడితే అక్కడ ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కుల్ని కాలరాయడంలో వెనుకాడని అమెరికా తన దేశంలోని మానవ హక్కుల విషయంలో మాత్రం అప్పుడప్పుడూ కొంత జాగ్రత్త పడుతూ వుంటుంది. అమెరికాలోనే విచారణకు పనికి రాకుండా పోయిన ఆ న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ఇక్కడ మన దేశంలో మాత్రం ప్రబీర్‌ను, అతడి సహచరుడిని నిర్బంధించ దానికి ఒక సాకుగా వాడుకున్నారు. ఆధారమే లేకుండా విచారణ చేయడం సాధ్యం కాదన్న వైఖరిని సామ్రాజ్యవాద అమెరికా తీసుకుంటే, ఇక్కడి నయా ఫాసిస్టు ప్రభుత్వం మాత్రం తన తలకిందుల న్యాయంతో "విచారించేంత కాలమూ నేరస్తులే" అన్న వైఖరిని అనుసరిస్తోంది.

> ప్రపంచంలో ఎక్కడబడితే అక్కడ ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కుల్ని కాలరాయడంలో వెనుకాడని అమెరికా తన దేశంలోని మానవ హక్కుల విషయంలో మాత్రం అప్పుడప్పుడూ కొంత జాగ్రత్త పడుతూ వుంటుంది. అమెరికాలోనే విచారణకు పనికి రాకుండా పోయిన ఆ న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ఇక్కడ మన దేశంలో మాత్రం ప్రబీర్‌ను, అతడి సహచరుడిని నిర్బంధించడానికి ఒక సాకుగా వాడుకున్నారు. ఆధారమే లేకుండా విచారణ చేయడం సాధ్యం కాదన్న వైఖరిని సామ్రాజ్యవాద అమెరికా తీసుకుంటే, ఇక్కడి నయా ఫాసిస్టు ప్రభుత్వం మాత్రం తన తలకిందుల న్యాయంతో "విచారించేంత కాలమూ నేరస్తులే" అన్న వైఖరిని అనుసరిస్తోంది.

అరెస్టు చేసిన ఆర్నెల్ల తర్వాత ప్రబీర్ పైన ఒక చార్జిషీటు దాఖలు చేశారు. అందులో ప్రబీ ర్‌ను నేరస్తుడిగా అనుమానించడానికి న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ఒక ఆధారంగా చూపించారు. దాంతోబాటు ప్రభుత్వం ఇక్కడ అనుసరించిన కోవిడ్ నియంత్రణ విధానాన్ని విమర్శించిందని, రైతుల ఆందోళనను బలపరిచిందని న్యూస్‌క్లిక్ కథనాలను కూడా తోడు చేశారు! ప్రభుత్వ విధా నాలను విమర్శిస్తే అది చట్టాన్ని ఉల్లంఘించినట్టా?

భారత ప్రభుత్వం ఒక నయా ఫాసిస్టు పాలనను కొనసాగిస్తున్నా, భారత రాజ్యాంగానికి విరుద్ధంగా తలకిందుల న్యాయ సూత్రాలను పాటిస్తున్నా, భారతీయ న్యాయ వ్యవస్థ ఆ ప్రభుత్వానికి సహకారాన్ని అందిస్తూనే వుంది. అదే హిట్లర్ కాలంలో అయితే జర్మనీలో రీచ్‌స్టాగ్ కేసులో జర్మన్ న్యాయ వ్యవస్థ ఏకంగా హెర్మన్ గోరింగ్‌ను ఒక సాక్షిగా బోనులో నిలబెట్టడానికి గాని, ఆ కేసులో డిమిట్రోవ్ నిర్దోషి అని తీర్పు చెప్పడానికి కాని వెనుకాడలేదు. తద్వారా జర్మన్ న్యాయవ్యవస్థ నాజీల ఫాసిస్టు దూకుడుకు అడ్డుపుల్ల వేసింది. అంతమాత్రాన హిట్లర్ ఫాసిస్టు దూకుడు ఏమీ ఆగి పోలేదనుకోండి. కాని అక్క డి న్యాయవ్యవస్థ తన రాజ్యాంగ విధులను నెరవేర్చడంలో తన నిబ ద్ధతను ఎంతో కొంత ప్రదర్శించగలిగింది. మన భారతీయ న్యాయ వ్యవస్థ నుండి కూడా అటువంటి ప్రదర్శనను ఆశిద్దాం.

ఇటీవల పలువురు దేశంలోను, విదేశాల్లో కూడా ప్రసిద్ధులైన విద్యావేత్తలు, రచయితలు, ప్రముఖ వ్యక్తులు భారత ప్రభుత్వాన్ని, ముఖ్యంగా న్యాయ వ్యవస్థను ఉద్దేశించి ఒక విజ్ఞప్తి చేశారు. ఇక్కడ అధికార యంత్రాంగం సాగిస్తున్న దాడి నుంచి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించవలసిందిగా వారంతా చేసిన విజ్ఞప్తి ప్రస్తుత నేపథ్యంలో ప్రాముఖ్యత సంతరించుకుంది.

(స్వేచ్ఛానుసరణ)

ఎలక్టోరల్ బాండ్స్





"నారాయణ" అని స్మరిస్తూ, ఆదిశేషుడిపై నిద్రావస్థలో ఉన్న శ్రీహరికి నమస్కరించాడు నారదుడు. కాని శ్రీహరి గాఢనిద్రలో ఉన్నట్లుంది! నారదుడిని చూడలేదు. మరోసారి నమస్కరిం చాడు. అయినా ఫలితం లేదు.దాంతో శ్రీహరి పాదములు ఒత్తుతున్న లక్ష్మీదేవి వంక చేశాడు. గొంతు పెంచమని సైగ చేసింది లక్ష్మీదేవి.

"నారాయణ! నారాయణ!" అంటూ సౌండు పెంచాడు నారదుడు. దాంతో శ్రీహరి కండ్లు తెరిచి, నారదుడిని చూశాడు.

"ఏమి నారదా? బహుకాల దర్శనము! కుశలమేనా?" అంటూ పలకరించాడు శ్రీహరి.

"స్వామీ మీరు జగన్నాటక సూత్రధారులు! అన్నీ మీకు తెలుసు! నాకేదైనా ధర్మ సందేహం కలిగిన ప్పుడు. నివృత్తి కోసం, మీ దర్శనం చేసుకుంటాను!" అన్నాడు నారదుడు.

"ధర్మ సందేహాల సంగతి ఎట్లున్ననూ, నీ కలహ ప్రియత్వము సర్వ లోకములు ఎరిగినదే కదా!" అన్నాడు శ్రీహరి.

"ఇప్పుడు మాత్రం నాకొచ్చిన ధర్మ సందేహం నివృత్తి కోసమే మీ దర్శనం చేసుకొన్నాను స్వామీ!" అన్నాడు నారదుడు.

"ఆలస్యమెందుకు? ఏమి నీ సందేహము?" అడిగాడు శ్రీహరి.

"ఎలక్టోరల్ బాండ్స్! అనిన ఏమి స్వామి?" తన ధర్మ సందేహం వెలిబుచ్చాడు నారదుడు.

"ఎలక్టోరల్ బాండ్స్ గురించి అడుగు తున్నావు! ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్నావా?" చిరునవ్వుతో అడిగాడు శ్రీహరి.

"నాకు అంత సీన్ లేదు స్వామి!" ముందు ఎన్నికల బాండ్స్ గురించి వివరించండి!" అన్నాడు నారదుడు.

"ఒక సంస్థ గాని, వ్యక్తి గాని బ్యాంకులో బాండు కొని తనకు నచ్చిన రాజకీయ పార్టీకి ఇవ్వటం, లేదా బాండును ఆయా పార్టీలకు చెందేలా కొనుగోలు చేయటం ద్వారా ఎన్నికలకు అవసరమైన నిధులను ఆయా పార్టీలకు సమకూర్చటానికి ఏర్పాటు చేసిన బాండ్లే ఎన్నికల బాండ్లు" వివరించాడు శ్రీహరి.

"ఇందులో తప్పు ఏమున్నది? ఎన్నికల్లో ఖర్చు చేయటానికి, రాజకీయ పార్టీలకు నిధులు అవసరం కదా! మరి సుప్రీంకోర్టు ఎందుకు తప్పు పట్టింది? అడిగాడు నారదుడు.

"రాజకీయ పార్టీకి నిధులు ఇవ్వటాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టలేదు! ఇప్పటి వరకు ఎవరు ఏ పార్టీకి బాండ్ల ద్వారా ఎన్ని నిధులు ఇచ్చారో తెలియకుండా రహస్యంగా ఉంచారు! ఈ రహస్య విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది! పారదర్శకంగా ఉండాలన్నదే సుప్రీంకోర్టు తీర్పు సారాంశం!" వివరించాడు శ్రీహరి.

"డబ్బులున్నవాడు అవసరం ఉన్న రాజకీయ పార్టీకి బాండు ద్వారా నిధులిచ్చారు! ఇందులో పారదర్శకత అవసరమేమి ఉన్నది స్వామీ! పైగా, గుప్తంగా దానాలు చేయవలెనని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నవి కదా!" అన్నాడు నారదుడు.

"నీవు, ఎంతో ప్రయాసపడి సందేహ నివృత్తికై వైకుంఠము దాకా ఎందుకు వచ్చితివి?" ప్రశ్నించాడు శ్రీహరి.

"ధర్మ సందేహాల నివృత్తికై ఎన్ని కష్ట, నష్టాలనైనా భరించెదను స్వామీ! అది నా హక్కు!" అన్నాడు నారదుడు దృఢంగా.

" ఎన్నికల బాండ్ల ద్వారా చలామణి అయ్యేది పూర్తిగా ప్రజల డబ్బు! ప్రజల డబ్బు ఇస్తున్నది కంపెనీలు, తీసుకుంటున్నది రాజకీయ పార్టీలు! తమ డబ్బు ఏ కంపెనీ, ఏ పార్టీకి ఎందుకు ఇస్తున్నదీ తెలుసుకునే హక్కు ప్రజలకున్నది! అందువల్ల ఆ వివరాలన్నీ బయట పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది!" వివరించా డు శ్రీహరి.

"ఈ ప్రజలు నిజంగా పిచ్చివాళ్లు స్వామీ! ఏ కంపెనీ ఏపార్టీ ఎంత నిధిని బాండ్ల ద్వారా ఇచ్చిందో తెలుసుకుని ఏమి చేసుకుంటారు?" అన్నాడు నారదుడు నిర్లక్ష్యంగా.

"నీవు కూడా పిచ్చివాడవే కదా!" అన్నాడు శ్రీహరి నవ్వుతూ దాంతో లక్ష్మీదేవి కూడా నవ్వింది.

"స్వామీ! మీ పరిహాసం నాకు అర్థమైంది! సందేహాన్ని నివృత్తి చేసుకోవటం ద్వారా నేను జ్ఞానాన్ని సంపాదించి. ఇతరులకు కూడా అందచేస్తాను అది లోకకల్యాణానికి తోడ్పడు తుంది!" అన్నాడు నారదుడు రోషంతో.

"భేష్! నారదా! ఇప్పుడు అసలు విషయానికి వచ్చావు! విషయ పారదర్శకత జ్ఞానాన్ని కల్గిస్తుం ది! ఆ జ్ఞానం లోకకల్యాణానికి తోడ్పడు తుంది. ఇదే కదా నీవు చెప్పినది!" అన్నాడు శ్రీహరి.

"ముమ్మాటికీ అంతే స్వామీ! అదే నిత్య సత్యం కూడా!" అన్నాడు నారదుడు మరింద దృఢంగా.

"ఎన్నికల బాండ్లకు సంబంధించిన విషయాలు బయటకు తెలిసిన తర్వాత ప్రజలకు సరికొత్త జ్ఞానం అందింది! మచ్చుకి కొన్ని తెలుపుతాను విను! లాటరీలు నిర్వహించే ఒక కంపెనీ, తన ఆదాయానికి రెండింతలు అంటే వెయ్యికోట్ల రూపాయల బాండ్లు కొనుగోలు చేసింది. మరొక ఔషధ కంపెనీ, ముందు ఐదు లక్షల విలువైన బాండు కొనుగోలు చేసింది. కొతకాలం తర్వాత 30 కోట్ల బాండ్లు కొనుగోలు చేసి, అధికార పార్టీకి అప్పచెప్పింది. ఇప్పుడు కేజ్రీవాల్ అవినీతి పరుడని సాక్ష్యం చెప్పిన శరత్ చంద్రారెడ్డి కూడా అధికార పార్టీకి ఎన్నికల బాండ్ ఇచ్చాడు! మేఘా కంపెనీ కూడా అధికార పార్టీకి బాండ్ల నజరానా సమర్పిం చింది!" వివరించాడు శ్రీహరి.

"ఇందులో కొత్తగా వచ్చిన జ్ఞానమేమున్నది?" ప్రశ్నించాడు నారదుడు.

"పైన చెప్పిన కంపెనీలు ఏవీ స్వచ్ఛందంగా బాండ్లు కొనుగోలు చేయలేదు! ఆయా కంపెనీలపై ఈడి దాడులు చేసి కేసులు పెట్టింది! ఆ తర్వాతే ఆయా కంపెనీలు బాండ్లు కొనుగోలు చేసి, అధికారపార్టీకి అప్ప చెప్పాయి! అందుకే ఉత్తరాఖండ్‌లో కూలిపోయిన టన్నెల్ నిర్మించిన కంపెనీ మీదగాని, బీటలు వారిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మేఘా కంపెనీపైన గాని ప్రభుత్వం చర్యలు తీసుకోవటం లేదు! సారాంశం ఏమిటంటే అధికారపార్టీకి నిధులివ్వక పోతే ఈడి ద్వారా దాడులు చేయిస్తారు! నిధులు ఇస్తే, కేసులు ఎత్తి వేస్తారు! ఎంత అవినీతి జరిగినా పట్టించు కోరు అంటే నీవు ఎంతైనా సంపాదించుకో! నాకు కొంతైనా సమర్పించుకో!" అని అర్థం!" వివరించా డు శ్రీహరి.

"దివ్యంగా సెలవిచ్చారు! స్వామీ! కానీ మీ కృష్ణావతారంలోని కుచేలోపాఖ్యానమే ఎలక్టోరల్ బాండ్లకు స్ఫూర్తి అనీ, తాము చేసింది కూడా అదేనని కుచేలుడి వద్ద మీరు అటుకులు తీసుకున్నట్లు, తాము కూడా కార్పోరేట్ కంపెనీల వద్ద ఎలక్టోరల్ బాండ్లు తీసుకున్నామని! మీకు అటుకులు ఇచ్చిన కుచేలుడికి, మీరు కూడా అంతులేని సంపదలు అనుగ్రహించితిరి కదా! అందువల్ల తాము చేసినది మాత్రమే తప్పెలా అవుతుందని ప్రధాని అంటున్నారు!" అన్నాడు నారదుడు.

"నారదా! కుచేలుడు నాకు అటుకులు ఇచ్చుట, నేను అతనికి సంపదలు నొసగుట మాత్రమే చూస్తే ఎలా! అందులోని ధర్మ సూక్ష్మ మును గ్రహించవలెను! కుచేలుడు నిరుపేద వాడు! నేను అప్పుడు అనగా కృష్ణావతారములో రాజును! అందుకే కుచేలుడికి సంపదలు అనుగ్రహించితిని. ప్రధాని కూడా కుచెలురైన పేదలకు సంపదలు అనుగ్రహింప వచ్చును. అవకాశము, అధికారము రెండూ ప్రధానికి ఉన్నవి. కాని ఆ రెండింటిని వినియోగించి అదే పేద ప్రజలను దోచుకుంటున్న కార్పోరేట్ కంపెనీ లకు సంపదలను అనుగ్రహించు చున్నారు. నా కృష్ణావతారము పేరు చెప్పి ప్రజలను మరోసారి మోసగించుచున్నారు!

ఈ ధర్మ సూక్ష్మమును నీవు ప్రజలకు వివరించిన లోక కల్యాణము జరుగును!" అన్నాడు శ్రీహరి.

"అవశ్యము స్వామీ! మీరు చెప్పిన ఈ ధర్మ సూక్ష్మమును ప్రజలకు వివరించెదను లేనిచో లోక కల్యాణము సంగతి తర్వాత ముందుగా లోక నాశనము జరుగును" అన్నాడు నారదుడు ఆందోళనగా.

నారదుడి వంక లక్ష్మీదేవి ఆశ్చర్యంగా చూసింది!

"మీకు తెలియంది ఏమున్నది తల్లీ! ఎలక్టోరల్ బాండ్ల ప్రభావం వైకుంఠము దాకా ప్రసరించింది! బాండ్ ఇవ్వనిదే జయవిజయులు నన్ను కూడా లోపలికి రానివ్వలేదు!" అన్నాడు నారదుడు చేతులు జోడించి

దాంతో లక్ష్మీదేవి అంతర్థానమై పోయింది.

- ఉషాకిరణ్

గోల్డ్ మెడల్స్ సాధించిన న్యూ టైనిటాట్స్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని న్యూ టైనిటాట్స్ పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్ తెలిపారు. విశ్వం ఎడ్యుటేక్ వారు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అబాకాస్‌లో జిల్లా స్థాయి మెడల్స్‌ను బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారన్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు సహస్ర, సాత్విక్, సాయి ప్రకాష్, ఉదయ్ సాయిరాం, రిషిక్, తేజ్ పవన్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్జ్‌లో గ్రాడ్యుయేషన్ డే

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. నర్సరీ నుంచి మొదలుకొని గత 8 సంవత్సరాలుగా వివిధ అన్ని తరగతులు చదివి 5వ తరగతి విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టాలు అందుకొని సంబురంగా గడిపారు. వివిధ ఒలంపియాడ్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా తమ పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ

భవన నిర్మాణ రంగం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముద్దం శ్రీను

నవతెలంగాణ- ముదిగొండ



కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పదేళ్లలో కార్మికుల హక్కులను హరించిందని భవన నిర్మాణ రంగం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముద్దం శ్రీను ఆరోపించారు. ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో భవన నిర్మాణరంగం వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు కన్నోజు ఈశ్వరచారి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండోసారి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులపై అధిక భారం మోపిందన్నారు. ప్రధాని మోడీ ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నాడని ఆయన విమర్శించారు. కార్మికుల జీవన విధానంపై ప్రధాని మోడీ దెబ్బకొట్టాడన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగానికి కేటాయించిన బడ్జెట్ను ప్రధాని మోడీ పక్కదారి పట్టిస్తున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిను చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బిల్డింగ్ రంగ కార్మికుల హక్కులకు ఐక్యంగా ఉద్యమించాలని ముద్దం శ్రీను కోరారు. సమావేశంలో భవన నిర్మాణరంగం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దోనోజు లక్ష్మణాచారి, సిఐటియు మండల కన్వీనర్ టీఎస్ కళ్యాణ్, భవన నిర్మాణరంగం వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి చెట్టుపోగు వెంకటేశ్వర్లు, నాయకులు చెరుకుపల్లి వీరబాబు, పి.సోమయ్య, అంతోటి రాజు, సుందరరావు, ఉసికల ఉపేందర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

18 నుండి నామినేషన్లను స్వీకరణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



ఈ నెల 18 గురువారం నుండి నామినేషన్లను స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం ఏర్పాటు చేసి, నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుండి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉన్నట్లు, ఈ నెల 21న ఆదివారం మినహాయించి, మిగతా 7 రోజులు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ వేయడానికి వచ్చు అభ్యర్థికి సంబంధించి 3 వాహనాలు మాత్రమే అనుమతించబడునని, మిగతా వాహనాలు 100 మీటర్ల దూరంలో ఉండాలని ఆయన అన్నారు. నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఒకేసారి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని ఆయన తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజర్, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రపోజర్లు ఉండాలన్నారు. పోటీచేయు అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండవచ్చని, ప్రపోజర్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటుహక్కు కలిగి ఉండాలని ఆయన అన్నారు. బ్యాలెట్ పేపర్‌లో ముద్రణకు చిహ్నాలు ఎన్నికల సంఘం నుండి వస్తాయని, ఫోటోల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 26న అదే ఛాంబర్‌లో స్క్రూటినీ ప్రక్రియ చేపట్టబడుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 29 వరకు ఉపసంహరణకు గడువు ఉన్నట్లు అన్నారు. అభ్యర్థులకు కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి, లేటెస్ట్ నామినేషన్ పత్రం ప్రింట్, అఫిడవిట్ పత్రాలను అందుబాటులో ఉంచినట్లు, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. నామినేషన్ ఫారం-2ఎ లో, అఫిడవిట్ ఫారం-26లో సమర్పించాలన్నారు. అఫిడవిట్ లో అన్ని కాలమ్‌లు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు విషయమై తాజా బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ఎన్నికల సంబంధ లావాదేవీలన్నీ ఈ ఖాతా ద్వారానే జరపాలని ఆయన అన్నారు. అభ్యర్థికి రూ.25 వేలు సెక్యూరిటీ డిపాజిట్, ఎస్సి, ఎస్టీ అభ్యర్థులు అయితే, రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అన్ని రకాల అనుమతుల కొరకు సువిధ సింగిల్ విండో ద్వారా దరఖాస్తులు చేయాలని, దరఖాస్తు 48 గంటల ముందస్తుగా చేయాలని ఆయన అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ స్వీకరణ చెక్ లిస్ట్ అందజేసి, దాని ప్రకారం సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జెడ్పి సిఇఓ వినోద్, డిటిఓ సత్యనారాయణ, ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఎస్పీ పార్టీ ప్రతినిధి బి.బాలరాజు, బిజెపి పార్టీ ప్రతినిధి జిఎస్ఆర్ఎ. విద్యాసాగర్, సిపిఐ(ఎం) ప్రతినిధి వై.విక్రం, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్.సత్యంబాబు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి చీకటి రాంబాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'హస్తం' టికెట్ హాట్ హాట్

- కాంగ్రెస్‌లో కాకపుట్టిస్తున్న ఖమ్మం ఎంపీ అభ్యర్థిత్వం
- మొన్న హైదరాబాద్‌లో ఏఐసీసీ నేతలతో సమావేశం
- 18 నుంచి నామినేషన్లు...అయినా తేలని అభ్యర్థి
- 25తో నామినేషన్లు పూర్తి...24 దాకా సాగదీతేనట..!
- భవిష్యత్తు ఎన్నికలు, పార్టీ విస్తరణ ఆధారంగా ఎంపిక

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ టిక్కెట్ సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. దాదాపు నెలన్నర రోజుల నిరీక్షణకు ఆది లేదా సోమవారాల్లో తెరపడుతుందని అందరూ ఆశించారు. కానీ ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇతర మంత్రులు, పార్లమెంట్ ఇన్‌చార్జులతో ఆదివారం రాత్రి జరిపిన చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. ఖమ్మంతో పాటు మిగిలిన కరీంనగర్, హైదరాబాద్ స్థానాల అభ్యర్థులను ఈ సమావేశం తర్వాత ప్రకటిస్తారని పార్టీ శ్రేణులతో పాటు ప్రత్యర్థులు సైతం ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ అలాంటిదేదీ లేకుండా సమావేశం ముగించి, రాత్రికి రాత్రే వేణుగోపాల్ ఢిల్లీ వెళ్లారు. సోనియా, రాహుల్, పార్టీ అధ్యక్షుడు ఖర్గేతో చర్చించి సోమవారం మధ్యాహ్నం లోపు ప్రకటిస్తారని అనుకున్నారు. కానీ రోజంతా ఎదురుచూసినా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అత్యధిక స్థానాల్లో గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని, రాష్ట్రంలో 15 సీట్లయినా గెలవాలని ఆయన దిశానిర్దేశం చేసి వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికలతో పాటు భవిష్యత్‌లో పార్టీ విస్తరణను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఆయన సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం.

24వ తేదీ వరకు నిరీక్షణ తప్పదా..?

ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిపై సోమవారం ప్రకటన వెలువడుతుందని భావించగా...అలాంటిదేమీ లేకపోవడంతో 24వ తేదీ వరకు నిరీక్షణ తప్పక పోవచ్చని పార్టీ శ్రేణుల నుంచిఅందుతున్న సమాచారం. మరో రెండు రోజుల్లో అనగా 18వ తేదీ నుంచి నామినేషన్ల ఘట్టం మొదలవుతుంది. 25వ తేదీతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. 24వ తేదీన అభ్యర్థిని ప్రకటిస్తే వివాదాలు...విభేదాలకు తగిన సమయం ఉండదనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం ఉద్దేశపూర్వకంగా అభ్యర్థి ప్రకటనను ఆలస్యం



చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎంపిక పూర్తి...ప్రకటనే తరువాయి..?

కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటికే అభ్యర్థిని ఎంపిక చేసిందని..ప్రకటన విషయంలోనే తాత్సారం చేస్తుందనే అనుమానం పార్టీ వర్గాల్లో ఉంది. వ్యూహాత్మకంగానే ఆలస్యం చేస్తున్నట్లు భావిస్తున్నారు. ఏదో పార్లమెంట్ ఎలక్షన్లనే కాకుండా భవిష్యతులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ విస్తరణ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకునే అభ్యర్థి ఎంపిక జరిగి ఉంటుందని సమాచారం. సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకున్నా దాని ప్రభావం అంతగా ఉండకపోవచ్చనే అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. స్థానికేతరునికి టిక్కెట్ ఇవ్వడం ప్రస్తుత పరిస్థితుల్లో అంతగా వర్క్ అవుట్ కాదనే అభిప్రాయానికీ పార్టీ పెద్దలు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎప్పుడో నిర్ధారణకు వచ్చినా కొన్ని అడ్డంకులు...!

అభ్యర్థి విషయంలో ఏఐసీసీ ఎన్నికల కమిటీ ఎప్పుడో నిర్ధారణకు వచ్చినా మధ్యలో కొందరు నాయకుల ఒత్తిడి కాంగ్రెస్ పెద్దలను సందిగ్ధంలోకి నెట్టిందంటున్నారు. సామాజిక, ఆర్థికాంశాలను వారు పార్టీ ముందుంచి నిర్ణయాన్ని సంక్లిష్టం చేసినట్లు సమాచారం. ఆర్థిక అంశాల విషయంలో నేరుగా అభ్యర్థులు, వారిని ప్రపోజ్ చేస్తున్న మంత్రులు, పార్టీ ప్రముఖులతోనూ చర్చించినట్లు తెలుస్తోంది. ఓ ఆశావాహునికి ఖమ్మం పార్లమెంట్‌తో పాటు పొరుగున ఉన్న ఎస్టీ నియోజకవర్గం మహబూబాబాద్ స్థానానికీ పెట్టుబడి పెట్టాలని సూచించగా... అందుకు ఆయన అంగీకరించినట్లుగా కూడా టాక్ నడుస్తోంది. ఓ కార్పొరేట్ పెద్ద నుంచి కూడా ఆయన టిక్కెట్ విషయంలో ఒత్తిడి చేయించటం...అభ్యర్థి ఎంపికలో కీలక నేతలు కొందరికి కొంతమేర డబ్బులు ఎరచూపారనే టాక్ ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు వారి నుంచి స్పష్టమైన హామీ రావడంతో స్థానికంగా తన అనుకూలురతో కొంత హడావుడి చేశారు. అంతలోనే ఓమంత్రి దూతలు ఢిల్లీ వెళ్లి టిక్కెట్ వ్యవహారాన్ని పూర్తిగా తమకు అనుకూలంగా మలిచినట్లు సమాచారం. ఎవర్ని ఎలా మేనేజ్ చేయాలో అలా దారిలోకి తెచ్చిన ఫలితమే కేసీ వేణుగోపాల్ హుటాహుటిన హైదరాబాద్ వచ్చి ఆదివారం మీటింగ్ ఏర్పాటు చేశారని టాక్. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం టిక్కెట్ ఎవరికి ఇవ్వాలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారని, ఆ ప్రకారమే టిక్కెట్ ఫైనల్ అయిందనే వార్తలు వినిపిస్తున్నాయి. టిక్కెట్‌పై ఎప్పుడో నిర్ధారణకు వచ్చినా... కొందరి ప్రయత్నాలు, కొన్ని పరిణామాలపైన యోచించక తప్పనిసరి స్థితిలోనే కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి ప్రకటన ఆలస్యమవుతున్నట్లుగా పార్టీ వర్గాలు, రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



ప్రమాదవశాత్తు టిప్పర్ దగ్ధం

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని న్యూలక్ష్మీపురం సమీపాన రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌కు ఆదివారం అర్ధరాత్రి మంటలు అంటుకొని దగ్ధమవుతుండగా లారీ డ్రైవర్ అరుపులు కేకలతో మంటల నుండి తప్పించుకొని ప్రాణాలతో బయట పడ్డారు. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కి సమాచారం ఇవ్వగా ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని టిప్పర్‌లో చెలరేగిన మంటలను ఆర్పారు. దీంతో ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పిల్చుకున్నారు.

సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు తిరుపమ్మ మృతి

నివాళ్లర్పించిన పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలోని చిరుమర్రి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరాలు, సొసైటీ మాజీ డైరెక్టర్ బండి తిరపమ్మ(60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, ఎంపీటీసీ సభ్యురాలు కోలేటి అరుణలు తిరుపమ్మ మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలు తిరుపమ్మకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల నాయకులు మందరపు వెంకన్న, కందుల భాస్కరరావు, కోలేటి ఉపేందర్, గ్రామ శాఖ కార్యదర్శి సామినేని రామారావు, నాయకులు ఉన్నం కోటేశ్వరరావు, బండి మోహన్‌రావు, బండి శేఖర్, చావగాని మాధవరావు, సామినేని రాంబాబు, మోర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలి

అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్

జేవీఆర్ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన సదస్సు

నవతెలంగాణ-సత్తుపల్లి



ప్రజాస్వామ్య పరిరక్షణకు విద్యార్థులు పాటు పడాలని, దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), అడిషనల్ రిటర్నింగ్ ఆఫీసర్, కల్లూరు ఇన్‌ఛార్జి ఆర్డీవో డి మధుసూదన్ నాయక్ అన్నారు. సోమవారం సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్ అధ్యక్షతన విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సదస్సులో అడిషినల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సి-విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ల ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ కళాశాల ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ద్వారా విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా ఓటరు అవగాహనకు సంబంధించి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దారు శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఓటరు నమోదు శాతాన్ని పెంచడంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కూర్మా యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జి వీరన్న, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పానెం రామచంద్రరావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎం రాంబాబు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కన్వీనర్ కే రాజ్యలక్ష్మి, డాక్టర్ వినోద్‌కుమార్, పీర్ సాహెబ్, డి బంగారి, డాక్టర్ మాధవి, రవికుమార్, డాక్టర్ టి కృష్టారావు, డాక్టర్ ఓ చెన్నారావు, జి శ్రీనివాసరావు, కే ప్రభావతి, ఆంజనేయులు, మల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంసూరు : మండలంలో ఓటర్ నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ మధుసూదన్ సోమవారం పరిశీలించారు. పల్లెవాడ, చౌడవరం గ్రామాలలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి సతీష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను మండల అభివృద్ధి అధికారి సురేందర్ నాయక్ సోమవారం పరిశీలించారు. బనిగండ్లపాడు, చొప్పకట్లపాలెం గ్రామాలలో చేపట్టిన ఫీడర్ కాలవలలో పూడిక మట్టిని తొలగించే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజుకి 300 రూపాయలు తగ్గకుండా కూలి పొందేలాగా కొలతలు ప్రకారం పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఉదయం 5:30 నుండి 11:00 గంటలలోపు పని పూర్తి చేసుకుని వెళ్లాలని కోరారు. పని ప్రదేశంలో మస్టర్లు తనిఖీ చేసి, కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కూలీలకు పని ప్రదేశంలో నీడ, శుద్ధమైన తాగునీరు ప్రతి రోజు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో కె.నాగరాజు, ఈసి వెంకటేష్, టిఏ కాంతమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాధాకృష్ణ, పవన్, ఎఫ్ఏలు స్వరాజ్య లక్ష్మి, సునీల, ఉపాధిహామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని శిక్షణ ఐపీఎస్ అధికారి మౌనిక అన్నారు. గుదిమళ్ళ వెంకటగిరి, గుర్రాలపాడు గ్రామాల్లో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ ఐపీఎస్ అధికారి మాట్లాడారు. ఎన్నికల నిబంధనల గురించి వివరించారు. ఎన్నికల సమయంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు వివరించారు. ఎవరైనా ఘర్షణలకు, అల్లర్లకు పాల్పడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామారావు, పుష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణ మహోత్సవం

మాంగళ్యధారణ, గ్రామసేవ అనంతరం తెప్పోత్సవం

నవతెలంగాణ-ఎర్రుపాలెం





తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా పచ్చని తోరణాల నడుమ వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారు అమ్మవారు పాణి గ్రహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణలతో మంగళ వాయిద్యములతో పూర్తి ఆధ్యాత్మిక శోభతో నైనానందకరముగా కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ బ్రహ్మోత్సవంలో దేవాలయ అర్చక స్వాములు శాస్త్ర యుక్తంగా కళ్యాణ క్రతువును అద్వేతం రక్తి కట్టేలా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, వరపూజ, పాద ప్రక్షాళన, మధుపర్కములు, యోక్త్ర పూజ, మాంగల్య పూజ నిర్వహించి లోకనాయకునికి ముత్యాల తలంబ్రాలను వధువులు శ్రీ అలివేలు మంగ, పద్మావతి అమ్మవారు శిరస్సు పోసుకున్న ఘట్టం భక్తులకు ఎంతో మధురానుభూతిని కలిగించినట్లు శ్రీనివాస్‌శర్మ తెలిపారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం నుండి పంపించబడిన ముత్యాల తలంబ్రాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రావు దంపతులు స్వామి వారికి సమర్పించారు. జమలాపురం గ్రామ పంచాయతీ తరపున ఆనవాయితీగా తెచ్చు పట్టువస్త్రములు, ముత్యాల తలంబ్రాలను ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) హరికిషన్ దంపతులు సమర్పించారు. జమలాపురం గ్రామానికి చెందిన ఖమ్మం కెఎస్ఆర్ గ్రానైట్ అధిపతి దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు నిర్మలా కుమారి దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రములు సమర్పించారు. తుళ్లూరు కోటేశ్వరరావు దాతృత్వంతో స్వామి వార్ల తెప్పోత్సవం కార్యక్రమాన్ని జమలాపురం పెద్ద చెరువు (తటాకం) నందు రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణతో రకరకాల వేషధారణలతో చూపరులను ఆనందపరిచే విధంగా ప్రతి సంవత్సరం వార్షికంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారు అమ్మవార్ల గ్రామ సేవ ఊరేగింపు అనంతరం తెప్పోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కోట్ల రూపాయల ఖర్చుతో వకుళమాత స్టేడియం పేరుతో కళ్యాణ వేదికను కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవ ఉత్సవంలో ఎర్రుపాలెం మండల అభివృద్ధి అధికారి బి.సురేందర్, గ్రామపంచాయతీ కార్యదర్శి వి.సురేష్‌బాబు దంపతులు పాల్గొన్నారు. కల్యాణానికి తరలివచ్చిన భక్తులకు ఉచితంగా మంచినీరు, మజ్జిగ, ప్రసాద వితరణములతో పాటు విశేషంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి శ్రీ వారు గ్రామ సేవగా శేష వాహనంపై బయలుదేరి భక్తజన సందోహ స్వాగతముల మధ్య గ్రామ చెరువు నందు ఘనంగా తెప్పోత్సవం అని పిలువబడు ప్లవంగోత్సవం కార్యక్రమం నిర్వహించినారు. చుట్టుప్రక్కల ప్రాంతంలో నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారి తెప్పోత్సవంను తిలకించి ఆనంద పరవశులైనారు. కార్యక్రమాలలో ఆలయ సిబ్బంది, అర్చక బృందం, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, దాతలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖమ్మంలో మార్వాడి యూనివర్సిటీ అడ్మిషన్ ఆఫీస్ ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నెహ్రూనగర్‌లో గల పాత సీపీఐ కాంప్లెక్స్ నాలుగవ అంతస్తులో మార్వాడి యూనివర్సిటీ-గుజరాత్ యొక్క ఖమ్మం రీజినల్ అడ్మిషన్ ఆఫీస్‌ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులు, ప్రిన్సిపల్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీర్ రాజేష్‌కుమార్ పటేల్ చేతుల మీదుగా ఆఫీస్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోనే మార్వాడి యూనివర్సిటీ 23వ స్థానంలో నిలవడంతో పాటు 'న్యాక్ ఏ ప్లస్' గుర్తింపు పొందిందని అన్నారు. అదే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సి పొంది 53 దేశాల విద్యార్థులు యూనివర్సిటీలో చదువుతున్నారని వివరించారు. ఈ యూనివర్సిటీలో ప్రపంచస్థాయి ప్రమాణాలు కలిగిన సౌకర్యాలు, ఇప్పుడున్న పరిస్థితులను బట్టి మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే విధంగా ఫీజులు నిర్ణయించామని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 50 శాతం మార్కులు పొందిన విద్యార్థులు అర్హులని అన్నారు. మార్వాడి యూనివర్సిటీలో కోర్సులు డిప్లొమా, బిటెక్, ఎంబిఎ, ఫార్మసీ, బీఎస్సి అగ్రికల్చర్, ఫిజియోథెరపీ, ఎల్ఎల్‌బి తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మరియు తెలంగాణ ఇంచార్జ్ మహేంద్ర నాయుడు, వెంకట వినయ్, భాను, ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ వెంకీ నాయుడు, చరణ్ ఆల్లప్పం, తిరుమల రెడ్డి, దివ్య బాలినేని తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాలకు 7799467788/ 8886661866 నెంబర్లని సంప్రదించాలని సూచించారు.

జాగ్రత్తలు పాటించండి

వడదెబ్బకు దూరంగా ఉండండి

నవతెలంగాణ-కల్లూరు

వేసవి కాలంలో ఎండలు అధికంగా ఉండటం వల్ల ఉదయం సాయంత్రం వేళల్లోనే బయటికి వచ్చి పనులు చూసుకోవాలని తగినన్ని మంచినీరు తాగాలని తదితర అంశాలపై ఉపాధి హామీ కూలీలకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవార వడదెబ్బపై లక్ష్మా తండాలో ఉపాధి హామీ కూలీలకు వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ రామారావు వివరించారు. రైతులు, కూలీలు పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు నెత్తికి టోపీ లేదా గొడుగు ధరించాలని, వెంట తగినన్ని తాగునీరు తీసుకువెళ్లాలని, ఎండకు శరీరంలో ఉన్న నీరు చెమట రూపంలో బయటకు బయటికి వెళుతుందని, చెమట ద్వారా ఖనిజ లవణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. మరల వాటిని ఉప్పు పంచదార కలిపిన నీరు, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం మొదలగునవి తీసుకోవడం ద్వారా వడదెబ్బ తగలకుండా నివారించవచ్చని తెలిపారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు. ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత వెళ్లాలని అన్నారు. జ్వరం, వాంతులు విరోచనాలు, దాహం వేయడం, మొదలగు లక్షణాలు కనిపించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నిర్మల, పద్మ, గ్రామపంచాయతీ సెక్రటరీ హరీష్ కూలీలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

నవతెలంగాణ-కామేపల్లి

నెమలిపురి గ్రామంలో వైభవంగా శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆలయ నిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు రామ్ రెడ్డి, శ్రీ చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, లింగాల ఎంపీటీసీ రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లి బాబు, సొసైటీ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు పాల్గొన్నారు.

పర్ణశాలకు రూ.20 వేల

విలువ చేసే గొడుగులు అందజేత

నవతెలంగాణ -దుమ్ముగూడెం

పర్ణశాల రామయ్యకు రూ.20 వేల విలువచేసే గొడుగులను సోమవారం అందజేశారు. పాల్వంచ వాస్తవ్యులు స్వరూప్ శ్రీదేవి దంపతులు పర్ణశాల స్వామి వారి దర్శనం అనంతరం పర్ణశాల రామాలయ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు పాల్గొన్నారు.

శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో అన్నదానం

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలోని శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడు, ఐరన్ మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కురువెళ్ల కృష్ణ, లక్ష్మి దంపతుల పెండ్లిరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య....

నవతెలంగాణ-ఖమ్మం రూరల్


ఓ వివాహిత ఉరేసుకొని ఆత్యహత్యకు పాల్పడ్డ సంఘటన మండల పరిధిలోని ఆటోనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లిక పున్నారావు, కవిత (28) దంపతులు ఆటోనగర్ లో నివాసం ఉంటున్నారు. పున్నారావు ఆర్ఎంపీ వైద్యునిగా పనిచేస్తున్నాడు. పున్నారావు వివాహేతర సంబంధాలు ఏర్పారుచుకొని తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని తరచుగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం రాత్రి కూడా ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఆమె గదిలోకి వెళ్లి తలుపు పెట్టుకొని ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పున్నారావు ఇంట్లోని హాల్లో నిద్రించాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూసే సరికి ఫ్యాన్ కు ఉరేసుకొని కన్పించింది. సంఘటనా స్థలాన్ని శిక్షణ ఐపీఎస్ అధికారి మౌనిక, ఎస్ఐ రామారావులు సందర్శించారు. భర్త, అత్త ఇద్దరు కలిసి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడం వల్లనే కవిత మృతిచెందినట్లు మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ- ఖమ్మం



రఘునాధపాలెం ఎంపీపీ భూక్యా గౌరిలాల్య, భానోత్ భీమాల ఆధ్వర్యంలో జికె బంజర గ్రామ నాయకులు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్)లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావేద్ సమక్షంలో చేరారు. భాణోత్ బాలాజి, బాదావత్ రవి, ఇరుకు రామయ్య భూక్యా పరమయ్య, మాలోత్ హట్యా మాలోత్ రమేశ్‌లకు జిల్లా, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు భూక్యా శ్రీను, మాలోత్ నారాయణ, బోడా లాల్‌సింగ్, పెనుగొండ రాజు, బోడా భావ్ సింగ్, భానోత్ చిన్నా రాము, బోడా సంతు, భానోత్ పరుశురాం, శివ్లాలు పాల్గొన్నారు.



మదగాని రాములమ్మకు నివాళి

నవతెలంగాణ-కారేపల్లి

ప్రముఖ రియల్టర్ మదగాని వెంకటేశ్వర్లు మాతృమూర్తి రాములమ్మ సంస్మరణ కార్యక్రమం సోమవారం కారేపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు హాజరై రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసీ నివాళ్లు అర్పించారు. నివాళ్లు అర్పించిన వారిలో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, సొసైటీ చైర్మన్ దుద్దినేని శ్రీనివాసరావు, సంత ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బానోత్ దేవ్లానాయక్, ప్రముఖ న్యాయవాధి నర్సింగ్ శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ ఎండీ.హనీఫ్, సొసైటీ డైరక్టర్ దేగల ఉపేందర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, ఇమ్మడి తిరుపతిరావు, బీఆర్ఎస్ నాయకులు అజ్మీర వీరన్న, బత్తుల శ్రీనివారావు, అడపా పుల్లారావు, ఆదెర్ల రామారావు, వాంకుడోత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటరుగా నమోదు చివరి అవకాశం

నవతెలంగాణ-ఖమ్మం

ఓటరుగా నమోదుకు సోమవారం చివరి అవకాశమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. 31 మార్చి, 2006లోగా పుట్టిన వారంతా ఓటరుగా నమోదుకు అర్హులని, నమోదుకు ఫారం-6 ద్వారా వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జతపరచి దగ్గరలోని బిఎల్ఓకు అందజేయడం లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేనివారు, అన్ని అర్హతలు ఉన్నా ఇప్పటి వరకు నమోదు చేసుకోని వారంతా ఫారం-6 ద్వారానే దరఖాస్తు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి బస్టాండ్ ఆటో అడ్డా యూనియన్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆర్టీసీ సత్తుపల్లి డిపో మేనేజర్ యూ రాజ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఎండలు తీవ్రంగా దృష్ట్యా ప్రయాణికులు ఉపశమనం పొందడానికి బస్టాండ్ ఆటో అడ్డా యూనియన్ వారు మజ్జిగను ప్రయాణికులకు అందించడం అభినందనీయమన్నారు. బస్టాండ్ ఆవరణలో ఆటో కార్మికులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు చల్లటి తాగునీరు అందించడంతో దాతల సహకారంతో ప్రతిరోజూ మజ్జిగను అందించడంపై ఆటో యూనియన్ నాయకులను డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అభినందించారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి మొదటిరోజు సహకారం అందించి 400మంది ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసిన ఆర్కే ఫౌండేషన్ ఇనపనూరి రామకృష్ణను ఈ సందర్భంగా డిపో మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆంబోజు శ్రీనివాసరావు, ఎస్కే ఘుంషావలి, నందిపాటి రవి, కే సాంబ, పి సుధాకర్, ఆర్టీసీ టీఐ-3 సుబ్బారావు, ఎస్కే పాషా, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, ఎస్ రమేశ్ పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-కామేపల్లి



సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలు సత్వరమే పూర్తి చేయాలని, కాలువల నిర్మాణం కోసం 2019 అవార్డు ప్రకటించిన భూములకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేసి సాగు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో దుగ్గి కృష్ణ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గోదావరి నదిపై దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మాణం చేసి సాగునీరు అందించాలని రెండు దశాబ్దాలపైగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రాజెక్టు సాధన కోసం అనేక ప్రజా ఉద్యమాలు 2000లో ప్రారంభ దశలో జరిగాయని, ఖమ్మం పార్లమెంట్ మాజీ సభ్యులు తమ్మినేని వీరభద్రం దుమ్ముగూడెం సాధనకై మహాప్రస్థానం పాదయాత్ర వంద రోజులు నిర్వహించారని గుర్తు చేశారు. వామపక్ష పార్టీలు అనేక ఉద్యమాలు నిర్వహించాయి, రైతు సంఘాలు దశాబ్దాలుగా దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం కృషి చేస్తున్నాయని తెలిపారు. 2005లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి దుమ్ముగూడెం ప్రాజెక్టు మంజూరు చేసి 2005 డిసెంబర్ 31 అశ్వాపురం మండలం కుమ్మరి గూడెం దగర శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. 2014 వరకు కాంగ్రెస్ పూర్తి చేయలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి ముఖ్యమంత్రి కేసీఆర్ దుమ్ముగూడెం ప్రాజెక్టును అప్పటివరకు ఉన్న రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ పేర్లను మార్పు చేసారు. 2016లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ తిరిగి శంకుస్థాపన ఇల్లందు నియోజకవర్గం రోలపాడ్‌ను బ్యాలెన్స్ రిజర్వాయర్ గా మార్చి ఎక్కువ ప్రాంతాలకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామసాగర్ గా నామకరణ చేసి నేటికీ పూర్తి కాలేదని అన్నారు. మరొకవైపు కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు లేక నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండక ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు 2.5 లక్షల ఎకరాలు బీడుగా మారుతుందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సరైన నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అంతోటి అచ్చయ్య, సీపీఐ జిల్లా నాయకులు ఏపూరి లతాదేవి, సీపీఐ(ఎం) మండల మాజీ కార్యదర్శి బాదావత్ శ్రీనివాసరావు, న్యూడెమోక్రసీ నాయకులు కోళ్ళ అప్పారావు, మాస్ లైన్ నాయకులు రాకేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వజ్జా రామారావు, మండల కార్యదర్శి సకినాల శ్రీనివాసరావు, మాట్లాడారు. భూ నిర్వాసితుల సంఘం నాయకులు అంగోతు బాలాజీ, కొమ్మినేని భద్రయ్య, రామకృష్ణ, సుగుణమ్మ, గట్ల వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

బెట్టింగులకు పాల్పడితే ఇక హిస్టరీ సీట్ ఓపెన్ చేస్తాం

- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అధికారి రఘు
- క్రికెట్ బెట్టింగ్ కేసులో 4గురు అరెస్టు,
- పరారీలో మరికొందరు

నవతెలంగాణ- సత్తుపల్లి



పేకాట, క్రికెట్ బెట్టింగులు, ఇతర జూదాలకు పాల్పడే వారిపై ఇకపై హిస్టరీ సీట్ ఓపెన్ చేయడం జరుగుతుందని సత్తుపల్లి ఏసీపీ అనిశెట్టి రఘు జూదరులను హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏసీపీ రఘు పట్టణ సిఐ టి కిరణ్, టాస్క్ ఫోర్స్ సీఐ రామకృష్ణతో కలిసి ఏసీపీ రఘు విలేకరులతో మాట్లాడారు. శనివారం అర్ధరాత్రి 4 గంటల సమయంలో సత్తుపల్లి మండలం సత్యంపేట లోని కొబ్బరి తోటలో క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడుతున్న 10 మందిలో 4గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మిగతా ఆరుగురు పరారయ్యారు. క్రికెట్ బెట్టింగ్ ను నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన నేపథ్యంలో ఏసీపీ రఘు విలేకరులకు వివరాలను వెల్లడించారు తగిన సమాచారం మేరకు 13వ తేదీ అర్ధరాత్రి సుమారు 11:30 గంటల సమయంలో సత్యంపేట గ్రామంలోని కాకర్లపల్లి మాజీ సర్పంచ్ ఏగోటి పెద్దిరాజు కొబ్బరి తోటలో కొందరు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని అందిన సమాచారంతో పట్టణ సీఐ కిరణ్, టాస్క్ ఫోర్స్ సీఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకున్నారు. అక్కడ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఆకుల శేఖర్, ఆకుల వెంకటేశ్వరరావు తో పాటు మరో ఇద్దరు మైనర్ను అక్కడ సెల్ ఫోన్ లో క్రికెట్ చూస్తూ లాప్ టాప్ లో క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నారు. అక్కడున్న ఆకుల శేఖర్, ఆకుల వెంకటేశ్వరరావు, ఇద్దరు మైనర్లను విచారించగా ఏగోటి పెద్దిరాజు, శివ, అవినాష్, చిన్ని, శ్రీధర్, రాము సూర్య, రఫీ, మాస్టర్, డీపీ, సాయి ఘటనా స్థలం నుంచి పారిపోయారన్నారు. ఘటనా స్థలంలో ఓ ల్యాప్టాప్, 4 సెల్ ఫోన్లు, నగదు రూ.13,260, ఒక నోట్ బుక్, బ్యాంక్ అకౌంట్ కు సంబంధించి రూ.7,66,443 నగదును సీజ్ చేసినట్టు ఏసీపీ రఘు తెలిపారు. పరారైన పదిమందిలో కొందరిని అదుపులోకి తీసుకున్నామని మరికొందరి కోసం గాలిస్తున్నట్లు ఏసీపీ రఘు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి: 5గురు అరెస్ట్

సత్తుపల్లి మండలం యాతాలకుంట-రేగులపాడు గిరిజన గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో సాయంత్రం 6 గంటల సమయంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నగదు రూ.36వేలు, ఐదు మోటార్ సైకిళ్లు, 6 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలులో సాధారణ బోగీల పెంపునకు పోస్టుకార్డు ఉద్యమం

నవతెలంగాణ-కారేపల్లి



ప్రజలు ప్రయాణించి ప్రతి రైలులో సాధారణ బోగీలు సంఖ్య 5 తక్కువ కాకుండా ఏర్పాటుకు రైలులో సాధారణ బోగీల సాధన సమితీ ఆధ్వర్యంలో గాంధేయ మార్గంలో ఉద్యమం చేపట్టినట్లు సాధన సమితీ జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికపండ్ల అశోక్ తెలిపారు. సోమవారం కారేపల్లి మండలంలో కొత్త కమలాపురంలో ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రికి ఉత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పరికపండ్ల అశోక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి రోజు 30 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు అంచనా ఉందన్నారు. రైళ్లలో సాధారణ బోగీలు ఒకటి, రెండు పెట్టడం వలన సామాన్యులు తొక్కిసలాటలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైలులో సాధారణ రైలు బోగీలను కనీసం ఐదు పెంచాలని ది.ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీసర్, 152 సౌత్‌బ్లాక్ రెసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 అడ్రస్‌కు పోస్టుకార్డులను పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి మహబుబాబాద్ జిల్లా కన్వీనర్ బేతి వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు వడ్డే సీతారామయ్య, కొదుమూరి పుల్లయ్య వడ్డె వీరభద్రయ్య ప్రమీల, నాగయ్య, రాములు, లక్ష్మి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన రావినూతల ఉపాధ్యాయురాలు

నవతెలంగాణ- బోనకల్



అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో బోనకల్ మండల పరిధిలోని రావినూతల ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వి.ప్రమీల పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ రావినూతల ప్రధానోపాధ్యాయులు దామాల పుల్లయ్య మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా రక్తదానం చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, మండల అధ్యక్షుడు భూపతి ప్రేతం, మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, రావినూతల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

గౌసుపాషా కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికల పరంపర సాగుతూనే ఉంది. సోమవారం కారేపల్లి మండల బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె.గౌసుపాషా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌసుపాషాకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలన నియంతృత్వంగా సాగిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సామాన్యులు బాధితులుగా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు సంక్షేమ ఫలాలు కోసం 30 శాతం కమీషన్లు ఇవ్వాల్సిన దుస్థితిని గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో సాగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 6 గ్యారంటీలు అమలు చేసి చూపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజారంజక పాలవకు ప్రతి ఒక్కరూ ఆకర్షితులవు తున్నారన్నారు. ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ భారీ మెజార్టీ తీసుకరావటానికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పీసీసీ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల కారేపల్లి మండల అధ్యక్షులు తలారి చంద్ర ప్రకాష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్(టోనీ), గుగులోత్ భీముడు, బోడా సేట్‌రాం, దారావత్ వినోద్, నునావత్ సాయికిరణ్, నాగవేణి, భూక్యా బాలు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ కోట జయరాజుకి సన్మానం

నవతెలంగాణ- మధిర

మహాదేవపురం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గత నెల (మార్చి 31)న రిటైర్డ్ అయిన కోట జయరాజు దంపతులను సోమవారం పాఠశాల సిబ్బంది సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ మెండెం లలిత, ఎంఈఓ వై.ప్రభాకర్ ఇతర అతిధులు మాట్లాడుతూ 34సంవత్సరాలుగా జయరాజు నిబద్ధత, అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి .నాగురు వలి, ఎస్‌టిఎఫ్ జిల్లా బాధ్యులు వై.కోటారెడ్డి, ఫెన్షనర్ సంఘ బాధ్యులు తాళ్లూరి ఆంజనేయులు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఈ.వీరయ్య, ఇల్లూరు మాజీ సర్పంచ్ కోట రామారావు, గ్రామ పెద్దలు వాసిరెడ్డి నాగేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, జివ్వాజి రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో మోసం

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-ఖమ్మం

ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో విద్యార్థులు మోసం చేస్తున్న యాజమాన్యాలు, అడ్మిషన్ల ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశి,రాహుల్, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను రద్దు చేయాలి

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలోని బెల్ట్ షాపులను రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఖమ్మంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పిఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా గ్రామాలలో బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, వీటివలన తాగుడుకు బానిసై యువకులు తమ నిండు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వీటికి తోడుగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పానీయాలకు అలవాటు పడి అనేక కుటుంబాలు బజారున పడుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, జిల్లా ఉపాధ్యక్షురాలు టీ.ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి శోభ, నగర నాయకులు జక్కుల వనిత, బేగం తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతులు అందజేత

నవతెలంగాణ- ఖమ్మం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే ఫిబ్రవరి 26 నుండి 1 మార్చి వరకు చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్ తదితరాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పోస్టర్ తయారీ విభాగంలో ఖమ్మం జిల్లా ఖమ్మంరూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సపురా రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందారు. ఈ బహుమతికి సంబంధించి సర్టిఫికెట్‌ను కలెక్టర్ విపి.గౌతమ్ తన ఛాంబర్‌లో సపురాకి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, డిఇఓ సోమశేఖరశర్మ, ఆర్ఎంఓ రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

భద్రాచలం బస్టాండ్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

నవతెలంగాణ-ఖమ్మం

శ్రీ రామనవమి సందర్భంగా సుదూర ప్రాంతాల్లోని ప్రజలను, భక్తులను భద్రాద్రికి చేరవేసే విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల కోసం భద్రాచలం బస్టాండ్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎవి గిరిసింహారావు తెలిపారు. శ్రీరామనవమి, పట్టాభిషేకం (17,18తేదీల్లో) ఈ వైద్యశిబిరం కొనసాగుతుందని, మండు వేసవిని పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచామని వివరించారు. ఈ శిబిరాన్ని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఆర్టీసీ ఉద్యోగులే కాకుండా విధి నిర్వహణ నిమిత్తం ఇతర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుండి వచ్చే ఉద్యోగులు సైతం వినియోగించవచ్చని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్మికుల మన్ననలతో, శ్రీ రాముడి అనుగ్రహంతో 1994 నుండి 2024 వరకు 30 పర్యాయాలు నిరాటంకంగా భద్రాచలంలో కల్యాణం రోజు విధులు నిర్వహించడం జీవన సాఫల్య అవకాశంగా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-ముదిగొండ

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిలిచారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముదిగొండ బిసి హాస్టల్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బొడ్డు మహేష్, వినోద్, బోళ్ళ నాగరాజు, రాజు, రాజేష్, జి.మల్లేష్, విష్ణుసతీష్, గొల్లపల్లి వీరబాబు, ఉపేందర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి నిలయంలో అన్నదానం

నవతెలంగాణ - బోనకల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జన్మదిన వేడుకలు సందర్భంగా మండల కేంద్రంలోని శాంతి నిలయంలో గల మానసిక వికలాంగులకు చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన జై భీమ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యూత్ అధ్యక్షుడు రమేష్, శాంతి నిలయం నిర్వాహకురాలు సిస్టర్ అల్ఫీ, జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలోని కరుణగిరి వద్ద అల్లె సాయికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీపీబీఎల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ ఖమ్మంనగర అధ్యక్షుడు,పీసీసీ సభ్యుడు మహమ్మద్ జావిద్ సోమవారం ప్రారంభించారు.అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడారు.క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని గెలుపును, ఓటమిని క్రీడా స్ఫూర్తిగా తీసుకొని క్రీడలలో ముందుకు సాగాలన్నారు. యువత విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్జేపీఎస్ రాష్ట్ర ఇంచార్జి కిరణ్, ముగబసప్, 48వ డివిజన్ అధ్యక్షుడు బోజెడ్ల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, ఓబీసీ చైర్మన్ బానాల లక్ష్మణ్,జహీర్,ఆరీఫ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో ఇప్ప పువ్వుకు భలే గిరాకి

- పేదలకు ఉపాధి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



సీతారామ లక్ష్మణ స్వామివారు అరణ్యవాస సమయంలో దండకారణ్యంలో లభించే నేరేడు, మారేడుతో పాటు ఇప్ప పువ్వును ఆరగించేవారిని వీటిలో రాముడికి ప్రీతిపాత్రమైన పండ్లలో ఇప్పపువ్వు ప్రసాదం అధికంగా ఇష్టపడేవాడని పురాణాలు చెబుతున్నాయి. అదే ఆనవాయితీగా నేటికీ భద్రాచల రామయ్యకు ఇప్ప పువ్వు ప్రసాదన్ని నైవేద్యంగా అందజేస్తున్నారు. అటవీ ప్రాంతంలో గల ఇప్ప చెట్టు నుండి లభించే ఇప్పబద్ద, ఇప్పపువ్వుతో ప్రసాదాలు, లడ్డు తయారీతో పాటు , ఇప్పనూనె, తయారు చేస్తుంటారు. ఇప్ప నూనె, ఇప్పపూవుతో తయారుచేసిన వంటకాలు అరిగిస్తే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సైతం చెబుతున్నారు. అటవీ నుంచి సేకరించే ఇప్ప పువ్వుకు పర్ణశాలలో మంచి డిమాండ్ ఉంది. రామాలయ ఆవరణలో కొంతమంది నిరుపేదలకు ఉపాధి కలుగుతుంది. పర్ణశాల రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు రామయ్య ప్రసాదంగా ఇప్ప పువ్వులు కొనుగోలు చేసి వారి వారి ఇండ్లకు వెళ్లిన తర్వాత రామయ్య నైవేద్యంగా భావించి ప్రసాదంగా స్వీకరిస్తారు. అందుకే పర్ణశాలలో ఇప్ప పువ్వుకు ప్రత్యేకత ఉందని చెప్పవచ్చు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-ఇల్లందు



మండలంలోని సుదిమల్ల గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్డిఏ పీడీ, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ విద్య చందన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రతి కుటుంబం ఉపాధి హామీ చట్టంను ఉపయోగించుకోవాలన్నారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న వసతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఎంపీడీఓ ధన్ సింగ్ ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి అజహర్, టీఏ శ్రీను, ఎఫ్ఏ బక్కాయ పాల్గొన్నారు.



సమాధుల అక్రమ కూల్చివేతపై నిరసన

- ప్రభుత్వం న్యాయం చేయాలి
- కూల్చిన వారి చేతనే సమాధులు కట్టించాలి

నవతెలంగాణ-ఇల్లందు

మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో క్రైస్తవుల సమాధులు కూల్చిన ఘటనపై ఆ స్థలంలోనే సోమవారం క్రైస్తవ సంఘాలు న్యాయ దీక్ష నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్సీఎం, సీఎస్ఐ ఫాస్టర్ ఫెలోషిప్ సంబంధించిన బాధ్యులు ఆర్సియం చర్చి ఫాదర్ దుంపల బాలస్వామి, ఫాదర్ సుధాకర్ సిఎస్ఐ రెవరెండ్ ఫ్రాంక్లిన్ డికం సుధాకర్, యేసు రత్నం, చార్లెస్ విజయ్ కుమార్, ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు డేవిడ్ రాజ్, పాస్టర్ రత్న ప్రభు, బిషప్, కల్తీ యోహాన్, పాస్టర్ మానకొండ సంజీవరావు, పాస్టర్ జాకోబ్, సంఘ పెద్దలు మాట్లాడారు. క్రైస్తవ సమాధుల స్థలాన్ని కొద్ది రోజుల క్రితం సలీం అనే ఒక ముస్లిం వ్యక్తి అక్రమంగా ఎవరికి సమాచారం ఇవ్వకుండా 150 నుంచి 200 సమాధులను కూల్చారని అన్నారు. ఈ సమాధుల కూల్చడం కోసం సెలవు దినంలో రెవెన్యూ వాళ్లకు కానీ, పోలీస్ యంత్రాంగానే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జేసీబీతోనే కూల్చారని తెలిపారు. ఇలాంటి విధానాలకు పాల్పడటం అనేది దుర్మార్గమైన చర్య తక్షణమే వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జేసీబీ డ్రైవరు, ఓనర్ పైన కఠిన చర్యలు తీసుకోవాలని, సమాధుల స్థలాన్ని క్రైస్తవులకే కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు స్థానిక ఎమ్మెల్యే కృషిచేసి ఏవైతే కూల్చిన సమాధులను తక్షణం కూల్చిన వ్యక్తితో కట్టించే విధంగా చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఎంపీడీఓ రామకృష్ణ

నవతెలంగాణ-పినపాక

గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న పనులను, అభివృద్ధి పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ కూలీల ఆధార్ సీడింగ్‌ను 100శాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఇంటి పనులు వసూలు 100శాతం పూర్తి చేయాలన్నారు. నర్సరీలను సక్రమంగా నిర్వహించాలని ఆయన అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామం, మొక్కల పెంపకం, పారిశుధ్యం, తదితర పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించేలా ఉపాధి హామీ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ వీరభద్రస్వామి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం మాజీ గ్రంథాలయ చైర్మెన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నటువంటి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగాల శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కోరుకున్నటువంటి ప్రజాపాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని, ఎన్నికల ముందు చెప్పిన విధంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేసి తెలంగాణ ప్రజల మన్నులను పొందాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోరిక బలరాం నాయక్‌ని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాము, రామిరెడ్డి, ఉబ్బ వేణు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించి.. దేశాన్ని రక్షించండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-మణుగూరు



దేశంలో జరుగుతున్న 18వ సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, దేశాన్ని రక్షించాలని, ప్రజాస్వామికి లౌకిక శక్తులు గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రామిక భవనంలో సత్రపల్లి సాంబశివరావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కనకయ్య హాజరై మాట్లాడారు. జరగనున్న ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తుందన్నారు. దేశ సంపదను ఆదానీ, అంబానీలకు అప్పనంగా అప్పజెప్పెందుకే బీజేపీ ప్రభుత్వం ఈ 10 సంవత్సరాలలో పని చేసిందన్నారు. ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. 2023 సంవత్సరపు ఆకలి సూచికలో దేశం 11వ స్థానంలో ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు. ఇప్పటికే ఆహార సంక్షోభం ఏర్పడిందన్నారు. రాజ్యాంగ సంస్థల అన్నింటిని నిర్వీర్యం చేసిందన్నారు. దేశ ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టింది అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చలని కుట్ర చేస్తున్న బీజేపీని పార్లమెంట్లు ఎన్నికల్లో ఓడించాలన్నారు. రాజ్యాంగం స్థానంలో మన ధర్మాన్ని తీసుకొచ్చి ఫ్యూడల్ పద్ధతులు ప్రవేశ పెట్టడం కోసం బీజేపీ కృషి చేస్తుందన్నారు. దీని ద్వారా కుల, మత, ప్రాంత విద్వేషాలను సృష్టిస్తుందన్నారు. ఇప్పటికే సీఏఏ, పౌరసత్వ రద్దు, జ్యోతిష్య శాస్త్రం అమలు విద్యా కాషాయకరణతో పాటు ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను బెదిరించడం వారిని లొంగదీసుకోవడం జరుగుతుందన్నారు. మేధావులను జైలులో పెట్టడం ఇలాంటి వాటిని బలవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. పోరాటాల అడ్డ భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరవేయాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల మండల కార్యదర్శి కొడిశాల రాములు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, ఉప్పతల నరసింహారావు, ములకల ఉత్తమ్, బొల్లం రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో సీతా రామరాజు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి సేవలో భద్రాచల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు మెడిలైఫ్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ బి.వి.సీతారామరాజు తరిస్తున్నారు. సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలకు భద్రాచలానికి వచ్చే రామ భక్తులకు నిర్వహించే అన్నదానానికి డాక్టర్ బి.వి.సీతారామరాజు రూ.50 వేల విరాళాన్ని అందించి మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గతంలో అనేక రకాలుగా సేవా కార్యక్రమాలలో భాగస్వామి అయిన సీతారామరాజు భద్రాచలం పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు తన సహకారాలను అందించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక రకాల స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించే డాక్టర్ సీతారామరాజు ఆధ్యాత్మిక సేవలో కూడా తనదైన ముద్రవేశారని చెప్పాలి.

దుమ్ముగూడెం వాసికి అరుదైన గౌరవం

- ఉస్మానియా యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన వేముల కామేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయు) క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ చరిత్ర విభాగంనుంచి కామేశ్వర రావుకు పీహెచ్‌డీ (డాక్టరేట్) డిగ్రీ లభించింది. ప్రొఫెసర్ కె.అర్జున్ రావు పర్యవేక్షణలో వడ్డెర్ల సాంఘిక ఆర్థిక పరివర్తనం అనే అంశంపై పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వేముల కామేశ్వరరావు ప్రస్తుతం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కామేశ్వర రావుకు డాక్టరేట్ గౌరవం దక్కడం పట్ల భద్రాచలం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.జాన్ మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, అధ్యాపక బృందం విద్యార్థులు అభినందనలు తెలిపారు. అభినందన సభలో కామేశ్వరరావు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు వేముల సుబ్బమ్మ, వేముల సాంబయ్య దీవెనలు, అన్నదమ్ముల ప్రోత్సాహం, కుటుంబ సభ్యులు, తన భార్య వేముల పద్మావతి అందించిన సహకారంతో ఈ డాక్టరేట్ సాధించినట్టు తెలిపారు. తన మాతృమూర్తి వేముల సుబ్బమ్మ తెలిపిన అంశాల ఆధారంగా, సూపర్ వైజర్ సూచించిన దృక్కోణంలో తన పరిశోదన చేసినట్టు తెలియజేసారు. సుదీర్ఘ కాలం జరిగిన పరిశోధన వడ్డెర కుల సమాజానికి ఉపయోగపడాలని తన ఆకాంక్ష వెలిబుచ్చారు.

పర్ణశాలలో నవమి ఏర్పాట్లపై గుస్సా...

- ఆలయానికి రంగులు వేయకపోవడంపై సర్వత్రా విమర్శలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి రామాలయం దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం. పర్ణశాల రామాలయంలో భద్రాచలం తరహాలోనే ధూప దీప నైవేద్యాలు, నిత్య పూజలు ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు, నెల నెల ఆలయంలో నిర్వహించే పునర్వసు కల్యాణం, శ్రీరామనవమి తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం వంటి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. కాగా పర్ణశాల రామాలయానికి గత ఏడాది డిసెంబర్ నెలలో జరిగిన వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల సందర్భంగా రంగులు వేయాల్సి ఉంది. కానీ శ్రీరామనవమికి అయినా రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దాల్సిన ఆలయం ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పై ఆలయానికి వచ్చే భక్తులతో పాటు, గ్రామస్తుల సైతం పర్ణశాల రామాలయం పట్ల ఒకింత చిన్నచూపు చూస్తున్నారు. భద్రాచలం రామాలయ ఆలయ ఈఓ రమాదేవి పర్ణశాల రామాలయంలో శ్రీరామనవమి ఏర్పాట్ల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆలయానికి రంగులు వేయాలని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకు వెళ్లినట్టు సమాచారం. దీంతోపాటు సీతా కుటీరం పక్కనే ఆనాడు సినీ ఆర్కిటెక్‌లు బాపు రమణల సూచనతో బ్యాంబుస్‌తో తయారుచేసిన కుటీరం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలు సైతం కిందపడి ఉండటంపై భక్తుల సైతం మండిపడుతున్నారు. వేసవి ఎండలలో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇటీవల ఆలయ ఈవో రమాదేవి లాంఛనంగా ప్రారంభించిన మజ్జిగ అందజేసే కార్యక్రమంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజు రెండు వేల మంది భక్తులు ఆలయానికి వస్తున్నారని 15 లీటర్ల మజ్జిగ ఎలా సరిపోతుందని ఆలయానికి వచ్చే భక్తులు మండిపడుతున్నారు. ఏది ఏమైనా ఎంతో చరిత్ర కలిగిన పర్ణశాల రామాలయం పట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాం

- వలస ఆదివాసీ గ్రామం సందర్శనలో ఎంపీఓ

నవతెలంగాణ-పినపాక



ఎండలు ఈ వేసవిలో ఎక్కువగా ఉన్నందున తాగునీటి సరఫరాకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలియజేశారు. సోమవారం ఆయన మండలంలోని కిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల వలస ఆదివాసీ గ్రామం పిట్టతోగు గ్రామాన్ని సందర్శించారు. అక్కడ వలస ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు నవతెలంగాణ పినపాక ప్రతినిధి ద్వారా తెలుసుకున్న ఆయన నవతెలంగాణ రిపోర్టర్ శ్రీరామ్ బృహస్పతి, గిరిజన సంఘం నాయకులు ముడివి రమేష్‌తో కలిసి గ్రామంలో సమస్యలను పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్లకు పైగా మండుటెండలో నడుస్తూ వెళ్లి గ్రామాన్ని చేరుకున్న ఆయన అక్కడ తాగు నీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించారు. సుమారు రెండు కిలోమీటర్లు నడిచి ఒక చెలిమ ద్వారా నీటిని తెచ్చుకుంటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ నీరు సురక్షితమా కాదా వెంటనే పరీక్షకు పంపాలని సెక్రటరీని ఆదేశించారు. అనంతరం ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పాత బోరును పరిశీలించారు. సోలార్ బోర్డులు సైతం పగిలిపోయి ఉండడంతో కొత్త వాటిని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. అనంతరం అక్కడ వారు స్వయంగా ఏర్పాటు చేసుకున్న చిన్నారుల అంగన్వాడీని పరిశీలించారు. తోలెం శ్రీను అనే సామాజిక కార్యకర్త ఉచితంగా వారికి విద్య అందిస్తున్నారని తెలుసుకొని ఆయనను అభినందించారు. రెండు రోజుల్లో వారికి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. జిల్లా కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలియజేశారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తమ గ్రామ సమస్యలను కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం దుగినేపల్లి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ విధులను సక్రమంగా నిర్వహించాలని స్థానిక సెక్రట రీలను పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అక్కడ నుండి సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ చేరుకొని అక్కడ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక సెక్రటరీలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ఆదినారాయణ, అనూష, స్థానిక ఆదివాసీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



శిఖర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో జారే


నవతెలంగాణ-దమ్మపేట

మండల కేంద్రం దమ్మపేటలో గల శ్రీ గాయత్రీ ఆశ్రమంలో శ్రీ అరుణాచలేశ్వర్ మహదేవ్ మందిర్‌లో సోమవారం నూతన శిఖర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్‌సుస్థిర మూర్తీజి ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి ఆశ్రమం విశిష్టతలను తెలియజేశారు. అనంతరం ఆయనకు జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమం అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని ఆశ్రమ బాధ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భ్రష్టు బట్టిన ఆయిల్ ఫెడ్ నర్సరీని సంస్కరించండి

- జిల్లా ఉద్యాన అధికారికి ఆయిల్ ఫాం గ్రోవర్స్ సొసైటీ వినతి

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు సంస్థ అధికారులు అలసత్వం, స్థానిక ఉద్యాన అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్‌ల నిర్వహణ లోపంతో భ్రష్టు బట్టి పోతున్నాయని, వీటిని సంస్కరించి ఆయిల్ ఫాం సాగు దారులకు మేలు చేసే విధంగా, ఆయిల్ ఫెడ్, ప్రభుత్వం ఖజానాకు నష్టం జరక్కుండా చర్యలు చేపట్టాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల జిల్లా అధికారి సూర్యనారాయణకు మంగళవారం తన కార్యాలయంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ ఫాం గోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వర రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యలు వినతి పత్రం అందజేసారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేగంగా విస్తరిస్తున్న ఆయిల్ ఫామ్ సాగులో అత్యంత కీలకమైన నర్సరీ విభాగం పూర్తిగా భ్రష్టు బట్టి పోయిందన్నారు. నాణ్యతలేని విత్తన దిగుమతులు, అవగాహన, అర్హతలేని అధికారులు మొక్కల పెంపకంలో ఎటువంటి అనుభవం లేని కాంట్రాక్టర్లు, బాధ్యతలు మరచిన పై అధికారుల పరిశీలనలు, క్వారెంటైన్ సర్టిఫికెట్ల జారీ, స్థల సామర్థ్యానికి మించి మొక్కల పెంపకం, కొంతమంది అధికారుల చేతివాటం, రైతులలో కొరవడిన అవగాహన, ఆయిల్ పామ్ గెలలు రేటు పెరిగిన దశలో చూపిన ఆసక్తి, తగ్గిన దశలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపకపోవడం అనేక సంక్లిష్ట అంశాలతో పాటు ఆయిల్ ఫెడ్ లో కొంతమంది అధికారుల అత్యుత్సాహం, అవినీతి కారణంగా ఈ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. అందులో ప్రధాన భూమిక పోషించాల్సిన 'ఉద్యాన శాఖ' అధికారులు నిర్లిప్తంగా ఉండిపోయారన్నారు. అదేవిధంగా జిల్లాలో అనేకమంది రైతులు బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసి, మంజూరు కోసం ఎదురుచూస్తున్నారని, అట్టి వారికి తక్షణమే తగు మంజూరు ఇప్పించగలరని కోరారు. ఆయిల్ పామ్ సాగుచేసిన రైతులకు నాలుగు సంవత్సరాల (2020-2021, 2022-2023) ప్రోత్సాహక సబ్సిడీ అందరికీ అందలేదన్నారు. వారందరికీ సబ్సిడీ బకాయిలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ జిల్లాలో గత నాలుగు సంవత్సరములుగా పంపిణీ చేసిన మొక్కలలో 30% పైగా మొక్కలు ప్రక్క రాష్ట్రాలకు తరలి వెళ్లినట్లుగా ఆరోపణలు వున్నాయని, పంపిణీ చేసిన విస్తీర్ణంకు వాస్తవంగా సాగు చేసిన విస్తీర్ణంకు మధ్య చాలా వ్యత్యాసము వున్నట్లు ఆరోపణలు వున్నాయన్నారు. వీటి పై సమగ్ర విచారణ చేసి, ప్రభుత్వ/ఆయిల్ ఫెడ్ నిధులు దుర్వినియోగం కాకుండా అర్హులైన రైతులకు మాత్రమే మొక్కలు, సబ్సిడీలు అందే విధంగా చర్యలు తీసుకో గలరని కోరారు.



అంగన్వాడీ సిబ్బందికి గ్రాట్యుటీ చెల్లించాలి

- సీఐటీయూ నాయకులు అర్జున్

నవతెలంగాణ-అశ్వారావుపేట

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లలకు గ్రాట్యుటీ చట్టం పగడ్బందీగా అమలు చేయాలని, పెన్షన్ రూ.6 వేలు ఇవ్వాలని, అతి తక్కువ గ్రాట్యుటీ చెల్లించే జీవో రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఐసీడీఎస్ సీడీపీఓ రోజా రాణికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 10 ప్రకారం 65 సంవత్సరాలు నిండిన టీచర్లకు రూ.1 లక్ష, హెల్పర్లకు రూ.50 వేలు చెల్లిస్తామని జీవోని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయటం దురదృష్టకరమని అన్నారు. గత సంవత్సరం అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని 24 రోజులు పాటు నిరవధిక సమ్మె సందర్భంగా నాటి మంత్రులు టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, 60 సంవత్సరాల దాటిన వారికి వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని కొత్త జీవో ఇస్తామని మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ వేణి, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్లకు గ్రాడ్యూటీ చట్టం పగడ్బందీగా అమలు చేయాలని, పెన్షన్ రూ.6వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీఓ జ్యోతికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్ మాడారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, జ్యోతి, సుజాత, జయ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ కమిషనర్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



సీతారామ చంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భద్రాచలానికి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు జరుగనున్న మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రపంచంలో అత్యంత వైభవోపేతంగా ఎక్కడా లేని విధంగా సీతారాముల వారి కల్యాణం జరిగేటువంటి పవిత్ర స్థలం మన భద్రాచలం పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ క్షేత్రంలో కొన్ని దశాబ్దాల తరబడి సీతారాముల వారి కల్యాణం ఆనవాయితీగా జరుగుతున్నదని తెలిపారు. కల్యాణ మహోత్సవాన్ని ప్రత్యేకంగా కానీ, పరోక్షంగా వీక్షించిన భక్తులకు ఎంతో పుణ్యం వస్తుందని వేదాల్లో చెప్పడం జరిగిందని అన్నారు.

పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మంచినీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కల్యాణ వేడుకలు వీక్షించేందుకు మొత్తం 24 సెక్టార్లు ఏర్పాటుతో పాటు ప్రతి సెక్టార్‌లో ఎల్ ఈడీ టీవీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కల్యాణ వేడుకలకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం https:// bhadradritemple. telangana.gov.inలో అందుబాటులో ఉన్నాయని భక్తులు టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ప్రతిక్ జైన్, దేవస్థానం ఈఓ రమాదేవి, ఏఈఓలు రవీందర్, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫెడ్ ఎండీగా కే.అశోక్ రెడ్డి

- నేడు అశ్వారావుపేటలో పర్యటన
- ఏర్పాట్లలో నిమగ్నమైన స్థానిక అధికారులు



నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక పరిపాలనా పరం అయిన సర్దుబాట్లలో భాగంగా ఉద్యాన, పట్టు పరిశ్రమలు శాఖ సంచాలకులు అయిన ఐఏఎస్ అధికారి కే.అశోక్ రెడ్డిని ఆయిల్ ఫెడ్ ఎండీగా ప్రభుత్వం నియమించింది. అశోక్ రెడ్డి ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో అనేక ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితనం కనబరిచారు. ఈ క్రమంలో ఆయన మొదటి సారిగా మంగళవారం నియోజక వర్గంలోని దమ్మపేట మండలం, అప్పారావు పేట, అశ్వారావుపేట మండలంలో గల ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫాం ఆయిల్ నూనె తయారీ పరిశ్రమలను, ఫాం ఆయిల్ కేంద్రీయ నర్సరీలను ఆయన సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో సంస్థ డివిజనల్ మేనేజర్ బాలక్రిష్ణ, పరిశ్రమల మేనేజర్‌లు కళ్యాణ్ గౌడ్, నాగబాబులు ఆయన రాక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయన వెంట జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, పీఅండ్‌పీ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొననున్నారు.

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు తప్పనిసరి

- డాక్టర్ దుర్గాభవాని



నవతెలంగాణ-పినపాక

జీరో నుండి 40 సంవత్సరాలలోపు వారందరూ సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గాభవాని సూచించారు. డీఎంహెచ్ఓ శిరీష ఆదేశాలతో 23 గ్రామ పంచాయతీల పరిధిలో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం మండలంలోని పోతురెడ్డి పల్లి, సీతారాంపురం గ్రామాలలో సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య పరీక్షలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మధులత, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఎంలతో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీఓలతో సోమవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఈఈ సురేష్ కుమార్, ఎంపీడీఓ రవీంద్రనాద్ రెడ్డి, ఎంఈఓ శ్రీలక్ష్మిలు పలు అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా పాఠశాలల్లో జరుగుతున్న పనుల గురించి కాంప్లెక్స్‌ల వారీగా వివరించారు. మొత్తం 50 పాఠశాలల్లో 36 పాఠశాలల్లో ఎలక్షన్ రిపేర్స్, 18 పాఠశాలల్లో మేజర్, మైనర్ రిపేర్‌లు జరుగుతున్నాయని అన్నారు. 86 బాలుర, బాలికల వసతి గృహాల్లో టాయిలెట్స్ మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు జరుగుతుండగా 6 పాఠశాలల్లో మరో మూడు రోజుల్లో పనులు ప్రారంభించవలసిందిగా నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీఓలు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం చేసిన పనికి మాత్రమే డబ్బులు

నవతెలంగాణ-చంద్రుగొండ

కొలతల ప్రకారం చేసిన పనికి మాత్రమే డబ్బులు వస్తాయని టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో రోజురోజుకి ఎక్కువ సంఖ్యలో ఉపాధి హామీ పనికి హాజరవుతున్నారు. ఎంపీడీవో అశోక్ ప్రతిరోజు ప్రతి ఒక్కో గ్రామాన్ని సందర్శించి కూలీలకి ఏ విధంగా పనిచేయాలో ఏ విధంగా పనిచేస్తే ఎంత డబ్బులు వస్తాయో పూర్తిగా వివరించి చెప్తున్నారు. సోమవారం టీఏ కొలతలు తీసుకొని ఉపాధి హామీ కూలీలకు కొలతల ప్రకారమే డబ్బులు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, పంచాయతీ సెక్రటరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్‌లకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు

వాహనం డ్రైవర్లకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని టీబీజీకేస్ నాయకులు వెంకట్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి కార్మిక భద్రత, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న యాజమాన్యం అదే తరహాలో సంస్థ పురోభివృద్ధికి పరోక్షంగా సహాయ సహకారాలు అందించే ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా యాజమాన్యం అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమైన అంశమని అన్నారు. గని నందు ఔట్ సోర్సింగ్ పేరిట అంబులెన్స్, ఐచర్, క్యాంపర్ వాహనాలు నడుస్తున్నాని, ఆ వాహనాల పై మూడు షిఫ్ట్‌లలో ఏడుగురు డ్రైవర్‌లు పని చేస్తున్నట్టు తెలిపారు. వారి కష్టం, సాధక బాధకాలు ఎప్పటికప్పుడు పరిష్కరించే గని అధికారులు వారి వాహనాలు నిలుపుకోవడానికి ప్రత్యేక షేడ్ నిర్మాణం చేయకపోవడం డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు.

పాము కాటుకు గురై మహిళ మృతి



నవతెలంగాణ-దమ్మపేట

పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మరణించిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నారం సుబ్బారావు భార్య నారం జమున (48) పొలం పనులకు వెళ్ళిన సమయంలో ఆదివారం పాము కాటుకు గురైంది. గమనించిన తోటి కూలీలు ఆమెను వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. సోమవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

అక్రమ ఇసుక వాహనం సీజ్

నవతెలంగాణ-అశ్వారావుపేట

అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్‌హెచ్ఓ ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారాయణపురం సమీపంలోని పెద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సోమవారం అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వినాయకపురం చెందిన బండారు మారేశ్వరరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

పర్ణశాలలో ఘనంగా ధ్వజారోహణం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధం ఆలయమైన పర్ణశాల రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని మధనం, మూర్తి కుంభ ఆవాహన, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, మహా నివేదన, తీర్థప్రసాద గోష్టి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు విశ్వక్సేన పూజ అనంతరం చేతు స్థానార్చన, బేరి పూజ, దేవత ఆవాహన, అష్టదిక్పాలక బలి, ప్రసాదం నివేదన, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక అధికారి అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, సీతారామనుజా చార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజ ఆచారి, ఎం.నరసింహచార్యులతో పాటు ఆలయ సిబ్బంది రాము, శివ భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు...

ఊపిరి ఆడనివ్వని వాయు కాలుష్యం

- పెరుగుతున్న కార్బన్ మోనాక్సైడ్ విషవాయువు
- కాలుష్య విషం చిమ్ముతున్న సింగరేణి, బీటీపీఎస్



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు పరిసర ప్రాంతాలలో ఎండలు మండుతున్నాయి. ప్రజల గొంతు ఎండుతుంది. సింగరేణిలో విపరీతమైన దుమ్ము, వాయు కాలుష్యం ప్రజలు, కార్మికులు కాంట్రాక్ట్ కార్మికుల ఊపిరి ఆడడం లేదు. సింగరేణి కార్మికులకు తాగేందుకు చల్లని మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. చలువ పందిళ్ళ జాడలేదు. సింగరేణిలో, ప్రయివేటు కంపెనీలలో వందల సంఖ్యలో భారీ డంపర్లు పనిచేస్తున్నాయి. రోజుకు ఒక్కొక్క డంపర్ 18 గంటలు పని పనిచేస్తుంది. వందల లీటర్ల ఆయిల్ వినియోగించబడుతుంది. దీని కారణంగా కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా రిలీజ్ చేయబడుతున్నది. ఇది చాలా విషపూరితమైనది. గాలిలోనే ఉంటుంది. వర్షం కారణంగా భూమిలో కూడా చేరుతుంది. పంటలు కూడా విషపూరితంగా మారుతున్నాయి. దీని నివారించడం సాధ్యం కాదు. ఈ విషవాయు వలన అనేక రకాల ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెపుతున్నాయి. క్యాన్సర్, బ్రెయిన్ సంబంధించిన అంత చిక్కని వ్యాధులతో ఇటీవల కాలంలో పదుల సంఖ్యలోనే మాజీ సింగరేణి ఉద్యోగులు, ప్రజలు మరణానికి గురయ్యారు. సింగరేణి ఉపరితల గనుల బొగ్గుచూర, బీటీపీఎస్‌లో కార్బన్ ఆక్సైడ్ అనగా బొగ్గును మండించి కార్బన్ మోనాక్సైడ్‌ని గాల్లో విడుదల చేస్తున్నారు. నివారణ చేపట్టకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు అంత చిక్కని వ్యాధులతో మరణిస్తున్నారు. బూడిద వలన మణుగూరులో మండలంలో గాలి విపరీతంగా కాలుష్యమైంది. వాతావరణంలో కాలుష్యం విస్తృతంగా ఆవరించింది. విపరీతమైన కాలుష్యం వలన వృద్ధులు, పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగింది. తీవ్ర కాలుష్యం కారణంగా కళ్ళు మండుతున్నాయి. విపరీతంగా పొగ కారణంగా ప్రజలకు ఊపిరావడం లేదు. మణుగూరు ఉపరితల గనుల నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ రోజుకు 16,000 టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నారు. రహదారులు వెంబడి విపరీతమైన బొగ్గుచూర దుమ్ము గాలిలో కలుస్తుంది. ప్రధాన రహదారి ఇరువైపుల ఉన్న పచ్చని చెట్లు నల్లగా మారిపోయాయి. పచ్చదనం లేక ప్రకృతి విలవిల ఆడుతున్నాయి. వరి, మిర్చి, ఇతర పంటలపై ప్రభావం విపరీతంగా చూపడంతో వింత వ్యాధులతో పంటచేలు ఉన్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10:00 వరకు విపరీతమైన దుమ్ము, దుగ్గుచూర గాలిలో కలవడంతో గాలి ఆడకా ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దట్టంగా గాలిలో ఉన్న కాలుష్యం కారణంగా ఎదుటిగా వచ్చే వాహనం కూడా కనిపించడం లేదు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గాంధీనగర్, కాళీమాత ఏరియా, భగత్ సింగ్ నగర్, శేషగిరి నగర్, రాజుపేట, బాపన కుంట తదితర ప్రాంతాలలో ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ ప్రభావిత గ్రామాలైన చినరావి గూడెం, సీతారాంపురం, దమ్మక్కపేట, సాంబాయిగూడెం గ్రామాలలో విపరీతమైన బూడిద గ్రామాలలో ఆవరిస్తుంది. పెరట్లో పెంచుకునే మొక్కల నుండి వాకిళ్ళలో విపరీతమైన బూడిద వర్షం కురుస్తుంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. సింగరేణి ఉపరితల గనులు భద్రాద్రి పవర్ ప్లాంట్ కారణంగా మణుగూరు మున్సిపాలిటీ, మండలంలోని ప్రజలు తీవ్ర కాలుష్య ప్రభావానికి గురవుతున్నారు. ఓబి బొగ్గు బ్లాస్టింగ్ సందర్భంగా సరైన నిబంధనలు పాటించకపోవడంతో విపరీతమైన దుమ్ము బొగ్గు చూర వాతావరణలో కలుస్తుంది. ఓసి టు లో కోల్ క్రషర్ మిషన్‌లో వాటర్ ఉపయోగించని కారణంగా విపరీతమైన బొగ్గుచూర గాలలో కలుస్తుంది. దీని కారణంగా పగిడేరు పంచాయతీలోని శాంతినగర్, గొల్ల కొత్తూరు, గ్రామాలలో గాలి కాలుష్యమై అనారోగ్య పాలవుతున్నారు. ఆక్సిజన్ తగ్గి కార్బన్డయాక్సైడ్ అధికం అవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు ఆరోపిస్తున్నారు. ఇలానే కొనసాగితే మణుగూరు ఏరియాలో తీవ్ర గాలి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని వెంటనే భద్రాద్రి పవర్ ప్లాంట్ యాజమాన్యం, సింగరేణి యాజమాన్యం కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిచో ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రజలు, ప్రజా సంఘాలు పేర్కొన్నారు.



బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కార్మిక నేత

సింగరేణిలో ఆయు ప్రమాణం తగ్గుతుంది



ఉపరితల గనులలో పనిచేసే కార్మికులకు ఆయు ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. ఉద్యోగ విరమణ అనంతరం క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ ఉండే జబ్బులు మరి ఇతర శ్వాసకోశ వ్యాధులతో మరణిస్తున్నారు. గాలిలో విడుదలైన కార్బన్ మోనాక్సైడ్ నియంత్రించడంలో సింగరేణి భద్రాద్రి థర్మ ప్లాంట్ విఫలమైనాయి. బీటీపీఎస్ అధికారులు 300 కోట్లతో పర్యావరణాన్ని రక్షిస్తామని హామీ ఇచ్చి మరిచారు.

-మాజీ సింగరేణి ఉద్యోగి నెల్లూరి నాగేశ్వరరావు



సరిహద్దులో ఉమ్మడి ఎక్సైజ్ దాడులు

నవతెలంగాణ-అశ్వారావుపేట

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్ర ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా సోమవారం సరిహద్దు గ్రామాల్లో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం అంకం పాలెంలో 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ముందుగా అంతరాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ అధికారుల సహకారంతో తెలంగాణలోకి అక్రమ మద్యం, నాటు సారా, గంజాయి లాంటి మత్తు పదార్థాల సరఫరా నియంత్రణకు కార్యచరణ చేపట్టినట్టు వివరించారు. ఇందుకు గాను ప్రత్యేక యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని, సరిహద్దు చెక్ పోస్ట్‌లను బలోపేతం చేస్తూ నిఘాను పటిష్టం చేసినట్లు తెలిపారు. ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో నిత్యం ఉమ్మడి ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహిస్తూ ఎక్సైజ్ నేరాల నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం ఎస్ఈటీ సీఐలు సాంబమూర్తి, పట్టాభి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-పినపాక

కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన మండలంలోని బయ్యారం ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారుజామున అతివేగంతో వచ్చిన కారు కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడింది. వెంటనే గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన లైన్ ఇన్స్పెక్టర్ అశోక్ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదం జరిగిన తీరు పైన విచారణ చేపట్టారు. కారును ఆ ప్రదేశం నుంచి తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

నామను మంచి మెజార్టీతో గెలిపించుకోవాలి

- అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాలి
- ఎంపీ అభ్యర్థి నామ, ఎమ్మెల్సీ తాతా మధు, వద్దిరాజు రవిచంద్ర





నవతెలంగాణ-పాల్వంచ

ఒకసారి మోసపోయాం..ఈ ఎన్నికల్లో అలా జరగకుండా జాగ్రత్త పడి, బీఆర్ఎస్ ఎంపీలను మంచి మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం పార్ల మెంటరీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. పాల్వంచలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాలులో పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో నామ మాట్లాడారు. ఎక్కడివారక్కడ బూత్ స్థాయిలో పనిచేసి తన గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి, ఓటర్లను కలిసి కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరించి, చైతన్య పరిచి, తన గెలుపునకు పని చేయాలన్నారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలన్నా, తెలంగాణ వాణి పార్లమెంట్లో వినిపించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఎంపీలు గెలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు పార్లమెంట్‌లో అడుగుపెట్టి తెలంగాణ విభజన హక్కుల కోసం, ప్రాజెక్టులు, నిధులు, ప్రజా సమస్యలపైన గళం వినిపించి, అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. భద్రాచలం-కొవ్వూరు రైలు రైల్వేలైన్ కోసం 120 లేఖలు రాశానని, వందలసార్లు మంత్రులు, ఉన్నతాధికారులు చుట్టూ తిరిగి సాధించడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లాలో 8 వేల కోట్ల రూపాయల విలువైన జాతీయ రహదారులను తీసుకురావడం జరిగిందని తెలిపారు. కేసీఆర్ ఆశీర్వదించి మీ వద్దకు పంపారని, రెట్టింపు ఉత్సాహంతో కష్టపడి పనిచేసి గెలిపించాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పాలని తెలిపారు. పాల్వంచతో అనుబంధం ఉన్న తనకు ఈ ఎన్నికల్లో ఈసారి పాల్వంచ టౌన్, మండలం నుంచి భారీ మెజార్టీ రావాలని కోరారు. తనను గెలిపిస్తే కార్యకర్తలకు అండగా ఉండి, తలెత్తుకొని ఉండేలా చేస్తానని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏది ఏమైనా అందరం కష్టపడి నామ నాగేశ్వరరావుని మంచి మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఈసారి నామను రెండు లక్షల మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. అలవికాని హామీలతో కాంగ్రెసు మోసం చేసిందని, ప్రజలు నాలుక కరుచుకుని, దిక్కు లేక విలవిలలాడుతున్నారని, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కెసిఆర్ సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఎందరు ఉన్నా అందర్నీ పక్కనపెట్టి తనకు బీసీ బిడ్డగా మళ్లీ రెండోసారి రాజ్యసభకు పంపించారని చెప్పారు. నామను మళ్లీ గెలిపించి పార్లమెంటుకు పంపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధు మాట్లాడుతూ రాష్ట్రంలోని తొమ్మిది ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ గెలవబోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయని, మరో నాలుగు స్థానాల్లో ఢీ అంటే ఢీగా పోటీ పడుతున్నామని చెప్పారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని కెసిఆర్ సాధించి, దేశంలో నెంబర్వన్ రాష్ట్రంగా చేశారని, నాలుగు నెలల్లో సంక్షేమ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని చెప్పారు. ఈ సమావేశంలో తాళ్లూరి జీవన్, బరపటి వాసుదేవరావు, కిలారు నాగేశ్వరరావు, నాయుడు, సరస్వతి, గురవయ్య, రవి, మంజుల, శంకర్, వీరయ్య, శోభారాణి, నేజీ, విశ్వనాథం, శ్రీరామ్మూర్తి, కనకేశ్, ఆచార్యులు, ఖమ్మం జిల్లా మైనార్టీ నాయకులు ఖమర్, చిత్తారు సింహాద్రి యాదవ్, సరిపూడి గోపి, ఎంపీటీసీలు, పట్టణ నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేసింది కేసీఆర్ : నామా

చంద్రుగొండ : రైతును రాజును చేసింది కేసీఆర్ అని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అయిన పాలెం లక్ష్మ గార్డెన్లో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నామ, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రన్ పాల్గొన్నారు. నామా నాగేశ్వరావు మాట్లాడుతూ నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించి మళ్లీ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసన మండల సభ్యులు తాత మధు, మాజీ ఎమ్మెల్యే మచ్చ నాగేశ్వరరావు, చంద్రుగొండ మండల అధ్యక్షులు ధారా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

విస్తృతంగా పారిశుధ్య పనులు

- భక్తుల కోసం ప్రత్యేక తాగు నీటి వసతి, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధాలయమైన పర్ణశాలలో శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17వ తేదీన జరిగే శ్రీ సీతారామ కల్యాణాన్ని పురస్కరించుకొని పర్ణశాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ప్రత్యేక పారిశుధ్య పనులను చేపడుతున్నారు. రామాలయ ఆవరణతో పాటు రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తా, చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పనులు చేపడుతున్నారు. దీంతోపాటు గోదావరి ప్రాంతంలోని సీతారామ గాట్లను శుభ్రం చేయడంతో పాటు వండ్రు మట్టిని తొలగించారు. ఆలయ పరిసరాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

జీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు : పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు

శ్రీరామనవమి సందర్భంగా పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కలెక్టర్, జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారుల ఆదేశాల మీదకు పర్ణశాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు పర్ణశాల జీపీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు నవతెలంగాణకు తెలిపారు. సోమవారం 25 మంది పారిశుధ్య కార్మికులతో రహదారికి ఇరువైపులా బ్లీచింగ్ చెల్లించడంతోపాటు చెత్తాచెదారాన్ని తొలగించినట్టు తెలిపారు. మరో మూడు రోజులపాటు సుమారు 75 మంది పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులకు ఎండ తాకిడి లేకుండా అవసరం ఉన్నచోట టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఐదు ప్రదేశాలలో మంచినీటి డ్రమ్ముల ద్వారా తాగునీటి వసతి ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. భక్తుల కోసం రెండు చోట్ల 15 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం.



బర్మా బజార్‌ను ప్రారంభించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నూతన డిజె బర్మా బజార్ ఫ్యాన్సీ షాప్‌ను సోమవారం జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. పైడి అభిమాని అయిన శీమకుర్తి దుర్గాప్రసాద్-జ్యోతిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన దుకాణాన్ని పైడి ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. దుకాణంలో గల ప్రతీ వస్తువును పరిశీలించి ప్రజలకు ఉపయోగ పడేలా ఉన్నాయని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, భద్రం, రెడ్డిమల్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన

పినపాక పామాయిల్ సాగుపై రైతులకు మండలంలోని ఈ బయ్యారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఏడీఈ తాతారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ రైతులు పామాయిల్ సాగు చేయాలని, పామాయిల్‌లో అంతర పంటలు సైతం సాగు చేయడం ద్వారా రైతులకు లాభాలు వస్తాయని తెలియజేశారు. సాగుపై లాభనష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణాధికారి కొమరం లక్ష్మణరావు, ఏఈవో రమేష్, రైతులు గీద కొండారెడ్డి, గంద్రతి సమ్మయ్య, వెంకటేశ్వర రెడ్డి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూలో సోలార్ ప్లాంట్ కార్మికులు చేరిక

నవతెలంగాణ-ఇల్లందు

సీఐటీయూ చేసే కార్మికోద్యమాలు, పోరాటాలకు ఆకర్షితులైన మున్సిపాలిటీ, సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్ కార్మికులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ సమక్షంలో సోమవారం సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏజే.రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కార్మికుల చట్టాలు రద్దు చేసి నాలుగు కోడ్లు తెచ్చిన బీజేపీని రాబోవు ఎన్నికలో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో అబ్దుల్ నబి,తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, సుల్తానాలు మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రేమ్ సింగ్, రాజ్ కుమార్, శ్యామ్, హరికిషన్, కళ్యాణ్, వినోద్, శంకర్, చుక్కా రాంచందర్, హుస్సేన్, ఎన్.సంజీవ్, ఎంబి రెడ్డి, కే .శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యం...

- సీడీపీఓ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



తల్లి పిల్లల సంరక్షణే ఐసీడీఎస్ లక్ష్యమని సీడీపీఓ కమలప్రియ అన్నారు. మండల పరిధిలోని నాయుడుపేట అంగన్వాడీ కేంద్రంలో స్కూల్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఇంగ్లీషు మీడియంలో ప్రీస్కూల్ కొనసాగుతుందని పిల్లలందరిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రీస్కూల్ బోధనా పరికరాల ప్రదర్శనను సీడీపీఓతో పాటు పిల్లల తల్లిదండ్రులు తిలకించారు. అనంతరం విద్యార్థుల అభివృద్ధి ప్రగతి పత్రాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సువర్చన, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, సరిత, సరోజిని, ఉపేంద్రమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనాథం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మతోన్మాద బీజేపీని ఓడించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి

నవతెలంగాణ-పెనుబల్లి

మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి అన్నారు. పెనుబల్లి చలమాల సూర్యనారాయణ భవనంలో సోమవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశం కండె సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్యాగల కోట భువనగిరిలో ఎర్రజెండా ఎగురావేయాలని, దీని కోసం కార్యకర్తలు కృషి చేయాలని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని రైతు వ్యతిరేక చట్టాలను తీసుకుని వచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ చేయాలనీ చూసిందని దీనికి వ్యతిరేకం గా రైతులు ఏడాది పాటు పోరాటం చేయడంతో వెనక్కి తీసుకుందాని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు,మండల కార్యదర్శి గాయం తిరుపతి రావు, మండల కమిటీ సభ్యులు కండె సత్యం, నరసింహారావు, గుడిమెట్ల బాబు, భూక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-కొత్తగూడెంలీగల్

అతిగా మద్యం సేవించి, వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (ఫుల్ అడిషనల్ చార్జి స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్) బత్తుల రామారావు జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. పాల్వంచ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ తన సిబ్బందితో జగన్నాధపురం సెంటర్లో 22 మార్చి 2024న వాహన తనిఖీ నిర్వహిస్తుండగా బూర్గంపాడు మండలం ఇరవైండికి చెందిన ఆరేం వెంకటేశ్వర్లు అతిగా మద్యం తాగి ట్రాక్టర్ డ్రైవ్ చేస్తూ వస్తుండగా, డ్రైవర్‌ను ఆపి పరీక్షించగా అతిగా మద్యం సేవించినట్లు రుజువుగా కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో వెంకటేశ్వర్లు తన నేరం అంగీకరించగా రెండు రోజులు కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పాల్వంచ రూరల్ కోర్ట్ పి.సి. (కోర్టు డ్యూటీ ఆఫీసర్) బి.నరేందర్ సహకరించారు.



హైకోర్టు పోర్టు ఫోలియో

జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ కార్యవర్గం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం తెలంగాణ హైకోర్టు జస్టిస్ ఎన్‌వి.శ్రావణ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోర్టు పోలియో జడ్జిని శనివారం తెలంగాణ హైకోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ కొత్తగూడెం కోర్టులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా పోర్టు ఫోలియో జడ్జి స్పందించారని లక్కినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఎంయస్ఆర్.రవి చంద్ర, లైబ్రరీ సెక్రటరీ మహ్మద్ సాదిక్ పాషా, ఏ.కరుణకర్, యస్.ప్రవీణ్, డి.రవి కుమార్, మారపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవమి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని పినపాక గ్రామంలో శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సీతమ్మవారిని పెళ్లికూతురుగా అలంకరించారు. చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి సీతారాముల కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నవమి దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు

వాహన దారులకు పోలీసు వారి విజ్ఞప్తి

నవతెలంగాణ-కొత్తగూడెం

శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 16, 17 తేదీల్లో భద్రాచలం విచ్చేయు భక్తుల రద్దీ దృష్ట్యా భారీ వాహనాలు, గూడ్స్ వాహనాలు, ఇతర పెద్ద వాహనాలను పట్టణంలో రాకుండా నిషేధించడం జరుగుతుందని ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ గూడ్స్ వాహనాలు అత్యవసరమైతే తప్ప పట్టణంలో రాకుండా పోలీసువారి ఆంక్షలను గమనిచవలసినదిగా కోరారు. కళ్యాణం, పట్టాభిషేకం కార్యక్రమాల సందర్భంగా మిథిలా స్టేడియం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు విధించే అవకాశం ఉన్నందున ఈ విధమైన నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు. ఇప్పటికే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూఆర్ కోడ్‌ను, ఆన్‌లైన్ లింకును రూపొందించడం జరిగిందని తెలిపారు. కావునా ఈ రెండు రోజుల పాటు భద్రాచలం పట్టణానికి విచ్చేసే భక్తులు, వాహనదారులు పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ రోహిత్ రాజు విజ్ఞప్తి చేశారు.

రైల్వే లైన్ మాకొద్దు

విలువైన భూములు ఇవ్వలేం

- బోదులబండలో రైల్వే లైను వ్యతిరేక పోరాట కమిటీ ఆందోళన

నవతెలంగాణ-నేలకొండపల్లి

రైల్వే లైన్ మాకొద్దు.. విలువైన తమ భూములను ఇవ్వలేమంటూ రైల్వే లైన్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో రైతులు మూకుమ్మడిగా ఆందోళనకు దిగిన ఘటన సోమవారం మండలంలోని బోదులబండ గ్రామంలో జరిగింది. పాపటపల్లి నుండి మిర్యాలగూడ వరకు నూతన రైల్వే లైను నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందంటూ సంబంధిత అధికారులు గత కొద్ది రోజులుగా నేలకొండపల్లిలోని వివిధ గ్రామాల నుండి రైల్వే లైన్ మార్కింగ్ పనులు ముమ్మరం చేసినట్లు సమాచారం. గతంలో రైల్వే లైను నేలకొండపల్లి మీదుగా నిర్మాణం చేపడతారని వచ్చిన వార్తలపై మండలంలోని వివిధ గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మండలంలోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, కొత్త కొత్తూరు, తిరుమలాపురం తండా, పైనంపల్లి గ్రామాల నుండి, వ్యవసాయ భూముల మీదుగా వెళుతున్న జాతీయ రహదారికి రైతులు, ప్రజలు తమ విలువైన భూములను ఇళ్లను కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. దీంతో కోట్ల రూపాయల విలువ చేసే తమ భూములు ఇళ్లను కోల్పోయామని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తిరిగి రైల్వే లైను నిర్మాణం పేరుతో తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వలేమని ఒకపక్క చెబుతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తమ పని తాము చేసుకుంటూ పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేని రైల్వే లైనుకు



మా భూములు ఇవ్వలేమంటూ ధర్నా ఆందోళన చేపట్టారు. బలవంతంగా భూములు గుంజుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని రైతులంతా ప్రజలందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీసా ముత్తయ్య, అనంతు పెద్ద రామదాసు, గడ్డం హరి ప్రసాద్, గడిపూడి పద్మ, అనంతు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాషాయిదారులతో దేశానికి ప్రమాదం

ఎన్‌సీసీ పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడు అలవాల

నవతెలంగాణ-సత్తుపల్లి

కాషాయిదారులతో దేశానికి ప్రమాదం పొంచి ఉందని, వారినుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందిరిపై ఉందని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో కరుణాకర్ మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు దేశానికి మేలు జరిగేలా ఉండటానికి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమాలు నిర్వహించాలని కరుణాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫినాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ దీపక్ జాన్ మాట్లాడుతూ క్రిస్టియన్లకు మేలుచేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. మన అభివృద్ధి కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మనమంతా అండగా ఉండాల్సిన బాధ్యత క్రిస్టియన్ సమాజానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిమళ్ల హనోక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బాబూరావు, రాష్ట్ర పొలిటికల్ వింగ్ అధ్యక్షుడు పింగిలి సామేలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఏసుదాసు, రాష్ట్ర కార్యదర్శి గుర్రాల సత్యానందం, జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏరియాలో పర్యటించిన డైరెక్టర్

- సోలార్ పవర్ ప్లాంట్‌ను తనిఖీ

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఇ&యం) డి.సత్యనారాయణరావు ఇల్లందు ఏరియాలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ కార్యాలయం నందు ఏరియా వివిధ విభాగాల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎంవీఎల్ నరసింహారావు ఇంజనీర్ వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని మౌనం పాటించారు. తదుపరి వారు అధికారులను ఉద్దేశించి వారి ఆరోగ్యం మరియు కుటుంబ సంరక్షణ బాధ్యతను పట్టించుకోవాలని తెలియజేశారు. అనంతరం ఏరియా లోని 39 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ను తనిఖీ చేసి రోజువారు విద్యుత్ ఉత్పత్తి మరియు ప్లాంట్ నిర్వహణ, గ్రాస్ కటింగ్, మాడ్యులర్ క్లీనింగ్, ఇన్వర్టర్ రూమ్, బ్యాటరీ బ్యాంకు, ట్రాన్స్ ఫార్మర్, ట్రాన్స్ మిషన్ లైన్స్ పరిశీలించారు. గ్రిడ్‌కు అనుసంధానం,



రోజువారి విద్యుత్ ఉత్పత్తి తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జి.ఎం జాన్ ఆనంద్, ఎస్ఓటు డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, డి.జి.యం(ఇ&యం) విజయ శేఖర్ బాబు, ఇతర అధికారులు క్రిస్టఫర్, దిలీప్ కుమార్, వీరు నాయక్, నాగేశ్వరరావు సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి పాల్గొనారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

- ప్రారంభించిన డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

సత్తుపల్లి బస్టాండ్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సత్తుపల్లి డిపో మేనేజర్ యువ రాజ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. వేసవికాలంలో ప్రయాణికులు భానుడి భగభగల నుండి కాపాడుకునేందుకు బస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం హర్షించదగిన విషయమని ఆమె తెలియజేశారు. ప్రయాణికులకు వేసవిలో మంచినీటిని అందించడమే కాకుండా దాతలు సహకారంతో ప్రతిరోజు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మొదటి రోజు ఆర్కే ఫౌండేషన్ అధినేత పేద ప్రజలకు అండగా ఉండే వ్యక్తి ఇనపనూరి రాధాకృష్ణ 400 మంది ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం పట్ల డిపో మేనేజర్ ప్రత్యేకంగా రాధాకృష్ణను అభినందించారు. ప్రతిరోజు దాతల



సహకారంతో బస్టాండ్ అడ్డాలో మజ్జిగను పంపిణీ చేస్తామని ఆటో యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే ఫౌండేషన్ ఇనపనూరి రాధాకృష్ణ, ఆటో యూనియన్ అధ్యక్షులు అంబోజు శ్రీనివాసరావు, ఎస్కే గుమ్ షావలి, నందిపాటి రవి, కే.సాంబ, పి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలి

- డీపీవో హరి కిషన్

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ సూచించారు. ఎర్రుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగు తున్న ఉపాధి హామీ పనులను సోమవారం గ్రామ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. కూలీలు ఉద యం పూటనే పనులకు వచ్చి తమకు కేటాయించిన పనులు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు టెంట్లు, మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిడ్స్ అందుబాటులో ఉంచాలన్నారు. తమకు గత వారం రోజులుగా చేసిన పనులకు సంబంధించిన డబ్బులు అందించ లేదని ఆయన దృష్టికి కూలీలు తీసుకు వచ్చారు. వెంటనే కూలీల బిల్లులు అందించేందుకు చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం త్వరగా వచ్చి, 11 గంటల వరకు పని ప్రదేశం నుండి ఇంటికి వెళ్ళాలన్నారు.

తల్లాడ : ఉపాధి హామీ కూలీలు ఉదయం త్వరగా పని ప్రదేశానికి వచ్చి, పని చేసుకొని 11 గంటల వరకు ఇండ్లకు తిరిగి వెళ్లాలని, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదేశించారు. సోమవారం



నూతనకల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేయాలి

- సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ)

పాలేరు డివిజన్ నాయకులు ఉమాశంకర్ డిమాండ్

నవతెలంగాణ-ముదిగొండ

ముదిగొండ గ్రానైట్ పరిశ్రమ కంకర క్వారీలలో పనిచేస్తున్న కార్మికులకు యజమాన్యం ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ) పాలేరు డివిజన్ నాయకులు మాదారపు ఉమాశంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని మండుతున్న ఎండలకు కార్మికులు అనారోగ్యాన బారిన పడే అవకాశం ఉందని, గ్రానైట్ పరిశ్రమతోపాటు ఇతర పరిశ్రమలలో పనిచేసే కార్మికుల పనివేళల్లో మార్పు చేయాలన్నారు. కార్మికుల జీవితాలను దృష్టిలో పెట్టుకొని ఆయా పరిశ్రమల యజమానులే బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్మికుల పని వేళల్లో యజమానులు గ్లౌజులు, షూలు అందజేసి ఆరోగ్య నియమాలను పాటించి పనులు చేయించాలన్నారు. పలు పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా కార్మికులచే పనులు చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. వేసవి ఉష్ణోగ్రత తీవ్రత పెరగటంతో ఎండలు మండుతున్నాయన్నారు. ముదిగొండ గ్రానైట్ పరిశ్రమ, కంకర క్వారీలలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు అధికశాతం పనిచేస్తున్నారని, కార్మికులు అనారోగ్యానికి గురైతే యజమానులదే బాధ్యతని ఉమాశంకర్ పేర్కొన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని వారి పక్షాన న్యూడెమోక్రసీ అనుబంధం సంఘాలైన ఐఎఫ్టియు, పీవైఎల్ సంఘాలతో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

చాగర్ల లక్ష్మయ్యకు ఘన సత్కారం

నవతెలంగాణ-కామేపల్లి

మండలంలోని ముచ్చర్ల క్రాస్ రోడ్ చెక్ పోస్ట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ చాగర్ల లక్ష్మయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. 2023-24 మార్కెట్ ఫీజు టార్గెట్‌ను పూర్తి చేసినందుకు గాను లక్ష్మయ్యకు ఇల్లందు మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్ 3 కార్యదర్శి ఈ.నరేష్ కుమార్ శాలువా కప్పి సత్కరించి మెమొంటో అందించారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి ఆదర్శంగా నిలిచినందుకు అభినందించి లక్ష్మయ్య సేవలను ప్రశంసించారు. అదేవిధంగా ఇల్లందు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సూపర్వైజర్, సిబ్బందిని కూడా వారు శాలువా మెమెంటోతో ఘనంగా సత్కరించారు. లక్ష్మయ్య 100 శాతం మార్కెట్ ఫీజు వసూలు చేశారు. 320.00 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా లక్ష్యానికి మించి 323.78 లక్షలు వసూలు చేశారు. సీసీఐలో 1373 మంది రైతులు తమ పత్తిని అమ్ముకున్నారు. వారి అందరికి డబ్బులు వారి వారి బ్యాంకు అకౌంట్ లలో జమ చేశామని చెప్పారు.

సారపాక వద్ద హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ- బూర్గంపాడు

భద్రాచలం వద్ద హై లెవల్ వంతెన ప్రారంభించుకోవడం చాలా సంతోషమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. సోమవారం మండలంలోని సారపాక వద్ద రూ.98.45 కోట్లతో గోదావరిపై నిర్మించిన రెండో వంతెనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2.3 కిమీ పొడవు కాగా ఇందులో 1.25 కిమీ పొడవు వంతెన, మిగిలిందని, అప్రోచ్ రహదారి ఉన్నట్లు ఆమె తెలిపారు. 7.5 మీటర్ల వెడల్పుతో ఈ వంతెన నిర్మాణం జరిగినట్లు ఆమె తెలిపారు. మొత్తం 37 స్లాబులతో వంతెన పూర్తి అయినట్లు తెలిపారు. శ్రీరామ నవమికి భద్రాచలం విచ్చేయు భక్తులుకు అదనపు వంతెన అందుబాటులోకి రావడం చాలా సంతోషంగా ఉందని వంతెన పూర్తితో రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు ఆమె తెలిపారు. విజయ వాడ నుండి జగదల్పూర్ వరకు ఉన్న రహదారిలో 166వ కిమీ వద్ద ఈ వంతెన నిర్మాణం జరిగినట్లు ఆమె పేర్కొన్నారు. 2014లో ఈ వంతెన పనులు ప్రారంభం అయ్యాయని నేడు విజయవంతంగా పనులు ప్రారంభించుకున్నామని ఆమె అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం మహోత్సవాలకు భద్రాచలం విచ్చేయు భక్తులకు ఒకటే వంతెన ఉండటం వల్ల ప్రయాణికులు, భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు నుండి విముక్తి లభించిందన్నారు. పెండింగ్ ఉన్న పనులను



కూడా సత్వరమే చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజ్, ఐటిడిఎ పిఓ ప్రతీక్ జైన్, జాతీయ రహదారుల శాఖ ఈఈ యుగంధర్, డీఈ శైలజ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథగూడెంలో రామాలయ ప్రతిష్ఠ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని రఘునాథగుడెంలో శ్రీ కోదండరామ రామాలయంలో అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని ప్రత్యేక పూజల నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. పూజలు నిర్వహించిన అనంతరం వారిని శాలువాతో సత్కరించి శ్రీ సీతారామ చంద్రుల స్వామి వారిపటాన్ని పూజలు బహూకరించి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ సొసైటీ అధ్యక్షుడు పాలెపు రామారావు, పెడకంటి రామకృష్ణ, కాటంనేని వెంకటేశ్వరరావు, గొల్లమందల ప్రసాద్, ఆ గ్రామ మాజీ సర్పంచ్ కుక్క అర్జున్ రావు, మాజీ ఉప సర్పంచ్ చలవల్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భాగం ప్రభాకర్ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ
- పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

రోజురోజుకు ఉష్ణోగ్రత పెరుగుతన్నాయి. ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించి మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకుంటూ ఎండ నుంచి అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ ప్రజలను కోరారు. సోమవారం స్థానిక చంద్రుపట్ల రోడ్లో మట్ట యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీరు మజ్జిగ పంపిణీ కేంద్రాల్లో భాగం నారాయణమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారులు కల్లూరు మండల నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి 8వ రోజు ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 12 గంటల లోపల పనులు చేసుకుని మధ్యాహ్నం పూట బయట తిరగకుండా వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్ చౌదరి, మూకర విజయ రావు, బైర్ల కాంతారావు, పాప బత్తిని నగేష్, యాసా శ్రీకాంత్, దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఎనుముల రాము, పసుపులేటి శీను, కాంగ్రెస్ సాంబ, బొల్లం ఉపేందర్, గౌడ్ బొడ్డు తిరుపతిరావు, మట్టా ప్రవీణ్, నరకుల్ల సురేష్ పాల్గొన్నారు.



26 మంది మావోయిస్టులు లొంగుబాటు



నవతెలంగాణ-చర్ల

సౌత్ బస్తర్ దంతెవాడ జిల్లాలో 26 మంది మావోయిస్టులు సీఆర్పీఎఫ్ డీఐజీ వికాస్ కతేరియా, ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట సోమవారం లొంగిపోయారు. 'లోన్ వరాటు' (ఇంటికి తిరిగి రండి) ప్రచారానికి ఆకర్షితులై లొంగిపోయినట్టు వారు తెలిపారు. వీరంతా బంద్ సందర్భంగా రోడ్లను తవ్వడం, చెట్లను నరికివేయడం, బ్యానర్లు, పోస్టర్లు వేయడం వంటి ఘటనల్లో పాల్గొనేవారు. లొంగిపోవడంలో ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఆర్ఎఫ్టీ రేంజ్ సీఆర్పీఎఫ్ 111వ, 195వ కార్ప్స్, 231వ కార్ప్స్ ప్రత్యేక సహకారం అందించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహక నగదుతో పాటు అన్ని రకాల ప్రయోజనాలను దంతెవాడ పోలీసు సూపరింటెండెంట్ అందజేస్తారు. 'లోన్ వరాటు' ప్రచారం కింద, ఇప్పటివరకు 176 రివార్డ్ మావోయిస్టులతో సహా మొత్తం 717 మంది లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్టు పోలీసులు తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన



నవతెలంగాణ-మల్హర్‌రావు

రోజురోజుకూ ఎండలు మండుతుండటంతో ఇప్పటికే జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో భూగర్భ జలాలు 450 అడుగులు లోతుకు అడుగంటాయి. సాగు నీటి ఇబ్బందులే కాకుండా తాగునీటి ఇబ్బందులు సైతం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని మల్హర్ మండలం తాడిచెర్లలోని రేగడిపల్లిలో నాలుగైదు రోజులుగా తాగునీరు కరువయింది. విసిగి వేసారిన స్థానికులు సోమవారం ఖాళీ బిందెలతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ.. స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ప్రజల దాహార్తి తీర్చాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని 8వ వార్డులో ఉన్న బోర్‌లో భూగర్భ జలాలు తగ్గడంతో నీరు తక్కువగా పోస్తోందని చెప్పారు. దీనికి తోడు మిషన్ భగీరథ పైప్ లైన్ సైతం వార్డులో వేయకపోవడంతో తాగునీటికి కటకటగా ఉంది. దాంతో నీరులేక మూడు రోజులకోసారి స్నానం చేస్తున్నట్టు వాపోయారు. గొంతు తడుపుకునేందుకు వ్యవసాయ, సమీప వార్డుల్లో బోర్ మోటార్ల వద్దకు పరుగులు తీస్తున్నామని చెప్పారు. సమీప బోర్ బావుల వద్దకు నీటి కోసం వెళ్తే సదరు రైతులు ఇక్కడికి రావొద్దంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేదంటే ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మద్దతు ధర కోసం.. ధాన్యం రైతుల ఆందోళన



- గన్నీ బ్యాగులు తగలబెట్టి నిరసన

నవతెలంగాణ-జనగామ

జనగామ జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మద్దతు ధర కరువైంది. మార్కెట్ యార్డులో ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదని రైతులు నాలుగు రోజుల కిందట నిర్వహించిన ఆందోళనపై సీఎం సీరియస్‌గా స్పందించి, రైతుల వద్ద మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ నాలుగు రోజుల సెలవుల అనంతరం సోమవారం ప్రారంభమైన మార్కెట్ యార్డులో ఎలాంటి మార్పు రాలేదు. దాంతో ఆగ్రహించిన రైతులు మార్కెట్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట గన్నీ బ్యాగులు తగలబెట్టి నిరసనకు దిగారు. అక్కడికి వచ్చిన జిల్లా మార్కెటింగ్ అధికారిని అడ్డుకొని రైతులు వాగ్వివాదానికి దిగారు. అధికారులు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా రైతులు ఆందోళన అలాగే కొనసాగించారు. మార్కెట్ యార్డుకు జిల్లా కలెక్టర్ రావాలని, రైతులు తెచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చివరికి జనగామ ఆర్డీఓ దేవరాయ కొమురయ్య వచ్చి ధాన్యంకు మద్దతు ధర కల్పిస్తామని హామీనివ్వడంతో రైతులు శాంతించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేయకుంటే మళ్లీ నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. యాసంగి ధాన్యాన్ని మార్కెట్ యార్డులో మార్చి 6వ తేదీ నుండి వ్యాపారస్తులు కొనుగోలు ప్రారంభించారు. అప్పటినుంచి ఏప్రిల్ 13వరకు జనగామ మార్కెట్ యార్డ్‌లో 1407 మంది రైతుల వద్ద నుంచి 61930.10 క్వింటాళ్ల ధాన్యాన్ని క్వింటాకు రూ. 1500 నుంచి రూ.1800 వరకు ధర చెల్లించి వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. ఆరుగాలం కష్టపడ్డా రైతుకు క్వింటాకు ధర సరాసరి రూ.1700 కూడా దాటకపోవడం గమనార్హం. దాంతో నాలుగు రోజుల క్రితం మార్కెట్ యార్డులో రైతులు మద్దతు ధర కోసం ఆందోళన చేశారు.

24 లేదా 25న ఇంటర్ ఫలితాలు!

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల ఫలితాలు ఈనెల 24 లేదా 25న విడుదలయ్యే అవకాశమున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు సంబంధించి ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫిబ్రవరి 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గతనెల 19 వరకు అవి జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది కలిపి మొత్తం 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.గతనెల నాలుగో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే .రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో నిర్వహించారు. ప్రస్తుతం ఫలితాలకు సంబంధించిన ప్రాసెసింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రంలోనూ ఎన్నికల కమిషన్ (ఈసీ) అనుమతి తీసుకుని ఇంటర్ ఫలితాలను ఈనెల 24 లేదా 25న విడుదల చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది.

ఏం చేశావని ఓట్లడుగుతున్నవ్ ?

దేవుణ్ని రాజకీయ రొంపిలోకి లాగడం దుర్మార్గం

- దేశ ప్రజలు నియంతృత్వాన్ని సహించరు జాగ్రత్త..
- ఇందిరమ్మలాంటోళ్లనేమట్టికరిపించిండ్రు
- చరిత్ర తెలియకుండా వ్యవహరిస్తే..కుదరదు
- రాష్ట్రంలో బీజేపీని ఓడించాల్సిందే : సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదేండ్ల కాలంలో దేశ ప్రజలకు మోడీ సర్కార్ చేసిన పని గుర్తు చేసి, ఓట్లడిగే స్థితి లేదనీ, ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదనీ, ప్రజలకు ఏం చెప్పి ఓట్లడగాలో అర్థం గాక..దేవుణ్ని అడ్డం పెట్టుకుని ఓట్లడిగే దుస్థితికి బీజేపీ దిగజారిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం)గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో' బీజేపీని ఓడిద్దాం-నియంతృత్వ ప్రమాదం నుంచి దేశాన్ని కాపాడుకుందాం' అంశంపై నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, ఎం మహేందర్, ఎం వెంకటేశ్, ఎం దశరథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ అన్ని గెలుస్తాం, ఇన్ని గెలుస్తామంటూ బీజేపీ నేడు అడ్రస్ లేని లెక్కలు చెబుతూ ప్రజలను గందరగోళం చేస్తోందని విమర్శించారు. గతంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏ మేరకు అమలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పుకోవటానికి ఏమీ లేక.. ప్రజల మధ్య చిచ్చు పెట్టి, విద్వేషాలు రగిలించి ఓట్లు దండుకునేందుకు వారు కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయనీ, పేదరికం, దరిద్ర్యం, నిరుద్యోగం ఎన్నడూ లేని పద్ధతుల్లో పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల దురహంకార హత్యలు, మహిళలపై లైంగిక వేధింపులు నిత్యకృత్యమయ్యాయని తెలిపారు. పేదలందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పిన మోడీ.. చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మళ్లీ మధ్యతరగతికి మూడు కోట్ల ఇండ్లు కట్టిస్తామంటూ మోసానికి తెగబడుతున్నారని విమర్శించారు. తెలంగాణ విభజన హామీలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయనప్పుడు బీజేపీకి ఎందుకు ఓట్లు వేయాలో చెప్పాలన్నారు. ఉన్న నాలుగు సీట్లు కూడా ఓడిపోక తప్పదని హెచ్చరించారు. గతంలో ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని ప్రజలు ఓడించారనీ, దేశంలో నియంతృత్వ పాలన సాగించాలంటే కుదరదనే విషయాన్ని మోడీ గ్రహించాలనీ అన్నారు. చరిత్ర తెలుసుకుని వ్యవహరించాలని ప్రధానికి హితవు పలికారు. రాజ్యాంగబద్ధ సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవటం తగదన్నారు. తమను విభేదించే పార్టీలపై ఈడీ, ఐటీ సీబీఐలతో లొంగదీసుకుంటున్నారనీ, లొంగని వారిని జైల్లల్లో బంధిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకురాలు కవిత అరెస్టు అయితే..ఆ పార్టీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. భయపడుతున్నారో..లొంగిపోయారో చెప్పాలన్నారు. ఈ అంశంపై ఇప్పటి వరకు బీఆర్ఎస్ అధినేత ఎందుకు నోరు మెదపటం లేదని ప్రశ్నించారు. దీంతో అనేక రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దేశంలో బీజేపీ ప్రమాదం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్రంలో వింతగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. బీజేపీ వ్యతిరేక శక్తులను కలుపకపోవటంలో ఆ పార్టీ విఫలమైందని చెప్పారు. డీజీ నర్సింహారావు, ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు ఏరియాలో కారుణ్య నియామకాలు చేపట్టలేదనీ, ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలను కూడా చేపట్టలేని దైన్యంలో బీజేపీ ఉందని చెప్పారు. ఇక్కడే ఈ పరిస్థితి ఉంటే..ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాహకం వల్ల తాగు నీటికి కూడా మీటర్లు పెట్టే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను బీజేపీ అభ్యర్థులు ప్రస్తావించకుండా మత వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిధిలో పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలను చేపట్టాలి

- మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలి : ఇంటర్ బోర్డు కార్యదర్శికి టీజీజేఎల్ఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం 2024-25లో 416 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ- 475) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను సోమవారం హైదరా బాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 4,79,050 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారనీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం లో 85 వేల మంది ప్రవేశం పొందారని వివరిం చారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు 5.08 లక్షల మంది హాజరయ్యారని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరాలంటే వెంటనే ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. ఇంటర్ ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న అధ్యాపకులకు రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని సూచించారు.గతంలో వెంటనే ఇచ్చే వారని గుర్తు చేశారు. గతేడాది నుంచి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల రెమ్యూనరేషన్‌ను చెల్లించడంలో విపరీతమైన జాప్యం జరుగుతు న్నదని పేర్కొన్నారు. దీంతో చాలా మంది అధ్యాపకులు, సిబ్బంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇంటర్ విద్యలో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి సాధారణ బదిలీల ప్రక్రియను నిర్వహించాలని కోరారు. అనేక ఏండ్లుగా ఒకే చోట పనిచేస్తూ సాధారణ బదిలీల్లేక అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే బదిలీల సౌకర్యం కల్పించా లని సూచించారు.ఇంటర్ బోర్డు కార్యదర్శి సాను కూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీజేఎల్ఏ-475 ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం శ్రీనివాస్‌రెడ్డి, కెపి శోభన్‌బాబు, గోవర్ధన్,సంగీత,విశాలాక్ష్మి, నాయకులు నందికొండ వెంకన్న, టి జాన్, పత్తేపురం శ్రీను, నందికొండ సత్యేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు తలొగ్గక...

దాదాపు దశాబ్ద కాలంగా అక్రమ రవాణాదారుల నుంచి పిల్లలను కాపాడే పనిలో నిమగ్నమయ్యింది పల్లవి ఘోష్. 2012లో గ్రాడ్యుయేషన్ కోసం ఢిల్లీ యూనివర్సిటీకి వచ్చిన ఆమె ఎన్ఎస్ఎస్ సెల్‌లో చేరింది. చెన్నైలో జెండర్ స్టడీస్‌లో మాస్టర్స్ కూడా పూర్తి చేసింది. తన చిన్న వయసులో ప్రత్యక్షంగా చూసిన ఓ ఘటన ఆమె జీవితంలో చెరగని ముద్రవేసింది. అసోంలోని లుమ్‌డింగ్‌లో పుట్టి పెరిగిన ఆమెను 12 ఏండ్ల వయసులో ఎదురైన ట్రాఫికింగ్ కేసు ఆమె జీవితాన్ని ఎలా మలుపుతిప్పిందో ఈనాటి మానవిలో...



పశ్చిమబెంగాల్‌లో నివసించే తన మేనమామ ఇంటికి ప్రతి వేసవి సెలవుల్లో వెళుతుండేది పల్లవి. అప్పుడు ఆమె వయసు 12 ఏండ్లు. 6వ తరగతి చదువుతుంది. అక్కడ ఓ భయంకరమైన ఘటన చూసింది. కూతురును కోల్పోయిన ఓ వ్యక్తి అరుపులతో ఆమె చలించిపోయింది. కోల్‌కతాలోని 24 పరగణాల గ్రామంలో ఓ వ్యక్తి నిస్సహాయంగా అరుస్తూ నడుస్తున్నాడు. తన కూతురుని గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకుపోయాడు. తన వయసులో ఉన్న బాలిక ఎలా అదృశ్యమైందో అప్పుడు పల్లవికి అర్థంకాలేదు. ఎవరు తీసుకెళ్ళారు? ఆమెను ఏం చేస్తారు? అనేక ప్రశ్నలు వెంటాడాయి. అన్నిటికీ మించి ఆ బాలిక తండ్రి ఆవేదన వర్ణనాతీతం... 'ఏక్ భయ్యా ఆతే హై యమహా మే బైక్ ఇస్నే లేకే జాతే హై (ఒక వ్యక్తి యమహా మీద వచ్చి అమ్మాయిని ఎత్తుకెళ్ళాడు) అని ప్రత్యక్షసాక్షి ఒకరు బాధితురాలి తండ్రికి చెప్పటం తనూ విన్నది. కొన్ని వారాల తర్వాత.. సెలవులు ముగిసి ఇంటికి తిరిగి వచ్చినా.. ఆ సంఘటన ఆమెను వెంటాడుతూనే ఉంది.

'తప్పిపోయిన పిల్లలను వెతకడం మొదలుపెట్టాను'

అక్రమ రవాణాని అర్థం చేసుకోవడానికి ఆమె వయస్సు చాలా చిన్నది. అయినప్పటికీ ఆమెలోని ఉత్సుకతే ఆ చీకటి ప్రపంచం గురించి క్రమంగా తెలుసుకునేలా చేసింది. తప్పిపోయిన పిల్లల గురించి తెలుసుకునే ప్రయత్నంలో తల్లిదండ్రులు, స్నేహితులు, తన చుట్టూ ఉన్న ఇతరులతో మాట్లాడటం ప్రారంభించింది. కానీ ఎవరి దగ్గరా సమాధానాలు దొరకలేదు. తను 11వ తరగతిలో ఉన్నప్పుడు ఈ సమస్యపై స్వయంగా అధ్యయనం చేయాలని నిర్ణయించుకుంది. 'అసోంలో, మా ఇంటికి సమీపంలో ఒక పోలీసు స్టేషన్ ఉంది. పిల్లలను ఎత్తుకొచ్చి వీధులు, బస్టాప్‌లు, రైల్వే స్టేషన్లలో భిక్షాటన వృత్తిలోకి నెడతారని పోలీసు అధికారి ఒకరు నాతో చెప్పిన విషయం నాకు బాగా గుర్తుంది' అంది పల్లవి.

అసోంలోని రైల్వే స్టేషన్‌లకు వెళ్ళి అక్కడ పరిశీలించేది. గౌహతి రైల్వే స్టేషన్‌లో చిన్న పిల్లలు అనర్గళంగా హిందీ మాట్లాడుతుండటాన్ని గుర్తించింది. వారితో మాట్లాడగా.. వారు రాజస్థాన్, బీహార్‌కు చెందినవారని తెలుసుకుంది. అక్రమ రవాణా ద్వారానే వారంతా ఇక్కడకు తీసుకురాబడ్డారని అర్థమైంది. రైల్వే స్టేషన్ల వద్ద అడ్డుక్కోవటమేకాదు.. ముఖ్యంగా వ్యభిచార గృహాలకు ఆడపిల్లలను అమ్మేస్తున్నారు. అక్కడ వారిని సెక్స్ వర్కర్లుగా మారుస్తున్నారు. 'నేను వెళ్లిన ప్రతిచోటా సమస్య ఎంత జటిలమైందో అర్థమైంది. ఆ సంఘటన నాపై తీవ్ర ప్రభావం చూపింది. అందుకే ఈశాన్య, పశ్చిమ బెంగాల్‌లో అక్రమ రవాణాపై పరిశోధన చేయడం ప్రారంభించాను' అని ఆమె చెప్పింది.

'ఒక దుర్మార్గం. అనేక కారణాలు'

దేశంలో అక్రమ రవాణాకు పేదరికమే ప్రధాన కారణం. నిరుద్యోగం, నిరక్షరాస్యత, వలసలు (ఇంట్రా, ఇంటర్-కంట్రీ), సోషల్ మీడియా ప్రభావం వంటివి ఇతర కారణాలు. వ్యభిచార కూపాలకు అమ్మేసేందుకు బాలికలను అక్రమ రవాణా చేస్తున్నారు. బలవంతపు, బాల్య వివాహాలు చేసుకోని వారిని వేరే ప్రాంతాలకు తీసుకెళ్ళి మురికి కూపాల్లోకి నెట్టేస్తున్నారు. లేబర్ పని, ఫ్యాక్టరీ పని కోసం... మగపిల్లలను ఎత్తుకెళుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కానింగ్ ప్రాంతం నుంచి అక్రమ రవాణాకు గురైన సీత గురించి చెబుతూ... 'బెంగాల్‌కు చెందిన సీతను ఓ వ్యక్తి ప్రేమలోకి దించాడు. ఢిల్లీలో మెరుగైన జీవితం కల్పిస్తానని ఆశ చూపాడు. ఆమెను తీసుకొచ్చే క్రమంలో... హౌరా స్టేషన్‌లో టీ తాగించాడు. అందులో మత్తు పదార్థాన్ని కలిపాడు. అది తాగిన ఆమె స్పృహ కోల్పోయింది. స్పృహ వచ్చేసరికి వ్యభిచార గృహంలో ఉంది. '2015లో ఢిల్లీ రెడ్ లైట్ ఏరియా నుంచి సీతతో పాటు మరో ఎనిమిది మంది బాలికలను రక్షించాం.. ఆ తర్వాత ఆమెను తన ఇంటికి చేర్చాం. ఎల్ అండ్ టీలో పనిచేస్తున్న ఇంజనీర్‌ని సీత వివాహం చేసుకుంది. ఇప్పుడు ఆమెకు నాలుగేండ్ల పాప' అని పల్లవి గుర్తుచేసుకుంది. పల్లవి ప్రకారం... దేశంలో ప్రతిరోజూ 2,000 మంది పిల్లలు అక్రమంగా రవాణాకు గురవుతున్నారు.







ప్రమాదంతో కూడుకున్నదైనా..

తను చేస్తున్న ఈ ఉద్యమం అంత ఈజీ కాదు. ప్రమాదంతో కూడుకున్నది. ట్రాఫికింగ్ మాఫియాల నుంచి బెదిరింపులు ఎదుర్కొంది. అయినా ఆమె వెనకడుగు వేయలేదు. 'తీస్ హజారీ కోర్టులోనే చంపేస్తామంటూ కత్తితో హెచ్చరించారు. అయితే, రక్షించిన అమ్మాయిల నుంచి పువ్వులు, ప్రశ్నంసలూ పొందుతున్నాను. వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. బెదిరింపులతో పోలిస్తే ఇవి ఎంతో విలువైనవి, సంతృప్తినిస్తాయి' అంటుంది పల్లవి.

ఢిల్లీలో రీసెర్చ్ ఆఫీసర్‌గా...

సమస్యపై దృష్టి సారించిన ఆమె... 2012లో ఢిల్లీలోని అటువంటి కేసులను పరిష్కరించే సంస్థలో రీసెర్చ్ ఆఫీసర్‌గా చేరింది. ఓ రోజు రెస్క్యూ ఆపరేషన్‌కు సిద్ధమవ్వగా.. అందుకు సంబంధించిన అధికారి అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. దాంతో పల్లవి ఆ రెస్క్యూ మిషన్‌కు నేతృత్వం వహించింది. రెస్క్యూ మిషన్ విజయవంతమైంది. ఇలాంటి పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురాగలనన్న నమ్మకం ఆమెలో పెరిగింది. ఆ తర్వాత ఆరేండ్లు అదే సంస్థలో కొనసాగింది. గత 11 ఏండ్లలో 10,000 మందిని అక్రమ రవాణా నుంచి లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో కలిసి రక్షించింది.

అక్కడితో ఆగలేదు

పిల్లలను రక్షించడం మాత్రమే సరిపోదు. వారికి పునరావాసం కల్పించడం కీలకం. పిల్లలు వారి కాళ్లపై వారు నిలబడేలా తీర్చిదిద్దాలని నిర్ణయించుకుంది. ఇందుకు సొంతంగా ఓ సంస్థను ప్రారంభించాలనుకుంది. డిసెంబర్ 2020లో 'ఇంపాక్ట్ అండ్ డైలాగ్ ఫౌండేషన్'ను ప్రారంభించింది. చైల్డ్ ట్రాఫికింగ్‌పై దేశంలో అవగాహన తక్కువ. అసోం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నది. అక్రమ రవాణా గురించి ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పిస్తున్నది. 'నేను లక్ష్యంగా ఎంచుకున్న ఆ ప్రాంతాల్లోని ఇండ్లకు వెళ్ళి.. అక్రమ రవాణా గురించి మహిళలతో మాట్లాడటానికి ప్రయత్నించగా వారు ఏదోలా చూసేవారు.. ముఖం మీదే తలుపులు మూసేసేవారు. అయినా పట్టు వదలకుండా తిరిగాను. ఆ తర్వాత వారికి అర్థమైంది. ఇప్పుడు ఎంతో ఆప్యాయంగా ఆహ్వానిస్తారు' అంటుంది. ఏడాదిన్నర వ్యవధిలో, పల్లవి ఈశాన్య ప్రాంతంలోని 75,000 మంది మహిళలకు చేరువయ్యింది. పిల్లల అక్రమ రవాణా, జాగ్రత్తగా ఎలా ఉండాలో మహిళలకు అవగాహన కల్పిస్తున్నది. సామాజిక దురాచారాలపై వర్క్‌షాప్‌లు, కథనాల ద్వారా వారిని చైతన్యవంతులను చేస్తున్నది. 2014 నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థితో కూడా పనిచేసింది. ఓ కేసులో రెస్క్యూ ఆపరేషన్ కోసం వచ్చిన సత్యార్థితో ఆమె కలిసి పనిచేసింది.

సొంతకాళ్ళపై నిలబడేలా...

మురికి కూపాల నుంచి బయటపడిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల వారి జీవితాలు మెరుగుపడవనీ, వారి జీవితాల్లో సమూలమైన మార్పు తీసుకురావాలని అర్థమైంది. వారిని శక్తివంతులను చేసే సొంత పునాదిని ఏర్పాటుచేయాలనుకుంది. అసోంలో ఒక మ్యాపింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇది పునరావాసంలో శిక్షణ పొందిన బాలికలు.. ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి వీలు కల్పిస్తుంది. టైలరింగ్‌లో అనేక మంది బాలికలు శిక్షణ పొందారు. కొంతమంది వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. 'నేను ప్రారంభించిన ఫౌండేషన్ ఇంత ప్రభావం చూపుతుందని ఊహించలేదు' అంటుంది పల్లవి.

2019లో గుజరాత్‌లో ఓ అమ్మాయిని వ్యభిచార గృహానికి అమ్మేసిన కేసు గురించి చెబుతూ... తను ఇప్పుడు డాక్టర్ చదువుతోంది. రక్షించే అమ్మాయిలను ఏదో విధంగా నిలదొక్కుకునేలా చేయాలన్నదే పల్లవి ప్రయత్నం. ఆమె రక్షించిన మరొక అమ్మాయి ఇప్పుడు ఫౌండేషన్‌లో నిర్ణయాలు, విధాన రూపకల్పన ప్రక్రియలో భాగస్వామి. 'దీదీ నాకు రెండో జీవితమిచ్చింది. నేను మళ్లీ స్వేచ్ఛగా ఉంటానని ఊహించలేదు. నా కాళ్లపై నేను నిలబడగలిగాను. ఇప్పుడు ట్రాఫికింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నది నా ఆకాంక్ష. తద్వారా నేను మోసపోయినట్టు ఎవరూ మోసపోకూడదు..' అంటుంది బాధితురాలు.

\- కె. లలిత

డీహైడ్రేషన్ నుంచి ఇలా కాపాడుకోండి



ఎండాకాలం ప్రారంభం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్నది. ఎక్కువగా డీహైడ్రేషన్‌కు గురవుతుంటారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు నిమ్మరసం, మంచినీళ్ల, ఫ్రూట్ జ్యూస్‌లు, కొబ్బరి నీళ్లలాంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. అయితే ద్రవపదార్థాలే కాకుండా కొన్ని రకాల ఘనపదార్థాలు కూడా డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

ఆకు కూరలు : వేసవికాలంలో డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగించే ఘన పదార్థాలలో ఆకు కూరలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయి. తోటకూర, పాలకూర లాంటి ఆకు కూరల్లో నీటి శాతం అధికంగా ఉండటమే కాకుండా చాలా పోషకాలను శరీరానికి అందిస్తాయి. క్యారెట్, కీర దోస, బీట్ రూట్ లాంటి సలాడ్స్‌తో కూడా డీహైడ్రేషన్‌కు చెక్ పెట్టవచ్చు.

జీలకర్ర: శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు జీలకర్ర ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీరంలో నీటి శాతం సమంగా ఉంచేందుకు జీలకర్ర సహాయం చేస్తుంది. రాత్రిపూట ఒక గ్లాసు నీళ్లలో కొద్దిగా పటిక బెల్లంతో పాటు జీలకర్రను నానబెట్టి, ఉదయాన్నే ఆ నీటిని వడగట్టి తాగడం వలన డీహైడ్రేషన్ సమస్య నుంచి బయటపడొచ్చు. అంతేకాకుండా ఎన్నో పోషక విలువలున్న జీలకర్ర శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడంలో దోహదపడుతుంది.

43 రోజులు..రూ.4 వేలకోట్లకు పైనే..

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్టు ఈసీ తెలిపింది. అలాగే రూ.489.31 కోట్ల విలువ చేసే 3.58 కోట్ల లీటర్ల మద్యం పట్టుబడినట్టు పేర్కొంది. ఈసారి మొత్తం రికవరీలో సింహభాగం మాదకద్రవ్యాలే ఉన్నాయి. రూ.4,658.16 కోట్ల రికవరీలో 45 శాతం మేర ఇవే ఉన్నట్టు ఈసీ తెలిపింది. మొత్తంగా రూ.2,068.85 కోట్ల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. 2019 ఎన్నికల సమయంలో రూ.1,279.9 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇక టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్, గృహోపకరణాలు, బహుమతుల రూపంలో రూ.1,142.49 కోట్ల మేర స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ వివరించింది.

34 శాతం పెరుగుదల

గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూ. 3,475 కోట్లకు పైగా నగదు పట్టుబడింది. అప్పటితో పోలిస్తే ఇది 34 శాతం అధికమని తెలిపింది. సమగ్ర ప్రణాళిక, సంయుక్త కార్యాచరణ, దర్యాప్తు సంస్థలు, భద్రతా బలగాల మధ్య సమన్వయంతో పాటు పౌరుల సహకారంతోనే ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకోగల్గుతున్నామని ఈసీ ఒక ప్రకటనలో పేర్కొంది.

నగదు:	రూ.395.39 కోట్లు
బంగారం ఇతర లోహాలు:	రూ.562.10 కోట్లు
3.58 కోట్ల లీటర్ల మద్యం:	రూ.489.31 కోట్లు
మాదకద్రవ్యాలు:	రూ.2,068.85 కోట్లు
బహుమతులు :	రూ.1,142.49 కోట్లు
మొత్తం :	రూ. 4,658.16 కోట్లు

మొదటి రెండు స్థానాల్లో రాజస్థాన్, గుజరాత్

ఇక దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు వివిధ రూపాల్లో ఈసీ స్వాధీనం చేసుకున్న మొత్తం రూ. 4,658.16 కోట్లలో రాజస్థాన్ తొలి స్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రంలో మార్చి 1 నుంచి ఏప్రిల్ 13 వరకూ మొత్తం రూ. 778.52 కోట్లు స్వాధీనం చేసుకుంది. ఆ తరువాత రూ. 605 కోట్లతో గుజరాత్ రెండో స్థానంలో నిలిచింది. ఇక తమిళనాడులో రూ.460.8 కోట్లు, మహారాష్ట్రలో రూ.431.3 కోట్లు, పంజాబ్‌లో రూ. 311.8 కోట్లు పట్టుబడింది. ఎన్నికల అక్రమాలు, అవకతవకల్లో అత్యల్పంగా లఢక్, లక్షద్వీప్ ప్రాంతాలు నిలిచాయి.

ఏపీలో 125.97 కోట్లు, తెలంగాణలో 121.84 కోట్లు పట్టివేత

తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి రూ. 125.97 కోట్ల మేర రికవరీ చేసుకోగా, తెలంగాణ నుంచి రూ. 121.84 కోట్లు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ తెలిపింది. ఏపీలో నగదు రూ.32.15 కోట్లు, రూ.19.71 కోట్లు విలువైన 10.22 లక్షల లీటర్ల మద్యం, రూ.4.06 కోట్లు మాదకద్రవ్యాలు, రూ.57.14 కోట్ల విలువైన బంగారం, వెండి ఇతర లోహాలు, రూ. 12.89 కోట్ల విలువైన టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, బహుమతులు స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ తెలిపింది. తెలంగాణలో నగదు రూ.49.18 కోట్లు, రూ.19.21 కోట్లు విలువైన 68.58 లక్షల లీటర్ల మద్యం, రూ.22.71 కోట్లు మాదకద్రవ్యాలు, రూ.12.38 కోట్ల విలువైన బంగారం, వెండి ఇతర లోహాలు, రూ. 18.45 కోట్ల విలువైన టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, బహుమతులు స్వాధీనం చేసుకున్నట్టు ఈసి తెలిపింది.

2024 లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లో జరగనున్న విషయం తెలిసిందే. తొలి విడత ఎన్నికలు ఏప్రిల్ 19న ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 26న రెండో విడత, మే 7న మూడో విడత, మే 13న నాలుగో విడత, మే 20న ఐదో విడత, మే 25న ఆరో విడత, జూన్ 1న ఏడో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఇక తొలి విడతలోనే ఇంత మొత్తంలో నగదు రికవరీ కావడం గమనార్హం. ఎన్నికలు ముగిసే సరికి ఇంకా పెద్ద మొత్తంలో నగదు పట్టుబడే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు ఈ అంశం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

నిరంకుశత్వం, అణచివేతల పర్వంలో సార్వత్రిక సమరం

(మొదటిపేజీ తరువాయి)

ఆ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేస్తున్నారు. బీజేపీకి ప్రమాదకారిగా మారే ఏ రాజకీయ నాయకుడైనా వేధింపుల ముప్పును ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఈ ఎన్నికలు రిగ్గింగ్ వంటివి కాక మరేమిటి?' అని ప్రశ్నించారు. బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావడంపై జీన్ డ్రీజ్ హర్షం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ఇది పెద్ద ప్రభావమే చూపుతుందని ఆయన తెలిపారు.

మళ్లీ తీహార్ జైలుకు కవిత

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. ఈడీ కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ ఏప్రిల్ 23 వరకు ఉండటంతో అప్పటి వరకు ఈ కస్టడీ విధిస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 23న చేపడతామని స్పష్టం చేసింది. సీబీఐ స్పెషల్ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజాకు సీబీఐ తరపున సీనియర్ న్యాయవాది పంకజ్ కుమార్ వాదనలు వినిపించారు. కవిత మూడు రోజుల విచారణతో పాటు, కేసు పూర్వాపరాలు, ఎవిడెన్స్, కేసు పురోగతి, ఇతర అంశాలతో మొత్తం 11 పేజీల రిమాండ్ కాపీని కోర్టుకు సమర్పించారు. జ్యుడీషియల్ కస్టడీ అప్లికేషన్‌లో కీలక అంశాలు పేర్కొంటూ... విచారణ సమయంలో లిక్కర్ స్కాంకు సంబంధించిన సాక్ష్యాలు, ఆధారాలను కవిత ముందు ఉంచి ప్రశ్నించిన్నట్లు తెలిపారు. కానీ కవిత విచారణకు సహకరించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ.14 కోట్ల గురించి కవితను ప్రశ్నించినట్లు తెలిపారు. అలాగే మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, బుచ్చిబాబు, విజయ్ నాయర్ సహా నిందితులతో జరిగిన సమావేశాల గురించి కవితను ఇంటరాగేషన్ చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కానీ నగదు బదిలీల గురించి కవిత సరైన సమాధానాలు ఇవ్వలేదని, ఉద్దేశపూర్వకంగా తమను తప్పు దోవ పట్టించే సమాధానాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... కవితకు 9 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు విడుదల చేసింది. అనంతరం ఆమెను పోలీసులు తీహార్ జైల్ కు తరలించారు.

ఇది బీజేపీ కస్టడీ : కవిత

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం కోర్టు హాల్ నుంచి బయటకు వస్తూ... 'ఇది సీబీఐ కస్టడీ కాదు. బీజేపీ కస్టడీ. బయట బీజేపోళ్లు మాట్లాడేదే... లోపల సీబీఐ వాళ్లు అడుగుతున్నారు. రెండేండ్లుగా అడిగిందే అడుగుతున్నారు. కొత్తదేమి లేదు' అని అన్నారు.

కోర్టు ప్రాంగణంలో మాట్లాడడంపై స్పెషల్ జడ్జి సీరియస్

కవిత మీడియా స్టేట్మెంట్లపై ట్రయల్ కోర్టు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత బెయిల్ పిటిషన్ సందర్భంగా ఆమె న్యాయవాది మోహిత్ రావును ప్రశ్నించారు. మీడియా అడిగితే ఆమె మాట్లాడారని మోహిత్‌రావు కోర్టుకు నివేదించారు. దీనిపై స్పందించిన జడ్జి ... 'ఆమె ఏం చెప్పాలనుకున్నా, విచారణ సమయంలో సీబీఐకి చెప్పాలి. ఇలా కోర్టు ఆవరణలో మాట్లాడటం మంచిది కాదు' అని వ్యాఖ్యానించారు. ఒకవేళ మాట్లాడాలి అనుకుంటే, కోర్టు బయట మాట్లాడాలి తప్ప, కోర్టు ఆవరణలో, కారిడార్లలో మాట్లాడవద్దని సూచించారు. ఇదే విషయాన్ని కవితకు చెప్పాలని, మోహిత్ రావుకు స్పష్టం చేశారు.

కుప్పకూలింది

(మొదటిపేజీ తరువాయి)

బీఎస్ఈ సెన్సెక్స్ 845 పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ 22,300 దిగువకు పడిపోయింది. ఒక్క పూటలోనే మదుపర్ల సంపద దాదాపు రూ.5 లక్షల కోట్లు ఆవిరయ్యింది. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పవనాలు భారత మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచాయి.

సూచీలు రోజంతా నష్టాల్లోనే ట్రేడింగ్ అయ్యాయి. ఏ దశలోనూ కోలుకోలేదు. ఓ దశలో సెన్సెక్స్ 900 పాయింట్లు పైగా పతనమయ్యింది. తుదకు 845.12 పాయింట్ల నష్టంతో 73,399.78కు జారింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 246.90 పాయింట్లు కోల్పోయి 73,399 వద్ద ముగిసింది. బీఎస్ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4.94 లక్షల కోట్లు పతనమై రూ.394.73 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. రెండు సెషన్లలో దాదాపు రూ.7.5లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది.

సెన్సెక్స్-30లో 27 సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, లార్సెన్ అత్యధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. ఓఎన్‌జీసీ, హిందాల్కో, మారుతి సుజూకీ, నెస్లే, బ్రిటానియా లాభాల్లో ముగిశాయి. చమురు, గ్యాస్, లోహ మినహా. మిగతా రంగాల సూచీలన్నీ నష్టాలు చవి చూశాయి.

అదానీ షేర్లకు యుద్ధం సెగ..

భారత కార్పొరేట్ దిగ్గజం అదానీకి యుద్ధం సెగ భారీగా తగులుతోంది. ఇజ్రాయిల్‌లో గౌతమ్ అదానీకి వ్యాపారాలు ఉండటమే ఇందుకు కారణం. 2022లో అదానీ పోర్ట్స్ జాయింట్ వెంచర్‌లో ఇజ్రాయిల్‌లోని హైఫా పోర్ట్‌ను దక్కించుకుంది. ఈ కాంట్రాక్ట్ విలువ రూ.12వేల కోట్ల పైనే. ఈ వెంచర్‌లో అదానీ పోర్ట్‌కు 70 శాతం వాటా ఉంది. హమాస్‌తో యుద్ధం తర్వాత ఇప్పుడు ఇజ్రాయిల్‌లో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొనడంతో అదానీ షేర్లపై ఒత్తిడి కనిపించింది. ఈ నేపథ్యంలోనే మార్కెట్ ప్రారంభమైన వెంటనే అదానీ షేర్లు 2 శాతం మేర క్షీణించాయి. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ సూచీ 2.06 శాతం పతనమై రూ.1,316.50కు పడిపోయింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ 1.87 శాతం కోల్పోయి రూ.3,149.95 వద్ద ముగిసింది.

తెలంగాణకు బీజేపీ ఏం చేసింది?

(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువులు, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి మధ్య తరగతి ప్రజల డొక్కలు ఎండబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల మంజూరు చేయలేదన్నారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలకు చెప్పుకోవడానికి పథకాలు లేవు కనుక క్యాలెండర్లు, చిత్రపటాలు, చీరలు, బ్యాగులు పంచుతున్నారని ఎద్దేవా చేశారు.

కరివేనా రిజర్వాయర్ పూర్తయిందని, కాలువలు తవ్వితే కొడంగల్ నియోజకవర్గంలోని లక్షా 20 వేల ఎకరాలకు సాగునీరు అందించొచ్చని చెప్పారు. దీనికి సంబంధించిన టెండర్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు, 13 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని, మొదటి సంతకం ఆరు గ్యారంటీలపైనే చేసి అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ చేసిందని ప్రశ్నించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ. 2500కు ధాన్యం కొనుగోలు, వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే లోపే రూ. 15 వేలు రైతుల ఖాతాలో జమవుతాయని చెప్పి విస్మరించారని అన్నారు. పింఛన్లు రూ.4000కు పెంచుతామని, ప్రభుత్వ ఉద్యోగుల లాగా ఆడబిడ్డలకు ప్రతి నెలా ఒకటో తేదీనే రూ.2500, నిరుద్యోగ భృతి రూ.4వేల హామీలు అమలుకు నోచుకోలేదన్నారు.

కేసీఆర్ కిట్లు బంద్ అయ్యాయి.. అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 90 వేల కోట్లతో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ అందించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 24 గంటల విద్యుత్ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హకీంపేట, నల్లచెర్ల, ఎంకేపల్లి గ్రామాలలో ఫార్మాసిటీ కోసం రైతుల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదని, తమ కార్యకర్తలపై కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ రూపురేఖలు మారుతాయని ఓట్లు వేసి రేవంత్‌ను గెలిపించారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్‌లో 50 వేల మెజారిటీ వస్తేనే రూ.5000 కోట్లు మంజూరు చేస్తానని, మెడికల్, ఇంజినీరింగ్, ఫార్మాసిటీ కళాశాలలు ప్రారంభమవుతాయని చెప్పడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఎస్.రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేద్దాం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించేందుకు ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారుల తో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టే వివిధ వస్తువుల రవాణాతో పాటు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసినట్టు చెప్పారు. శాంతి భద్రతల పరిస్థితి కూడా పూర్తిగా అదుపులో ఉందనీ, ఇదే రకమైన వాతావరణాన్ని పోలింగ్ వరకు మరింత పకడ్బందీగా కొనసాగించేందుకు ప్రస్తుత సమావేశం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు రాకుండా ఆయా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్-పోస్టుల్లో మరింత అప్రమత్తత అవసరమని అన్నారు. ఇప్పటికే, రాష్ట్ర పోలీస్ శాఖ ద్వారా 36 అంతరాష్ట్ర చెక్-పోస్టులు, అటవీ శాఖకు సంబంధించి మూడు అంతరాష్ట్ర చెక్-పోస్టులు, ఎక్సైజ్ శాఖ ద్వారా ఎనిమిది, వాణిజ్య పన్నుల శాఖ ద్వారా 7 చెక్-పోస్టులు 224 ఎన్ ఫోర్స్ మెంట్ బందాలు, ఏర్పాటు చేసి 24 గంటలపాటు పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణలో తీవ్రవాద ప్రాబల్యం లేదనీ, ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరగకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు మధ్య పటిష్టమైన సమన్వయంతో పని చేస్తున్నట్టు తెలిపారు.

జవహర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాసనసభ, లోక్‌సభ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నందున, వాటిని ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా తెలంగాణాతో పూర్తిస్థాయి సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి, మాదక ద్రవ్యాలు, గుడంబా నిరోధానికిగాను ఆపరేషన్ పరివర్తన పేరుతో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలనిచ్చిందని చెప్పారు. ఏపీకి ఉన్న వివిధ రాష్ట్ర సరిహద్దుల్లో పలు శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణా, డబ్బు పంపిణీ, వివిధ వస్తువుల రవాణాను కట్టుదిట్టంగా అడ్డుకుంటున్నామని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంచి సమన్వయంతో పని చేస్తున్నాయని స్పష్టం చేశారు.

సాధారణం కంటే ఎక్కువే..

న్యూఢిల్లీ : ఈ ఏడాది రుతపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సానుకూలమైన అంచనానే వెల్లడించింది. దేశంలో రుతుపవనాల కాలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతమే నమోదవుతుందని సోమవారం తన ముందస్తు అంచనాను ప్రకటించింది. ఆగస్టు-సెప్టెంబరు నాటికి లా నినా పరిస్థితులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ వివరాలను ఇక్కడ జరిగిన విలేకరులు సమావేశంలో ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహపాత్ర వెల్లడించారు.

నాలుగు నెలల (జూన్ నుంచి సెప్టెంబరు వరకు) రుతుపవనాల సీజన్‌ల్లో దేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని, దీర్ఘకాల వర్షపాతం సగటు (87 సెంమీ) యొక్క సంచిత వర్షపాతం 106 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. అలాగే ఈ వర్షకాలంలో హిందూమహాసముద్రంపై పరిస్థితులు మేఘాల కదలికలకు అనుకూలంగానే ఉంటాయని, ఉత్తరార్థ గోళంలో మంచు కవచం తక్కువగానే ఉంటాయని.. ఇవన్నీ రుతుపవనాలకు సానుకూల అంశాలని చెప్పారు. ప్రస్తుతానికి హిందూ మహాసముద్రంపై ఎల్‌నినో పరిస్థితులు ఒక మోస్తారుగా నెలకొని ఉన్నాయని, వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి ఇది కొంచెం తగ్గుతుందని, ఆ తరువాత అంటే ఆగస్టు-సెప్టెంబరు నాటికి లా లినా పరిస్థితులు నెలకుంటాయని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. ఎల్‌నినో ఉంటే వేడిగాలులు, లా లినా ఉంటే ఎక్కువ వర్షాలకు అనుకూలంగా ఉంటుంది. గత ఏడాదిలో ఎల్‌నినో కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.

దేశంలో వార్షిక వర్షపాతంలో 70 శాతం వర్షం రుతుపవనాల కారణంగానే కురుస్తుంది. దేశ వ్యవసాయ రంగానికి ఇది ఎంతో కీలకం. అలాగే, మహారాష్ట్రల్లోని ముంబయి, థానే, రాయ్‌గఢ్ జిల్లాల్లో రానున్న మూడు రోజుల్లో తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ మూడు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదయ్యే అవకాశ ఉందని తెలిపింది.


ఐపీఎల్‌లో నేడు
రాజస్థాన్ X కోల్‌కత
వేదిక : కోల్‌కత , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



చిన్నస్వామిలో సన్‌రైజర్స్ సునామీ

- ట్రావిశ్ హెడ్ మెరుపు శతకం
- హెన్రిచ్ క్లాసెన్ అర్థ సెంచరీ
- రాణించిన సమద్, మార్‌క్రామ్


సన్‌రైజర్స్ హైదరాబాద్ **287/3**



నవతెలంగాణ-బెంగళూర్

19 ఫోర్లు, 22 సిక్సర్లు.. బౌండరీల రూపంలోనే 208 పరుగులు. సోమవారం చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ అరాచక విధ్వంసం ఇది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు అందరూ చిచ్చరపిడుగులా చెలరేగటంతో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 287/3 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఐపీఎల్ చరిత్రలో ఇదే అత్యుత్తమ జట్టు స్కోరు. మార్చి 27న ఉప్పల్‌లో ముంబయి ఇండియన్స్‌పై 277 పరుగులు బాదిన హైదరాబాద్.. స్వీయ రికార్డును మరింత మెరుగుపర్చుకుంది. ట్రావిశ్ హెడ్ (102, 41 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా.. హెన్రిచ్ క్లాసెన్ (67, 31 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) అర్థ సెంచరీతో విరుచుకుపడ్డాడు. అబ్దుల్ సమద్ (37 నాటౌట్, 10 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఎడెన్ మార్‌క్రామ్ (32 నాటౌట్, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (34, 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో అదరగొట్టారు. ఆర్సీబీ బౌలర్లలో లాకీ ఫెర్గుసన్ (2/52) రెండు వికెట్లు పడగొట్టాడు.

ఆరెంజ్ ఊచకోత : టాస్ నెగ్గిన బెంగళూర్ తొలుత హైదరాబాద్‌కు బ్యాటింగ్ అప్పగించి వ్యూహాత్మక తప్పిదం చేసింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు అభిషేక్ శర్మ (34), ట్రావిశ్ హెడ్ (102) ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి వికెట్‌కు ఈ జోడీ 8.1 ఓవర్లలో 108 పరుగులు జోడించింది. అభిషేక్ రెండు ఫోర్లు, సిక్సర్లతో దండెత్తగా.. హెడ్ అరాచకం సృష్టించాడు. ఐదు సిక్సర్లు, మూడు ఫోర్లతో 20 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. అభిషేక్ నిష్క్రమించినా.. హెన్రిచ్ క్లాసెన్ (67) జతగా ఊచకోత



కొనసాగించాడు. 9 ఫోర్లు, 8 సిక్సర్లతో 39 బంతుల్లోనే సెంచరీ సాధించిన హెడ్ హైదరాబాద్‌ను భారీ స్కోరు దిశగా నడిపించాడు. విధ్వంసకారుడు క్లాసెన్ సైతం రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 23 బంతుల్లోనే అర్థ సెంచరీ అందుకున్నాడు. సెంచరీ దిశగా సాగుతున్న క్లాసెన్ నిష్క్రమించినా.. డెత్ ఓవర్లలో సమద్, మార్‌క్రామ్ మెప్పించారు. సమద్ మూడు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో మెరువగా.. మార్‌క్రామ్ రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో అలరించాడు. 15 ఓవర్లలోనే 200 పరుగుల మార్క్ దాటిన హైదరాబాద్.. 20 ఓవర్లలో 3 వికెట్లకు 287 పరుగుల ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బౌలర్లలో సన్‌రైజర్స్ బ్యాటర్లు ఎవరినీ విడిచిపెట్టలేదు.



చిన్నస్వామి స్టేడియాన్ని సన్‌రైజర్స్ ఉప్పెన ముంచెత్తింది. సిక్సర్ల సునామీ సృష్టించిన సన్‌రైజర్స్.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు సాధించింది. ముంబయి ఇండియన్స్‌పై ఇటీవల నెలకొల్పిన 277 పరుగుల రికార్డు స్కోరును ఆర్సీబీపై సోమవారం తిరగరాసింది. ట్రావిశ్ హెడ్ (102), హెన్రిచ్ క్లాసెన్ (67), అబ్దుల్ సమద్ (37 నాటౌట్), మార్‌క్రామ్ (32 నాటౌట్), అభిషేక్ శర్మ (34) విశ్వరూపం దాల్చటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 287 పరుగుల ఆల్‌టైమ్ రికార్డు స్కోరు చేసింది.

నాగల్ వరల్డ్ నం.80

కెరీర్ అత్యుత్తమ ఏటీపీ ర్యాంక్



న్యూఢిల్లీ : ఇటీవల వరుస టోర్నమెంట్లలో స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబరుస్తున్న భారత టెన్నిస్ క్రీడాకారుడు సుమిత్ నాగల్ తాజాగా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 13 స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమ స్థానం సాధించాడు. మోంటే కార్లో మాస్టర్స్‌లో రెండో రౌండ్‌కు చేరుకున్న సుమిత్ నాగల్.. సోమవారం విడుదల చేసిన ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 80వ స్థానానికి ఎగబాకాడు. 26 ఏండ్ల సుమిత్ నాగల్ మోంటే కార్లో మాస్టర్స్‌లో ఇటలీ స్టార్ ఆటగాడు, వరల్డ్ నం.38 అర్నాల్డీపై విజయంతో సంచలనం సృష్టించాడు. అంతకుముందు అర్హత రౌండ్‌లో కొబాలి, డియాజ్‌లపై మెరుపు విజయాలు నమోదు చేశాడు. ఏటీపీ 1000 టోర్నీలో ఓ విజయం సాధించిన తొలి భారత ఆటగాడిగా నిలిచిన సుమిత్ నాగల్.. ర్యాంకింగ్స్‌లోనూ ఆ జోరు చూపించాడు. ఇక మెన్స్ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో రోహన్ బోపన్న అగ్రస్థానం కోల్పోయాడు. మోంటే కార్లో మాస్టర్స్‌లో నిరాశపరిచిన బోపన్న, ఎబ్డెన్ జోడీ రెండో స్థానానికి పడిపోయింది. మెన్స్ సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్ (358), ముకుంద్ శశి కుమార్ (450) సుమిత్ నాగల్ తర్వాత భారత్ నుంచి ఉత్తమ ర్యాంకింగ్ ఆటగాళ్లుగా నిలిచారు.

విదిత్ అదరహో

- నకమురపై గుజరాతీ గెలుపు
- ఫిడె క్యాండిడేట్స్ చెస్ 2024



టోరంటో (యుఎస్ఏ) : ఫిడె క్యాండిడేట్స్ చెస్ 2024లో విదిత్ సంతోశ్ గుజరాతీ అదరగొట్టాడు. ప్రతిష్టాత్మక టోర్నీలో మూడో ఓటమి చవిచూసిన అనంతరం విదిత్ గుజరాతీ అద్భుతంగా పుంజుకున్నాడు. వరల్డ్ నం.3 హికారు నకమురు (అమెరికా)పై తొమ్మిదో రౌండ్‌లో మెరుపు విజయం నమోదు చేశాడు. ట్రై నైట్స్ డిఫెన్స్‌లో నకుమురపై 36 ఎత్తుల్లో విదిత్ గుజరాతీ పైచేయి సాధించాడు. మరో మ్యాచ్‌లో డి. గుకేశ్.. రూయ్ లోపెజ్ అండర్సెన్‌లో 41 ఎత్తుల్లో ఆర్. ప్రజ్ఞానందతో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. అలిరెజా, ఐయాన్ మ్యాచ్ సైతం డ్రాగా ముగిసింది. ఫాబియానో, నిజత్‌లు సైతం డ్రాతో సరిపెట్టుకున్నారు. 9 రౌండ్ల అనంతరం గుకేశ్ (5.5) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఐయాన్ (రష్యా) (5.5) రెండో స్థానంలో నిలిచాడు. ఆర్. ప్రజ్ఞానంద (5.0) మూడో స్థానంలో నిలువగా.. విదిత్ గుజరాతీ (4.5) ఐదో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో చైనా గ్రాండ్‌మాస్టర్ టాన్ (6.0), లీ (5.5) తొలి రెండు స్థానాల్లో నిలువగా.. రష్యా గ్రాండ్‌మాస్టర్ అలెక్సాండ్ర (5.5), లాగ్నో (5.0) టాప్-4లో కొనసాగుతున్నారు. తెలుగు తేజం కోనేరు హంపి (4.0), ఆర్. వైశాలి (2.5) వరుసగా ఆరు, ఎనిమిదో స్థానాల్లో నిలిచారు.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో..

బంగ్లాతో టీ20 సిరీస్‌కు జట్టు ఎంపిక



ముంబయి : భారత మహిళల జట్టు ఐదు మ్యాచుల టీ20 సిరీస్ కోసం బంగ్లాదేశ్‌లో పర్యటించనుంది. టీ20 సిరీస్‌లో పాల్గొనే జట్టును ఆల్ ఇండియా సీనియర్ ఉమెన్ సెలక్షన్ కమిటీ సోమవారం ఎంపిక చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోనే భారత జట్టు బంగ్లాదేశ్‌తో తలపడనుండగా.. స్టార్ క్రికెటర్ స్మృతీ మంధానకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కొనసాగించారు. భారత మహిళల జట్టులో తెలుగు క్రికెటర్లకు ఎవరికీ చోటు దక్కలేదు. భారత్, బంగ్లాదేశ్ తొలి టీ20 ఏప్రిల్ 28న ఆరంభం కానుండగా.. ఐదో టీ20 మే 9న జరుగనుంది. ఈ మేరకు బంగ్లాదేశ్ పర్యటన షెడ్యూల్, భారత జట్టును బీసీసీఐ సోమవారం ప్రకటించింది.

భారత మహిళల టీ20 జట్టు : హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతీ మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, డి. హేమలత, సజన సజీవన్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తియా భాటియా (వికెట్ కీపర్), రాధ యాదవ్, దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్, అమన్‌జోత్ కౌర్, శ్రేయాంక పాటిల్, సాయిక ఇసాకె, రేణుక సింగ్, టిటాస్ సాధు.

అగ్రజట్ల అమీతుమీ

రాయల్స్‌తో నైట్‌రైడర్స్ ఢీ నేడు





కోల్‌కత : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్లో మరో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాల్లో కొనసాగుతున్న రాజస్థాన్ రాయల్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ నేడు ఈడెన్‌గార్డెన్స్ వేదికగా అమీతుమీ తేల్చుకోనున్నాయి. రాయల్స్ ఐదు విజయాలతో ఊపుమీదుండగా.. నైట్‌రైడర్స్ నాలుగు విజయాలతో జోరందుకుంది. పాయింట్ల పట్టికలో ఈ రెండు జట్లు టాప్-2లో కొనసాగుతున్నా రాయల్స్, నైట్‌రైడర్స్ శైలి, స్టయిల్ పూర్తి విభిన్నం. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు 8.33 ఎకానమీతో అత్యుత్తమ బౌలింగ్ జట్టుగా కొనసాగుతుండగా.. కోల్‌కత నైట్‌రైడర్స్ బ్యాటర్లు 10.43 రన్‌రేట్‌తో అత్యుత్తమ బ్యాటింగ్ జట్టుగా సత్తా చాటుతోంది. ఉత్తమ బౌలర్లు వర్సెస్ ఉత్తమ బ్యాటర్లు పోరుకు ఈడెన్‌గార్డెన్స్ వేదిక కానుంది. కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్, అండ్రీ రసెల్, రింకూ సింగ్ సహా మిచెల్ స్టార్క్ కీలక కానుండగా.. రాజస్థాన్ రాయల్స్‌కు సంజు శాంసన్, జోశ్ బట్లర్, రియాన్ పరాగ్, ట్రెంట్ బౌల్ట్, యుజ్వేంద్ర చాహల్ కీలకం కానున్నారు.

నవచిత్రం


కొత్త భవిష్యత్ కోసం..



సూర్య

హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'కంగువ'. తమిళ కొత్త సంవత్సరం పూతండు ఫెస్టివల్ సందర్భంగా ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కత్తి పట్టిన యుద్ధ వీరుడు కంగువ, మోడరన్ వారియర్‌గా సూర్య ఎదురెదురుగా నిల్చున్న పోస్టర్ అందరినీ అలరిస్తోంది. గతం, వర్తమానం ఢీకొంటే కొత్త భవిష్యత్ మొదలవుతుంది అని ఈ పోస్టర్‌లో క్యాప్షన్‌గా రాశారు. దీంతో ఈ కొత్త పోస్టర్ సినిమా మీద మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది.

ఈ చిత్రాన్ని భారీ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌గా దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పది భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రం త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు అంతర్జాతీయ భాషల్లోనూ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయనున్నారు.



కమల్‌హాసన్

అవినీతిపై సేనాపతి పోరాటం

భారతీయ సినీ రంగంలో కమల్ హాసన్ తనదైన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. డైరెక్టర్ శంకర్ గురించి చెప్పాలంటే కమర్షియల్‌గా భారీ చిత్రాలను అద్భుతం అని అందరూ మెచ్చుకునేలా తెరకెక్కించటంలో సుప్రసిద్ధుడు. ఆయన సినిమాల్లో గొప్ప సామాజిక సందేశం కూడా ఉంటుంది. వీరిద్దరూ చేతులు కలిపారంటే అద్భుతమైన సినిమా మన ముందుకు వస్తుందనటంలో సందేహం లేదు. భారతీయుడు (ఇండియన్) సినిమాతో అది నిరూపితమైంది. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ కలిసి 'భారతీయుడు 2'తో సిల్వర్ స్క్రీన్‌పై మాయ చేయబోతున్నారు. 'భారతీయుడు' బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ కాంబోలో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సేనాపతిగా 'భారతీయుడు' చిత్రంతో కమల్ హాసన్ తిరుగులేని విజయాన్ని సాధించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' రానుండటంతో మూవీపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. గ్రిప్పింగ్ కథనంతో ఈ మూవీ మరింతగా ప్రేక్షకులను మెప్పించనుంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సేనాపతిగా మరోసారి కమల్ హాసన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయబోతున్నారంటూ అభిమానులు, సినీ ప్రేమికులు, ట్రేడ్ వర్గాలు సహా అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసిన శంకర్ ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తి చేయటంపై దృష్టి సారించారు. మే నెలాఖరున పవర్‌ప్యాక్డ్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది. జూన్‌లో భారీగా ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసినప్పటి నుంచి మూవీ ఎలా ఉండబోతుందా అని అందరూ ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో 'జీరో టాలరెన్స్' లైన్ ఈ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాయి. కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రవివర్మన్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎ.శ్రీకర ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్‌గా టి.ముత్తురాజ్‌గా వర్క్ చేస్తున్నారు.

నవ్వుతూనే ఉంటారు



ఫరియా అబ్దుల్లా, అల్లరి నరేష్

ఆద్యంతం వినోదాన్ని పంచడానికి అల్లరి నరేష్ 'ఆ ఒక్కటి అడక్కు' చిత్రంతో సిద్ధం అయ్యారు, ఇప్పటికే విడుదలైన టీజర్ నవ్వుల జల్లులు కురిపించి, సినిమా పై అంచనాలు పెంచింది. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజీవ్ చిలక నిర్మించిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాత. ఈ సినిమాలో అల్లరి నరేష్ సరసన ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది.

సోమవారం మేకర్స్ ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. వేసవి సెలవులను పురస్కరించుకుని మే 3న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు.

చాలా కాలం తర్వాత అల్లరి నరేష్‌ని పూర్తి ఫన్ క్యారెక్టర్‌లో చూడాలని ఆయన అభిమానులతోపాటు ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. టాలీవుడ్ బిగ్ డిస్ట్రిబ్యూషన్ హౌస్ ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ ఎల్ ఎల్ పి తెలంగాణకు సంబంధించిన థియేట్రికల్ హక్కులను పొందింది. ఈ సినిమాని వారు తెలుగు రాష్ట్రాల్లో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సూపర్ యోధ నేపథ్యంలో



తేజ సజ్జా

'హను-మాన్' చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత డైరెక్టర్ కార్తీక్ ఘట్టంనేనితో కలిసి హీరో తేజ సజ్జా ఓ సినిమా చేయబోతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ నెం.36 గా నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ గ్రాండ్ స్కేల్‌లో పాన్ ఇండియా మూవీగా నిర్మించబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విడుదల చేసిన పోస్టర్ అందరిలోనూ మరింత క్యూరియాసిటీ పెంచింది.

'హను-మాన్' చిత్రంలో సాంప్రదాయ దుస్తులలో కనిపించిన తేజ ఇక్కడ మాత్రం స్టైలిష్ మేక్ ఓవర్‌తో సూపర్ యోధాగా కనిపిస్తున్నారు. ఈ సినిమా టైటిల్‌ని మేకర్స్ ఈనెల 18న ప్రకటించనున్నారు. 'ఈగిల్' తర్వాత కార్తీక్ ఘట్టంనేని, పిఎంఎఫ్‌కు ఇది వరుసగా రెండవ ప్రాజెక్ట్. సూపర్ యోధా సాహసోపేతమైన కథగా దీన్ని స్క్రీన్‌పైకి తీసుకు రాబోతున్నారు.

సమాజానికి ఉపయోగపడే సినిమా



బిగ్ బాస్ ఫేం అర్జున్ అంబటి హీరోగా, కిశోరి ధాత్రక్ హీరోయిన్‌గా రవిశంకర్, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'.

సతీష్ రాపోలు దర్శకత్వంలో బేబీ వైష్ణవి సమర్పణలో శ్రీమణి ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సినిమా ఈనెల 19న ప్రేక్షకుల ముందు రానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ లాంచ్, ప్రీరిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించింది. ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్ మొదటి పాటను, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రెండో పాటను, ట్రైలర్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ మాట్లాడుతూ,'ఇదొక మంచి సోషల్ పాయింట్ మీద తీసిన సినిమా. ఇలాంటి సినిమాలు బాగా ఆడాలి. అందరూ తప్పకుండా మా సినిమాను చూడండి' అని చెప్పారు.

'నేను చిన్నప్పటి నుంచి చిరంజీవికి అభిమానిని. అలాంటి వాళ్ల స్ఫూర్తితోనే ఇండస్ట్రీకి వచ్చాను. దర్శకుడు చెప్పిన కథ చాలా బాగా నచ్చింది. ఆయన ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు. అందరి సహకారంతో అవుట్‌పుట్ బాగా వచ్చింది. సినిమా ప్రతిఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని నిర్మాత రాఘవేంద్రగౌడ్ అన్నారు.

డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం ప్రతి ఒక్క టెక్నీషియన్ అద్భుతంగా పని చేశారు. చిన్నపిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని స్పెషల్ ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి. అవి థియేటర్లో చూస్తేనే బాగుంటుంది. ఇది చిన్న సినిమా కాదు. కంటెంట్ ఉన్న సినిమా' అని తెలిపారు.

హీరో అర్జున్ అంబటి మాట్లాడుతూ, 'ఈ సినిమా 90 శాతం చిత్రీకరణ పోచంపల్లిలో చేశాం. ఈ సినిమా కోసం అందరూ బాగా కష్టపడ్డారు. ఓ మంచి సినిమాలో మంచి పాత్ర చేసే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాలో నటించినందుకు చాలా గర్వంగా ఉంది' అని అన్నారు.

ఓటర్లకు లక్ష్మీ కటాక్షం



సాయికుమార్

ఇప్పటి వరకు తెలుగులో చాలా తక్కువ సెటైరికల్ కాన్సెప్ట్ వచ్చాయి. అందులోనూ పొలిటికల్ సెటైరికల్ కామెడీ మాత్రం ఇంకా తక్కువ వచ్చాయి. ఇప్పుడు అదే తరహాలో ప్రేక్షకులను నవ్వించడానికి 'లక్ష్మీకటాక్షం' సినిమా నుండి డైలాగ్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. రాజకీయనాయకులు ఒక ఓటుకి ఇంత డబ్బులు అని నిర్ణయిస్తారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటరే తన రేటును తాను నిర్ణయించుకుంటాడు.

మహతి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై వస్తున్న ఈ 'లక్ష్మీ కటాక్షం : ఫర్ ఓట్'కు రచన, దర్శకత్వం సూర్య అందించారు. యు.శ్రీనివాసుల రెడ్డి నిర్మించగా, అభిషేక్ రుఫుస్ సంగీతం అందించారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలకు ప్రతిబింబంగా ఉన్న ఈ డైలాగ్ పోస్టర్‌కు అన్ని వర్గాల ప్రేక్షకుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. సాయి కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం వినయ్, అరుణ్, దీప్తి వర్మ మెయిన్ లీడ్స్‌గా చేస్తున్నారు. ఈ కథా నేపథ్యం మొత్తం తాడిపత్రిలో చిత్రీకరించినట్టు యూనిట్ తెలిపింది. త్వరలోనే సరదాగా ఉండే టీజర్, ట్రైలర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తామని మేకర్స్ పేర్కొన్నారు. చరిస్మా శ్రీకర్, హరి ప్రసాద్, సాయి కిరణ్ ఏడిద, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కే.పురుషోత్తం రెడ్డి, రచన, డైరెక్టర్: సూర్య, మ్యూజిక్: అభిషేక్ రుఫుస్, డిఓపి: నని ఐనవెల్లి, ఎడిటర్: ప్రదీప్ జే, సౌండ్ డిజైన్: మురళీధర్ రాజు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886